వాస్తు
గత వారపత్రికల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
3-9-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 215 పేజీలు: 10+4 వెల: 6.50

టోల్‌ప్లాజాలపై 7 రాష్ట్రాల్లో ఇడి దాడులు 3
'ట్రంప్ జలసంధి'గా పేరు మారుతున్న హార్ముజ్ 7

# రాహుల్‌ని ప్రధాని చేద్దాం

## అదే వైఎస్‌కు అసలైన నివాళి

రైతులకు ఉచిత విద్యుత్‌పై తొలిసంతకం చేసిన గొప్పనేత వైఎస్

ప్రాణహిత, ఎస్ఎల్‌బిసి, కల్వకుర్తి పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తాం

ఢిల్లీలో కెవిపి-వైఎస్ఆర్ ఫౌండేషన్ అవార్డుల ప్రదానంలో సిఎం రేవంత్


బుధవారం ఢిల్లీలో కెవిపి-వైఎస్ఆర్ ఫౌండేషన్ కార్యక్రమంలో ఖర్గే, సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు2:** వైఎస్ ఆశయాలను మనమంతా ముందుకు తీసుకెళ్ళాలి,దేశానికి బలమైన నాయకుడు రాహుల్ గాంధీ, రాహుల్ గాంధీని దేశానికి ప్రధాని చేయడమే వైఎస్‌కు నిజమైన నివాళి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ చివరి కోరిక నెరవేర్చాలంటే రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలి, ఇందుకు మీ అందరి మద్దతు అవసరం ఉందన్నారు. మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో మనమంతా కలిసి కష్టపడి రాహుల్ గాంధీని ప్రధాని చేసుకుందాం అని పిలుపునిచ్చారు. బుధవారం ఢిల్లీలో కేవీపీ-వైఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'దేశ తొలిప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు, నెహ్రూ ముందు చూపుతో దేశం ఆకలి కేకల నుంచి ఆహార ఎగుమతుల వరకు చేరుకుంది అని పేర్కొన్నారు. దేశంలో మొట్టమొదటి సారిగా రైతు పండించే పంటకు మద్దతు ధరను అందించే చర్యలు చేపట్టిన ఘనత ఇందిరాగాంధీది, దేశంలో ప్రతీ ఒక్కరికీ ఆహార భద్రత కల్పించాలని ఆహార భద్రత చట్టాన్ని తీసుకొచ్చారని చెప్పారు.

>>2

గ్లోబల్ సమ్మిట్‌కు రండి
రక్షణమంత్రి రాజ్‌నాథ్‌ను ఆహ్వానించిన సిఎం
7
హెలిటూరిజం పెంచండి
కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం

## ముందు సిఎంపై చర్చ తీసుకోవాలి

ఖర్గేను కలిసి అన్నీ చెప్పా..

అధిష్ఠానం నిర్ణయం కోసం చూస్తున్నా..

సుస్మితకు మాట్లాడే హక్కుంది.. వద్దని ఎలా చెప్తాను?

బిసిలకు ఓ న్యాయం, ఇతరులకు మరో న్యాయమా?

ఢిల్లీలో మంత్రి కొండా సురేఖ సంచలన వాఖ్యలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు2:** కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా

>>2


బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్‌తో భేటీ అయిన మంత్రి తుమ్మల

## విత్తన చట్టం అమలు చేయండి

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** కేంద్ర ముసాయిదాపై తెలంగాణ ప్రభుత్వం సూచించిన సవరణలను పరిగణనలోకి తీసు కుని పూర్తిస్థాయి విత్తన చట్టాన్ని త్వరితగతిన అమలు లోకి తీసుకు రావాలని కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి

>>2



5 అమెరికాలో శాశ్వత నివాసానికి 179 యేళ్ల నిరీక్షణ!


5 ఇరాన్‌పై దాడులు భద్రతకు పెనుముప్పు
ఎస్‌సిఒ కీలక ప్రకటన
షాంఘై సహకార సదస్సులో 'బిష్కెక్ డిక్లరేషన్'కు ఆమోదం
దౌత్యమే పరిష్కార మార్గం: భారత్


5 అయోధ్య రామ్ మందిర్ సిఇఒగా మాజీ ఐఎఎఫ్ అధికారి జితేంద్ర

## సిమెంటు పైపైకి!




బస్తాకు రూ.30-40 పెంపు

పండుగల సీజన్‌లో మరింత డిమాండ్

50 కిలోల బస్తా రూ. 285 నుంచి 315కు పెరిగే అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబరు 2:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సిమెంట్ ధరలు మరోసారి పెరిగే అవకాశం కనిపిస్తోంది. సెప్టెంబర్ 5 నుంచి 50 కిలోల సిమెంట్ బస్తాపై హోల్‌సేల్ ధరలను రూ.3040 వరకు పెంచేందుకు సిమెంట్ తయారీ సంస్థలు సిద్ధమవుతున్నట్లు డీలర్ల సమాచారం. పెరిగిన ముడిసరుకు వ్యయాలు, ప్యాకేజింగ్, రవాణా ఖర్చులతో పాటు రానున్న పండుగల సీజన్‌లో డిమాండ్ పుంజుకుంటుందన్న అంచనాలు ఈ ధరల పెంపునకు కారణంగా తెలుస్తోంది. ప్రతిపాదించిన ధరల పెంపు అమల్లోకి వస్తే ఏపీ, తెలంగాణలో హోల్‌సేల్ సిమెంట్ ధరలు సుమారు 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది.ప్రస్తుతం 50 కిలోల బస్తా సుమారు రూ.285గా ఉన్న ఏకేటగిరీ సిమెంట్ ధర రూ.315కు చేరే అవకాశం ఉంది. అంటే బస్తాకు రూ.30 లేదా దాదాపు 10.5

>>2


## కాంగ్రెస్ అసమర్థతకు 1000 రోజులు

అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలం

ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు..

నాలుగున్నర లక్షల కోట్ల అప్పు ఒక్కటే కనిపిస్తోంది

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై ఛార్జిషీట్‌ను విడుదల చేసిన కెటిఆర్



బుధవారం తెలంగాణ భవన్‌లో ఛార్జిషీట్ విడుదల చేస్తున్న కెటిఆర్, హరీష్‌రావు తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు2:** కాంగ్రెస్ పార్టీ అసమర్థ అరాచక పాలన 1000 రోజుల పాలన అని విమర్శిస్తూ మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో ఛార్జ్ షీట్‌ను భారత రాష్ట్ర సమితి తరఫున విడుదల చేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలన పైన తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఒక మాటలో చెప్పాలంటే 1000 రోజుల పాలన అంటే ఇది పాలన కాదు ప్రజా ప్రజాపీడన అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి పట్టిన శనికి 1000 రోజులు నిండాయి అన్నారు. ప్రజల పైన కాంగ్రెస్ పార్టీ దండయాత్ర మొదలుపెట్టి సరిగ్గా 1000 రోజులు అయింది అన్నారు. ఆ రంగం ఈ రంగం అని కాకుండా అన్ని రంగాల్లో కాంగ్రెస్ పార్టీ అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. 1000 రోజుల్లో అన్ని పనులు చేస్తామని చెప్పి 1000 రోజులు అయినా తెలంగాణ ప్రజలకు నిత్య నరకం చూపిస్తున్నారు అన్నారు. ఆర్థిక విధ్వంసం నుంచి సామాజిక సంక్షోభం సాంస్కృతిక విద్రోహం అన్ని రంగాల్లో 1000 రోజుల పాటు తెలంగాణలో కొనసాగిందన్నారు. రైతన్నలనుంచి ఆడబిడ్డల దాకా నిరుద్యోగులు విద్యార్థులు సబ్బండ వర్గాలు కులవృత్తులు ఇలా అందరినీ అష్ట కష్టాలు పెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన అభయహస్తం మేనిఫెస్టో ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు 13 డిక్లరేషన్లు ఆరు గ్యారెంటీలతో చేసినమోసం అతిపెద్ద దారుణమైన ద్రోహం అన్నారు.

>>2

## 6 గ్యారంటీలు పేరుతో చీటింగ్



ఒక్క హామీని కూడా నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం

విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు అంతా రోడ్డెక్కుతున్నారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి వెయ్యి రోజులు పూర్తయ్యాయయని, కానీ ఈ వెయ్యి రోజుల్లో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమిటని ప్రశ్నించుకుంటే.. రేవంత్ ప్రభుత్వం ఆడుతున్న అబద్ధాలు, అనవసర ఆర్భాటాలు, ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల అమల్లో మోసం, రోజుకో కొత్త సాకు వెతుక్కోవడం మాత్రమే కనిపించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తెలంగాణకు వచ్చి హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానంగా మారింది. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచిపోవడం, ఎన్నికలు వచ్చినప్పుడు మళ్లీ కొత్త హామీలు ఇవ్వడం.. ఇదే కాంగ్రెస్ మార్కు పాలన అని మరోసారి తెలంగాణ వేదికగా సుస్పష్టమైంది. నాడు బిఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ఒకే రకమైన ఆలోచనతో 12 ఏళ్లుగా తెలంగాణ ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెయ్యిరోజులు పూర్తిచేసుకున్న సందర్భంలో.. ఉద్యోగ సంఘాలు తమ

>>2

సిఎం అయ్యాకే కెసిఆర్ అసెంబ్లీకి వస్తారు: కెటిఆర్ 2




## ప్రభుత్వశాఖలపై 70వేల ఫిర్యాదులు

కేంద్ర విజిలెన్స్ కమిషన్ నివేదిక

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:** ప్రభుత్వ సంస్థలు, విభాగాలపై గత ఏడాది 70,584 అవినీతి ఫిర్యాదులు అందినట్లు కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) వార్షిక నివేదిక వెల్లడించింది. వీటిలో బ్యాంకులు, రైల్వేలకు సంబంధించిన ఫిర్యాదులే అత్యధికంగా ఉన్నాయి. కమిషన్‌కు అనుబంధంగా పనిచేసే చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లు (సీవీఓలు) అందుకున్న 70,584 ఫిర్యాదుల్లో 2025 డిసెంబర్ 31 నాటికి 64,905 ఫిర్యాదులను పరిష్కరించారు. మరో 5,679 ఫిర్యాదులు విచారణలో ఉన్నాయని సివిసి తెలిపింది. వీటిలో 2,002 ఫిర్యాదులు మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు నివేదిక తెలిపింది.సీవీఓలు ఫిర్యాదులపై విచారణను సాధారణంగా మూడు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై సీవీసీ ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటోంది.

>>2

## అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా వెయ్యి రోజులు



22ఎ భూములపై అసెంబ్లీలో మాట్లాడుదాం

కెటిఆర్ హద్దు మీరితే ప్రజలు క్షమించరు

మీడియాతో మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు2:** తమ 1000 రోజుల పరిపాలన అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా సాగుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ధనిక రాష్ట్రాన్ని అప్పులమయంగా అప్పజెప్పినా, ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. వరుస ఎన్నికల్లో ఓడినా బీఆర్ఎస్ నాయకులకు జ్ఞానోదయం కాలేదని ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లతో కలిసి బుధవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై కెటిఆర్ చార్జ్‌షీట్ విడుదల సందర్భంగా చేసిన ఆరోపణలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు మళ్లీ క్షమించే అవకాశం లేదని చురకలు అంటించారు. రాహుల్‌గాంధీ విషయంలో కేటీఆర్ సంస్కారహీనంగా మాట్లాడారని మంత్రి మండిపడ్డారు. ప్రజాపాలనకు వెయ్యి రోజులు అయ్యిందని, సామాన్య ప్రజల కష్టాలు తీర్చేందుకు కృషి చేశామని, ముఖ్యమైన అనేక

>>2



## 1100 దాటిన నేపాల్ మృతులు

ఇంకా సాగుతున్న వెలికితీత

**ఖాట్మండు,సెప్టెంబరు 2:** నేపాల్‌ను భయంకరమైన ఆకస్మిక వరదలు అతలాకుతలం చేసిన సంగతి తెలిసిందే. ఈ జల ప్రళయం కారణంగా తీవ్ర ప్రాణనష్టం జరిగింది. వరదల దాటికి బలైన వారి సంఖ్య 1,127కు పెరగ్గా, మరో 4,858 మంది గల్లంతై ఆచూకీ లేకుండా పోయారు. చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 348 మృతదేహాలను వెలికితీయగా,

>>2



బుధవారం నాసిక్ ఎయిర్‌పోర్టులో రాహుల్‌కు స్వాగతం పలుకుతున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు

## 1100 దాటిన నేపాల్ మృతులు

>> నవల్‌పరాసి ఈస్ట్‌లో 217, నవల్‌పరాసి వెస్ట్‌లో 190, నువాకోట్‌లో 155 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే ఇతర జిల్లాలైన ధాడింగ్, గోర్ఖా, రసువా, తనాహులలోనూ భారీగా ప్రాణనష్టం సంభవించింది. భారీ ఎత్తున సహాయక చర్యలు: బాధితుల కోసం సుమారు 7,912 మంది పోలీసు సిబ్బందిని రంగంలోకి దించారు. ఇప్పటివరకు వివిధ వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 6,541 మందిని రెస్క్యూ టీమ్‌లు సురక్షితంగా బయటికి తీసుకువచ్చాయి. భోటే కోషి నది పొంగిపొర్లడంతో రసువా వద్ద ఉన్న కీలకమైన జలవిద్యుత్ ప్రాజెక్టులు, భూగర్భ టన్నెళ్లలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు నేపాల్ ఆర్మీతో పాటు భారత్, చైనాలకు చెందిన టన్నెల్ రెస్క్యూ నిపుణులు రంగంలోకి దిగారు. ఇప్పటివరకు లభ్యమైన మృతదేహాల్లో కేవలం 95 మృతదేహాలను మాత్రమే కుటుంబ సభ్యులు గుర్తించి తీసుకెళ్లారని నేపాల్ ప్రధాని బాలెన్ షా తెలిపారు. గుర్తు పట్టలేని విధంగా ఉన్న శవాలకు డీఎన్ఏ నమూనాలు సేకరించి భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు.

## 6 గ్యారంటీలు పేరుతో చీటింగ్

>> డిమాండ్లను నెరవేర్చాలంటూ రోడ్డెక్కడం అత్యంత బాధాకరమైన విషయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల పొట్ట కొడుతుందని, సెప్టెంబర్ 1న తెలంగాణ ఉద్యోగుల జెఏసి ఆధ్వర్యంలో సచివాలయం, ఇతర కార్యాలయాలు, జిల్లా కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో తమ డిమాండ్ల నెరవేర్చాలంటూ రోడ్డెక్కారు. సర్కారు తమను చీటింగ్ చేసింది కాబట్టే.. వాళ్లు నిరసన తెలపాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉద్యోగస్తులకు చాలాకాలంగా ఉన్న పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. పూర్తి స్థాయిలో.. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలు చేయకపోగా.. ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం కోత విధిస్తుందన్నారు. హెల్త్ కార్డులు, ఆసుపత్రులతో ఒప్పందం చేసుకోకముందే అన్నారు. పూర్తి స్థాయి క్యాష్‌లెస్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురాకముందే నిబీళీ పేరుతో ఉద్యోగుల నుంచి మోసపూరితంగా ప్రభుత్వం డబ్బులు వసూలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బెనెఫిట్స్ విషయంలోనూ.. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గంగా ఉంది. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. వెయ్యి రోజులు పూర్తయినా ఆ హామీ ఏమైందో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలి. ఎన్నికలు వచ్చినపుడు.. మహిళలకు అబద్ధాలు చెప్పి ఓట్లు వేయించుకోవడం తప్ప.. వాళ్లకు ఇచ్చిన ఏ మాటనైనా నిలబెట్టుకోలేదు. అందుకే ఒక్కో మహిళకు రూ. 80 వేలకు పైగా బాకీ పడిన చీటింగ్ సర్కార్ గా చరిత్రలో నిలిచిపోతుంది. కాలేజీకి వెళ్లే ఆడబిడ్డలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని మోసం చేశారు. వృద్ధులు, వితంతువులకు చీటింగ్!వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కారు. తెలంగాణలోని వృద్ధులు, వితంతువులు అడుగుతున్న ఒక్క ప్రశ్న రూ.4,000 పెన్షన్ ఎక్కడ? దీనికి రేవంత్ సమాధానమేంటి? ఇది వితంతువులను, వృద్ధులను చీటింగ్ చేసిన సర్కార్ అన్నారు. ఒక ప్రభుత్వానికి వెయ్యి రోజులంటే.. ఇదేమీ తక్కువ సమయం కాదు. ఈ వెయ్యి రోజుల్లో.. తెలంగాణలోని ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇది కేవలం హామీల వైఫల్యం మాత్రమే కాదు. ప్రజలకు చేసిన నమ్మకద్రోహం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇక ప్రచారాలు, ప్రకటనలు, సాకులు పక్కనపెట్టి వెయ్యి రోజుల్లో ఎన్ని హామీలు పూర్తిగా అమలు చేశారో, ఎన్ని హామీలు పెండింగ్‌లో ఉన్నాయో, ఎన్ని హామీలను వదిలేశారో శ్వేతపత్రం విడుదల చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు వెయ్యి రోజులు పూర్తయ్యాయి. తెలంగాణ ప్రజలు మిగిలిన 825 రోజుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని గద్దెదించాలనే స్పష్టమైన ఆలోచనతో ఉన్నారు అని పేర్కొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా వెయ్యి రోజులు

>> అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను చెల్లించామని, గత ప్రభుత్వం చేసిన అప్పులు చెల్లిస్తున్నామని, రైతును రాజును చేసేలా పరిపాలన చేస్తున్నామన్నారు. రైతులకు రూ.1.74 లక్షల కోట్లు ఇచ్చామన్నారు. వరి వేస్తే ఉరేనని ఆనాటి దొర అన్నారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం రాగానే వరికి బోనస్ ఇస్తున్నామని, వరి సాగులో దేశంలోనే ప్రథమస్థానం సాధించామని, రైతులకు భరోసా కల్పించేలా పాలన కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఉపఎన్నికల్లో ఎన్ని పొర్లు దండాలు పెట్టినా కాంగ్రెస్ గెలిచింది. ఉప ఎన్నికల్లో ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. ప్రజలు అసహ్యించుకుంటున్నా బీఆర్ఎస్ మారలేదని దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీ ఎక్కడ చచ్చాడు అని సంస్కారహీనంగా కేటీఆర్ మాట్లాడారని మండిపడ్డారు. 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఎ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ వెయ్యి రోజుల్లో రూ.22 కోట్ల ప్రజల సొమ్మును జీతభత్యాల రూపంలో పొందారు. రూ.22 కోట్లు తీసుకుని ఒక్కసారైనా అసెంబ్లీలో ప్రజల గురించి మాట్లాడారా?. ప్రతిపక్షనేత హోదాలో ఉండే నైతిక అర్హత కేసీఆర్‌కు లేదు. ప్రతిపక్షనేత, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గౌరవం నిలబెట్టుకోవాలి. ప్రజల కష్టాల గురించి ఏనాడు మాట్లాడని వ్యక్తికి ప్రతిపక్షనేత హోదా ఎందుకు? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ 3,475 రోజుల పాలన కంటే, మా వెయ్యి రోజుల పాలనే బాగుందని ప్రజలు చెబుతున్నారు. మీరు పేదలకు ఇళ్లు ఇచ్చారా?, రేషన్ కార్డులు ఇచ్చారా?. కొత్తగా మరో మూడు లక్షల పెన్షన్లు ఇవ్వబోతున్నాం. ఖమ్మంలో పోడు భూముల సమస్య పరిష్కరిస్తానని కేసీఆర్ అన్నారు. విలువైన భూములను పేదలకు ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు అడ్డుకునే కుట్రలు చేస్తున్నారు. మీరు ఆర్టీసీ ఎక్స్ రోడ్డు నుంచి అసెంబ్లీ వరకు పొర్లు దండాలు పెట్టినా మేము పేదలకు ఇళ్లు కట్టించి తీరుతాం అని పేర్కొన్నారు. నేను వాస్తవాలు చెబితే మీరు తల ఎక్కడ పెట్టుకుంటారో చూద్దాం. ధరణితో మీరు కొల్లగొట్టిన భూములపై విచారణ జరుగుతోంది. మీరు ఏం వ్యాపారం చేశారని.. వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి..? అని ప్రశ్నించారు.

## సిమెంటు పైపైకి!

>> శాతం పెంపు ఉండొచ్చు. అలగే ప్రస్తుతం రూ.250 వద్ద ఉన్న బీకేటగిరీ సిమెంట్ ధర రూ.275కు పెరిగే అవకాశం ఉంది. ఇది సుమారు 10 శాతం పెరుగుదల. అయితే కంపెనీలు బస్తాకు రూ.30 40 వరకు పెంచాలని భావిస్తున్నప్పటికీ, వాస్తవ పెంపు బ్రాండ్, కేటగిరీని బట్టి మారే అవకాశం ఉందని డీలర్లు చెబుతున్నారు .దక్షిణ భారతంలో ఇప్పటివరకు ఇదే భారీ పెంపుఏపీ, తెలంగాణలో ప్రతిపాదించిన ధరల పెంపు దక్షిణ భారతంలోని ఇతర రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన పెంపుతో పోలిస్తే గణనీయంగా ఎక్కువగా ఉంది. ఆగస్టులో తమిళనాడు, కేరళ, కర్ణాటకలో సిమెంట్ తయారీ సంస్థలు బస్తాకు సుమారు రూ.10 వరకు ధరలు పెంచాయి. ప్రస్తుతం తమిళనాడులో సిమెంట్ బస్తా ధర రూ.310-315, కేరళలో రూ.320, కర్ణాటకలో రూ.320-330 వరకు ఉంది. ఈ నేపథ్యంలో ఏపీ, తెలంగాణలో రూ.30 40 పెంపు అమలైతే, దక్షిణ భారతంలోని ఇతర మార్కెట్లలో ఇటీవలి ధరల పెరుగుదల కంటే ఇది చాలా ఎక్కువగా ఉంటుంది. ప్యాకేజింగ్, రవాణా ఖర్చుల భారంప్యాకేజింగ్, రవాణా ఖర్చులు పెరగడంతో సిమెంట్ కంపెనీలపై ఇన్‌పుట్ వ్యయాల భారం పెరిగింది. ఈ నేపథ్యంలో ధరలను పెంచేందుకు కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సిమెంట్ ధరలు సగటున 50 కిలోల బస్తాకు సుమారు రూ.15 మేర పెరిగాయి. ప్రాంతాల వారీగా చూస్తే తూర్పు భారత్‌లో బస్తాకు సుమారు రూ.27 వరకు పెంపు నమోదైంది. పశ్చిమ, ఉత్తర, దక్షిణ భారతావనిలో రూ.13-15 వరకు, మధ్య భారత్‌లో రూ.79 వరకు ధరలు పెరిగాయి. పెరిగిన ఇన్‌పుట్ వ్యయాల ప్రభావాన్ని భర్తీ చేసేందుకు సిమెంట్ కంపెనీలు 50 కిలోల బస్తాకు మరో రూ.35-40 వరకు ధర పెంచాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పెరిగిన వ్యయాల ప్రభావం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి, రెండో త్రైమాసికాల్లోనూ కొనసాగవచ్చని, అందువల్ల కంపెనీల మార్జిన్లను కాపాడుకోవడంలో ధరల పెంపు కీలక అంశంగా మారుతుందని వారు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌కు చెందిన సిమెంట్ డిస్ట్రిబ్యూటర్స్ డీలర్ ఒకరు మాట్లాడుతూ ఏపీ, తెలంగాణలో ప్రతిపాదించిన ధరల పెంపునకు పెరుగుతున్న వ్యయాలతో పాటు పండుగల సీజన్‌లో డిమాండ్ పెరుగుతుందన్న అంచనా కూడా కారణమని తెలిపారు. పండుగల సీజన్ కంపెనీలకు అధిక ధరలను అమలు చేసేందుకు అనుకూలమైన అవకాశాన్ని కల్పించవచ్చని పేర్కొన్నారు.

### వారం - వర్జ్యం

03-09-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి.సప్తమి రా.2.24
న.కృత్తిక రా.12.28
వ.మ.1.05 - మ.2.36
దు.1. ఉ.10.02-ఉ.10.52
దు.2. మ.2.54-మ.3.43
రాహు. మ.1.30-మ.3.00
శుభ ఉ.8.00-ఉ.9.00

### వార్తాఫలం

**మేషం** : ప్రముఖులతో పరిచయాలు. సంఘంలో గౌరవం లభిస్తుంది. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**వృషభం** : పనులలో జాప్యం జరిగినా సన్నిహితుల సహాయంతో పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం** : దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది.

**కర్కాటకం** :కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. విలువైన వస్తువులు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

**సింహం** :బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనల్లో తొందరపాటు వద్దు. ధనలాభం.

**కన్య** : విందు, వినోదాలు, శుభకార్యాల్లో చురుకుగా పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి.

**తుల** : పనులలో ఏర్పడిన ఆటంకాలు తొలగుతాయి. సోదరులతో ఏర్పడిన ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృశ్చికం** : నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగాలలో అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు.

**ధనుస్సు** :ఉద్యోగ, వివాహ యత్నాలు సానుకూలం. ఆర్థికాభివృద్ధి సాధిస్తారు. సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మకరం** :దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**కుంభం** : ఋణాలు తీరుస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు . వస్తు సేకరణ.

**మీనం** : కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఆర్థిక ప్రగతి సాధిస్తారు. ఆస్తిలాభం పొందుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కాంగ్రెస్ అసమర్ధతకు 1000 రోజులు

>> కాంగ్రెస్ పార్టీ చేసిన 1000 రోజుల పాలన పైన రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అందుకే విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగులు అంగన్వాడీలు అన్నదాతలు రైతన్నలు ఇలా ప్రతి ఒక్కరు కాంగ్రెస్ ప్రభుత్వం పైన తిరగబడుతున్నారు అన్నారు. నిరసనలతోని తిరగబడుతున్నారు అన్నారు. కనీసం 1000 రోజుల పూర్తి అయిన సందర్భంగా అయినా హైదరాబాద్‌లో ఉండి తమ గొప్పలు చెప్పుకుంటారు అనుకుంటే ఢిల్లీకి వెళ్లి తమ అవినీతి సొమ్ముల వాటాల పంపిణీని పంచాది పెట్టుకుంటున్నారు అన్నారు. ఢిల్లీకి గులాములుగా మారి తమ స్వతంత్రాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఈ 1000 రోజుల పాలన అన్నారు.
ఒక్కటంటే ఒక్క రూపాయి లాభం ప్రజలకు చేయకున్నా నాలుగున్నర లక్షల కోట్ల అప్పు చేసిన అవినీతి పాలన కాంగ్రెస్ పాలన అన్నారు. జెంజీ భాషలో చెప్పాలి అంటే ఈ 1000 రోజుల పాలన గురించి అంటే అసమర్థత ప్రో మాక్స్ అవినీతి అల్ట్రా మాక్స్ అరాచకం ఐమాక్స్ అన్నారు. అందుకే రాష్ట్రంలోని ప్రతి ఒక్క వర్గం 1000 రోజుల కాంగ్రెస్ పాలన పైన ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలనలో మళ్ళీ తిరిగి యూరియా కోసం చెప్పులు లైన్లో పెట్టే పరిస్థితి తీసుకొచ్చిందన్నారు. రైతన్నల చేతికి బేడీలు వేసిందన్నారు. విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. 12000 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయలతో విద్యార్థుల జీవితాలను ఆగమం చేస్తున్నారన్నారు. ఒకనాటి లాభసాటి వ్యవసాయాన్ని ఈరోజు మళ్ళీ తెర్లు చేసిందన్నారు. 1000 రోజుల్లో కాంగ్రెస్ సాధించింది ఏమన్నా ఉంది అంటే 1000 మంది రైతన్నల ఆత్మహత్యలు చేసుకునేలా చేయడమే అని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో రైతన్నలకు రైతు భరోసా ఇవ్వకపోవడం ఎగవేయడం రైతు భీమాను బందు చేయడం యూరియా ఇవ్వక యూరియా ఇవ్వకుండా ధాన్యం కొనకుండా పంటలు కొనకుండా చేస్తున్న తీరు వల్ల అనేకమంది రైతన్నలు నష్టాలపాలై ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితి ఉందన్నారు. ఒక్క బ్యారేజ్ ఒక్క ప్రాజెక్టు ఒక్క చెరువు కట్టని కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గు లేకుండా చెక్ డ్యామ్లను పేల్చిన క్రిమినల్లా మాదిరిగా తయారైందన్నారు. సుంకిశాల ఎస్ఎల్బిసి టన్నెల్ వంటి అనేక ప్రమాదాలు జరిగిన ఒక్కరిపైనా చర్య తీసుకోలేదన్నారు. గురుదక్షిణగా గోదావరి నీళ్లను తెలంగాణ జలహక్కులను చంద్రబాబుకి సమర్పించుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ జల హక్కులకు తీరని నష్టం జరిగిందన్నారు. విద్యార్థులు జాబ్ క్యాలెండర్ అడిగితే లాటీలు జులిపిస్తున్నారు అన్నారు. నిరుద్యోగులు విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం పైన రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు జీవో 97 పేరుతో వారి జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. ఇక అడ్డగోలుగా 1000 రోజుల్లో సంపాదించుకున్న అక్రమ సంపాదన విషయంలో విభేదాల వలనే ఈరోజు మంత్రులు బయటకు వచ్చి మరీ బహిరంగంగా తన్నుకుంటున్నారు అన్నారు. 30శాతం కమిషన్ లేకపోతే ఒక్క పని చేయని 1000 రోజుల పాలనలో సంపాదించిన అడ్డగోలు నిధుల కోసమే కుంభకోణాల్లో వాటాల కోసమే పబ్లిక్‌గా కొట్లాడుతున్నారు అన్నారు. అందుకే ఈరోజు స్వయంగా మంత్రులు, మంత్రుల కుటుంబ సభ్యులు బయటకు వచ్చి గొడవలు పెట్టుకుంటున్నారు అన్నారు. ఒకరి లీలలను ఇంకొకరు బయట పెడుతున్నారు అన్నారు. రేవంత్ రెడ్డి అన్నదమ్ములు ఎంత బాహాటంగా దోపిడీ చేస్తున్నారో కొండ సురేఖ కూతురే బహిరంగంగా చెప్పింది అన్నారు. ఇంత చెప్పిన తర్వాత కూడా వారి అవినీతి పైన ఒక్కటంటే ఒక్క చర్య కూడా తీసుకోలేదన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి మంత్రులే స్వయంగా 30 వేల కోట్ల రూపాయల నైనీ టెండర్ల కుంభకోణాన్ని ఆపాలని చెప్తున్నారు అన్నారు. శాసనసభ సమావేశాల్లోనూ కాంగ్రెస్ పైన గొంతు విప్పుతామని కేటీఆర్ అన్నారు. ఇప్పటికే 1000 రోజుల పాలన పైన పార్టీ ఒక్క వారం రోజుల ప్రణాళిక ప్రకటించిందని, ఇది కేవలం ఆరంభం మాత్రమే అని 1000 రోజుల తర్వాత అనేక 1000 రోజుల కాంగ్రెస్ పాలన పైన భవిష్యత్తులోనూ విస్తృతమైన కార్యాచరణతో ముందుకు పోతామన్నారు.

## సిఎం అయ్యాకే కెసిఆర్ అసెంబ్లీకి వస్తారు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు2:** కెసిఆర్‌ను పదేపదే అసెంబ్లీకి రావాలంటున్న సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇచ్చిన కౌంటర్ చర్చకు దారి తీసింది. ఖచ్చితంగా కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని తిరిగి ముఖ్యమంత్రిగా అసెంబ్లీకి ప్రజల ఆశీర్వాదంతో వస్తారని స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీనామా అంశం పైన డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతల పైన ముఖ్యమంత్రి మాటల పైన కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ అనే వ్యక్తి లేకపోతే ఈరోజు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవారే కాదు అని, రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ఉండేదా అన్న విషయాన్ని ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రం మూమటికి కేసీఆర్ వల్లనే సాధ్యమైంది అన్నారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం లేదు అన్నారు. అట్లాంటిది కేటీఆర్ కేసీఆర్ వల్లనే రేవంత్ రెడ్డికి కుర్చీ దక్కిందని గుర్తుంచుకోవాలన్నారు. సింగపూర్ కు చెందిన లీ కువాన్ యూ మాదిరిగా గౌరవించుకున్న తీరుగానే కేసీఆర్‌ని శాశ్వతంగా తెలంగాణ ప్రజలు గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతటి స్థాయి కలిగిన వ్యక్తి రాజీనామా చేయాలి అంటే చేయాలనే నైతిక అర్హత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదన్నారు. కేసీఆర్ రాజీనామాలు చేస్తే ఏం జరుగుతుందో సోనియా గాంధీకి తెలుసు అన్నారు. గతంలో రాజీనామా చేసిన కేసీఆర్ వలనే ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టానం గడగడలాడిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు.

## ప్రభుత్వశాఖలపై 70వేల ఫిర్యాదులు

>> బ్యాంకులకు సంబంధించి సీవీఓలకు అత్యధికంగా 9,933 ఫిర్యాదులు అందాయి. వీటిలో 9,520 పరిష్కరించగా, 413 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 52 ఫిర్యాదులు మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. రైల్వేలకు సంబంధించి 9,381 ఫిర్యాదులు అందగా, 8,754 పరిష్కరించారు. మరో 627 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 10 మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని సివిసి నివేదిక పేర్కొంది. గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల విభాగానికి సంబంధించి 6,531 ఫిర్యాదులు, ఢిల్లీ ప్రభుత్వం దేశరాజధాని ప్రాంతం మినహా స్థానిక సంస్థలపై 4,834 ఫిర్యాదులు అందాయి. స్థానిక సంస్థల్లో ఢిల్లీ జల్ బోర్డు, ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఢిల్లీ ట్రాన్స్‌కో, ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు, ఢిల్లీ టూరిజం అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ తదితర సంస్థలు ఉన్నాయి. బొగ్గు రంగంలోని ఉద్యోగులకు సంబంధించి 4,118 ఫిర్యాదులు, ఆర్థిక రంగానికి సంబంధించి 3,107, ఢిల్లీ ప్రభుత్వంపై 2,804, పెట్రోలియం మంత్రిత్వ శాఖకు సంబంధించి 2,722 ఫిర్యాదులు వచ్చాయి. ఢిల్లీ పోలీసులపై 2,633 ఫిర్యాదులు, రోడ్డు రవాణా, జాతీయ రహదారుల విభాగంపై 2,139, ఢిల్లీ పోలీసులను మినహాయించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సంబంధించి 2,036 ఫిర్యాదులు నమోదయ్యాయి. మానవ వనరుల అభివృద్ధి విభాగంపై 2,030, కార్మిక మంత్రిత్వ శాఖపై 1,894, బీమా సంస్థలపై 1,536, టెలికమ్యూనికేషన్ రంగానికి సంబంధించి 1,469 ఫిర్యాదులు వచ్చినట్లు సీవీసీ నివేదిక తెలిపింది. రక్షణ మంత్రిత్వ శాఖకు సంబంధించి 1,410 ఫిర్యాదులు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖపై 1,123, ఉక్కు మంత్రిత్వ శాఖపై 1,023, పోస్టుల శాఖపై 1,003 ఫిర్యాదులు అందాయి. సీవీసీ నుంచి సీవీఓలకు 18,651 ఫిర్యాదులు2025లో సీవీసీ నుంచి అవసరమైన చర్య కోసం సీవీఓలకు పంపిన ఫిర్యాదుల వివరాలను కూడా నివేదిక వెల్లడించింది.



యుపిలోని మథురలో బుధవారం భారీగా కురిసిన వర్షంతో చెరువును తలపిస్తున్న రహదారులు

## ముందు సిఎంపై చర్య తీసుకోవాలి

>> బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఖర్గే కలిసి వచ్చిన తర్వాత ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసేందుకు వెళ్లగా అప్పటికే ఆయన బయటకు వెళ్లారని, ఇంకా ఆయనతో మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు. బీసీ అయిన తనకు ఒక న్యాయం, ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్లు తానే సీఎం అని రేవంత్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేకు చెప్పినట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కాంగ్రెస్ పెద్దలను కోరినట్లుగా తెలిపారు. తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని అధిష్ఠానానికి చెప్పినట్లు వివరించారు. సుస్మితకు వివాహం అయిందని, ఆమె ఇండిపెండెంట్‌గా ఉందన్నారు. సుష్మిత వ్యాఖ్యల వివాదంలో తన తప్పు లేదని ఖర్గేతో చెప్పినట్లు స్పష్టం చేశారు. 'నేను చెప్పాల్సింది ఆయనకు చెప్పా, నా కూతురికి ఏదైనా మాట్లాడే హక్కు ఉంది. నేను వద్దని చెప్పలేను, తనతో పాటు తన భర్త రాజకీయ జీవితం మా ఇష్టం అని తెలిపారు. తాను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నానని కొండా సురేఖ చెప్పారు. బీసీ మహిళనైన నాపై చర్యలు తీసుకోవడం కరెక్ట్ కాదు, నేను పద్మశాలి, నా భర్త మున్నూరుకాపు, మా సామాజిక వర్గాల ఓట్లు రాష్ట్రంలో 16శాతం ఉన్నాయి. నాపై అవినీతి ఆరోపణలు లేవు. మంత్రి పదవిలో కొనసాగించాలని కోరా అని తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నానని తెలిపారు. ఒకవైపు కర్ణాటక కేబినెట్‌లో మహిళా మంత్రి లేరని చర్చ జరుగుతుందని చెప్పారు. మహిళలు స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉండాలని, మనుస్మృతి విధానం సరికాదని ఒకవైపు రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నారని చెప్పారు. మీనాక్షి నటరాజన్‌ను కూడా కలిసి చెప్పగా అధిష్ఠానానికి ఆమె చెప్తానన్నారని పేర్కొన్నారు. పార్టీలో కొంతమందితో తనపై ఆరోపణలు చేయించారన్నారు. ఎవరు అలా చేయించారో తనకు తెలుసని కొండా సురేఖ పేర్కొన్నారు. పేర్లు చెబితే వివాదం అవుతుందన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని సురేఖ అభిప్రాయపడ్డారు. పార్టీ ఆ దిశగానూ ఆలోచించాలని ఆమె కోరారు. తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే అసలు తప్పు అని అన్నారు. ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నానని అందుకే ఇక్కడికి వచ్చి తన బాధ చెప్పుకొన్నానన్నారు. రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చామన్న ఆమె, పార్టీ తీసుకునే నిర్ణయం ఆధారంగా తన ఆలోచన ఉంటుందని కొండా సురేఖ అన్నారు.

## విత్తన చట్టం అమలు చేయండి

>> శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు, నకిలీ, నాసిరకం విత్తనాలను అరికట్టేందుకు పటిష్టమైన చట్టపరమైన వ్యవస్థ అవసరమన్నారు. అలాగే రాష్ట్రంలో కొబ్బరి సాగు విస్తరిస్తున్న నేపథ్యంలో కొత్తగూడెంలో ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ తదితర అంశాల్లో మెరుగైన సహకారం అందుతుందని చెప్పారు. అలాగే రాష్ట్రంలో పామాయిల్ సాగు పెరుగుతున్నందున రైతులకు ధరల భద్రత కల్పించేందుకు కనీస హామీ ధర క్వింటాల్‌కు రూ.25 వేలుగా నిర్ణయించాలని పేర్కొన్నారు. సాగు వ్యయం, పెట్టుబడులు, ద్రవ్యోల్బణం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని సవరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రాంతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేసే పప్పుధాన్యాలు, నూనెగింజలు, కందులు, పెసలు, మినుములు, శనగ మొక్కజొన్న, జొన్న వంటి పంటల ఉత్పత్తిలో 25 శాతం ఉన్న పరిమితిని 100 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేశారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్స్ కార్యక్రమం కింద తెలంగాణకు అవసరైన నిధులను పెంచాలని సూచించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పలు కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలన్నారు. కేంద్రం నుంచి సానుకూల సహకారం లభిస్తే రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల ఆదాయ భద్రతకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.

## రాహుల్‌ని ప్రధాని చేద్దాం

>> అగ్రికల్చర్ యాక్ట్ తీసుకొచ్చి అసైన్డ్ భూములను పేదలకు పంచిన చరిత్ర ఇందిరాగాంధీది అని పేర్కొన్నారు. పిడీఎస్ విధానం తీసుకో తీసుకొచ్చి రేషన్ షేప్ ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ సొంతం అని పేర్కొన్నారు. తెలంగాణలో 3 కోట్ల 48 లక్షల మందికి సాంబ బియ్యం అందిస్తున్నామంటే అనాటి కాంగ్రెస్ ప్రభుత్వాల కృషినే కారణం అని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ పై తొలి సంతకం చేసిన గొప్ప వ్యక్తి వైఎస్ అని గుర్తు చేశారు. ఆనాడు 1300 కోట్ల విద్యుత్ బకాయిలు రద్దు చేసి.. రైతులపై కేసులు ఎత్తివేసి రైతుల గుండెల్లో వైఎస్ రారాజుగా నిలిచారని స్మరించుకున్నారు.
తెలంగాణలో సాగు నీరు అందిచేందుకు ప్రాణహిత చేవెళ్ల, కల్వకుర్తి ఎత్తిపోతల, ఎస్ఎల్ బీసీ టన్నెల్ ప్రారంభించిన ఘనత వైఎస్‌ది. ఆనాడు వైఎస్ ప్రారంభించిన ప్రాణహిత చేవెళ్ల, ఎస్ఎల్ బీసీ ఇప్పుడు ఆగిపోయాయని పేర్కొన్నారు. వారి ఆశయాలను నూటికి నూరు శాతం కొనసాగిస్తాం, ప్రాణహిత చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితమిస్తాం అని చెప్పారు. వైఎస్ అభిమానులకు ఒక మాట గుర్తు చేస్తున్నా, వైఎస్ చివరి కోరిక ఇంకా నెరవేరలేదు ఆయన రెండోసారి ప్రమాణస్వీకారం చేశాక ఒకే ఒక్క మాట చెప్పారు, రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే ఆయన జీవిత లక్ష్యం అని ఒకే ఒక్క మాట చెప్పారు, కానీ ఆ కోరిక తీరకుండానే ఆయన మరణించారు అని పేర్కొన్నారు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్సార్, వ్యవసాయం అంటే కేవలం పంట మాత్రమే కాదని, ఆ పంటను పండించే రైతు కుటుంబం అని గట్టిగా నమ్మానని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, సాగునీరు, రుణాలు అందించడంతో పాటు వారి కుటుంబాలకు వైద్యం, విద్యను చేరువ చేసి రైతు సంక్షేమాన్ని తన పాలనలో ప్రధాన భాగంగా మార్చారని గుర్తుచేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సైతం విస్మరించలేని విధంగా రైతు సంక్షేమానికి వైఎస్సార్ బాటలు వేశారని ప్రశంసించారు. తన రాజకీయ ప్రస్థానంలో వైఎస్ఆర్ నాయకత్వంలో చీఫ్ విప్‌గా పనిచేయడం తనకు దక్కిన అరుదైన అవకాశమని భట్టి విక్రమార్క భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. 2009 ఎన్నికల తర్వాత కొత్తగా ఎన్నికైన 74 మంది యువ ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించేందుకు వైఎస్సార్ సూచన మేరకు ఐదు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించామని చెప్పారు. ఆ తరగతులకు ప్రతిరోజూ హాజరైన వైఎస్సార్, దేశాన్ని సమైక్యంగా ఉంచుతూ పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సాధించే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని యువ ఎమ్మెల్యేలకు ఉద్బోధించారని తెలిపారు. జీవితాంతం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన చేసిన దిశానిర్దేశం ఇప్పటికీ తమకు నిత్య స్ఫూర్తిదాయకమని చెప్పారు. డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి, డాక్టర్ కె.వి.పి. రామచంద్రరావుల మధ్య ఉన్న స్నేహం ఎందరికో ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. గుల్బర్గాలో విద్యార్థి దశ నుంచే ప్రారంభమైన వీరి ప్రయాణంలో, అప్పట్లో విద్యార్థి రాజకీయాల్లో ఎదురైన సమస్యల పరిష్కారం కోసం ప్రస్తుత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వద్దకు వెళ్లేవారని, ఖర్గే గారు వారికి అండగా నిలబడి మార్గదర్శనం చేశారని గుర్తుచేశారు. మిత్రుడు భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలను సజీవంగా ఉంచేందుకు కె.వి.పి. రామచంద్రరావు ఖడాక్టర్ వైఎస్ఆర్ అండ్ డాక్టర్ కెవిపి ఫౌండేషన్ఖ స్థాపించి ఢిల్లీలో ఈ వేడుకను నిర్వహించడం వారి చిరకాల స్నేహానికి నిదర్శనమని కొనియాడారు.

# జాతీయ ప్రాధాన్యకట్టడం 'గొల్లలగుడి'

## పురావస్తు అధ్యయన విభాగం గుర్తింపు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబరు 2:** తెలంగాణలోని ములుగు జిల్లా, పాలంపేటలో గల గొల్లల గుడిని జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం అధికారిక ప్రకటన జారీచేసింది. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ పరిధిలోని భారత పురావస్తు అధ్యయన విభాగం (ఏఎస్ఐ) జారీ చేసిన 31.08.2026నాటి ప్రకటన నం.ఎస్.ఒ. 4802(ఇ) 'గెజిట్ ఆఫ్ ఇండియా' (ప్రత్యేక సంచిక) పార్ట్-2లోని సెక్షన్ 3 ఉప సెక్షన్(2)) కింద ప్రచురితమైంది. 'ప్రాచీన కట్టడాలుపురావస్తు ప్రదేశాలు అవశేషాల చట్టం1958" (1958నాటి 24వ చట్టం)లోని సెక్షన్ 4, ఉపసెక్షన్ (3) కింద సంక్రమించిన అధికారాల మేరకు 'ఏఎస్ఐ' ఈ ప్రకటన జారీ చేసింది. ములుగు జిల్లా పాలంపేట గ్రామంలోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం కాకతీయ రుద్రేశ్వర (రామప్ప) ఆలయానికి నైరుతి దిశలో ఈ 'గొల్లల గుడి' ఉంటుంది. ఇది తూర్పు ముఖంగా గల మండపం, దాని చుట్టూ మూడు గర్భాలయాలతో కూడిన 'త్రికూటాలయం'గా కనిపిస్తుంది. దీని ప్రహరీ శిల్పాలంకృతమై, పైకప్పు అంచు నిర్మాణం, ద్వారబంధాల వద్ద చెక్కిన హంసల వరుసతో, 'సునిశిత రంధ్రాల వల' పనితనంతో ఈ ఆలయం ఎంతో విశిష్టమైనదిగా అలరారుతోంది. ఈ ప్రధాన గుడికి ముందు వైపున రెండు ప్రత్యేక ఉప ఆలయాలు ఎంతో అందంగా చెక్కిన ద్వారపాలకుల విగ్రహాలతో అలంకృతమై ఉంటాయి. వీటికి ముందు గల అంతరాలయాల అంచులు కూడా చక్కని తెరలతో శోభాయమానంగా కనిపిస్తాయి. ప్రధాన ఆలయ నిర్మాణం ముందు భాగాన మండపం గుండా మధ్యలో గల ప్రధాన మందిరానికి మార్గం ఉంటుంది. దీనికి ఉత్తర, దక్షిణ, పశ్చిమ దిశలలో అంతరాలయాలతో మూడు గర్భాలయాలు కూడా ఉంటాయి. ఆలయ కుడ్యాలపై కనిపించే వివిధ గూళ్లలో విష్ణుమూర్తి, లక్ష్మి, గణేశుడు, మహిషాసురమర్దిని విగ్రహాలు దర్శనమిస్తాయి. జంతువుల ఆకారాలు, పుష్పాలంకరణతో కూడిన ఎత్తయిన వేదికపై ఈ ఆలయం నిర్మితమైంది.

# ఏడు రాష్ట్రాలలో టోల్ ప్లాజాలపై ఇడి దాడులు

## అనధికార యాప్‌లతో నిధుల మళ్లింపుపై విచారణ

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఏడు రాష్ట్రాలలో జాతీయ రహదారుల ప్రాదికార సంస్థ (ఎన్‌హెచ్ఎఐ)కు చెందిన టోల్ ప్లాజాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. టోల్ ప్లాజాల వద్ద అనధకార సాఫ్ట్‌వేర్ యాప్‌లను వాడుతూ, నకిలీ టోల్ రసీదులు సృష్టించి, వాహనదారుల నుంచి తీసు కుంటున్న డబ్బులను ఇక్కడి నిర్వాహకులు కాజేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై ఇడి అధికారులు విచారణ చేబట్టారు. ఇదే అంశానికి సంబంధించి నమోదైన రెండు ఎఫ్ఐఆర్‌లను పరిగణలోకి తీసుకున్న ఇడి అధికారులు మనీలాండరింగ్ చట్టం కింద చర్యలు చేబట్టారు.

ఉత్తరప్రదేశ్, మహా రాష్ట్ర, రాజస్తాన్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, బెంగాల్ రాష్ట్రాలలోని 14 టోల్ ప్లాజాలలో ఈడీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వ హించారు. పలు టోల్ ప్లాజాల వద్ద అక్కడి నిర్వాహకులు అనధికార సాఫ్ట్‌వేర్‌ను వాడి ప్రభు త్వ ఖజానాకు అందాల్సిన నిధులను కాజేసినట్లు ఆధారాలు లభించినట్లు ఈడీ అధికారులు తెలి పారు. కొన్నిచోట్ల నకిలీ యాప్‌లు వాడినట్లు ఆధా రాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా డిజిటల్ డాక్యుమెం టరీ సాక్ష్యాల ను ఈడీ అధికారులు జప్తు చేశారు.

ఈ దాడులకు సంబంధించి పలు టోల్ ప్లాజా నిర్వాహకులకు ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చారు.

# ఢిల్లీలో తెలంగాణ సిఎస్ సంజయ్ జాజు బిజీబిజీ

## కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశాలు

## రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చ



బుధవారం న్యూఢిల్లీలో వివిధ శాఖల అధికారులను కలిసిన తెలంగాణ సిఎస్ సంజయ్ జాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్ ,సెప్టెంబరు2:**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు న్యూఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలువురు ఉన్నతాధికారులతో బుధవారం సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కటికితాల శ్రీనివాస్, కేంద్ర రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్‌లను తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు కలిశారు.

రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలు, కేంద్ర–రాష్ట్ర సమన్వయంతో చేపట్టాల్సిన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఆయా సమావేశాల్లో చర్చించారు. కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కటికితాల శ్రీనివాస్‌తో జరిగిన సమావేశంలో తెలంగాణలో పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణం, పట్టణ మౌలిక వసతులకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. కేంద్ర రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధి, రహదారి అనుసంధానం, జాతీయ రహదారులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో ముందుకు సాగేందుకు ఈ సమావేశాలు దోహద పడనున్నాయి.

# మిలటరీ ఆయుధాల చోరీపై కొనసాగుతున్న విచారణ

**ఢిల్లీ నుంచి రక్షణ శాఖ ఉన్నతాధికారుల రాక**

**రంగంలోకి ఎన్ఐఎ**

**అదుపులో 12 మంది అనుమానితులు?**

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో గల మద్రాస్ రిజిమెంట్ ఆయుధ గోదాము నుంచి చోరీ అయిన ఆ యుధాల ఉదంతంపై పోలీసులతో పాటు మిలటరీ అధికారులు విచారణను వేగవంతం చేశారు. ఇందులోని నిజా నిజాలను వెలికి తీసేందుకు ఢిల్లీ నుంచి రక్షణ శాఖ ఉన్నతాధికారులు బుధవారం హైదరాబాద్‌కు చేరుకుని విచారణ తీరు తెన్నులను పరిశీలించారు. మరోవైపు ఆయుధాలు అసాంఘీక శక్తుల చేతికి చిక్కాయా? అనే కోణంపై విచారించేందుకు జాతీయ దర్యాప్తు బృందం (ఎన్ఐఎ) రంగంలో దిగింది. విశ్వసనీయ స మాచారం మేరకు చోరీ అయిన మిలటరీ ఆయుధాలు ఇదే ప్రాంతంలో దాచి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ కేసులో 12 మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనికి సంబంధించిన మిస్టరీ రెండు మూడు రోజుల్లో వీడే వీలుందని తెలుస్తోంది.

రక్షణ శాఖలో దక్షిణాది ప్రాంతంలో కీలకమైన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో మద్రాస్ రిజ్‌మెంట్‌కు సంబంధించిన ఆయుధ గోదాము నుంచి నాలుగు ఎకె 47, ఒక ఇన్సాస్ తుపాకి, ఆరు పిస్టళ్లు, బైనాక్యూలర్లు, మరికొంత మందుగుండు సామాగ్రి చోరీ అవడం దేశ వ్యాప్తంగా సంచలనం రేపడం తెలిసిందే. ఆదివారం అర్థరాత్రి జరిగిన ఆయుధాల చోరీపై సోమవారం మధ్యాహ్నం మద్రాస్ రిజ్‌మెంట్‌కు చెందిన లెఫ్టినె ంట్ కల్నల్ మయాంక్ గోవిత్రికర్ బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై పోలీసులు బిఎన్ఎస్ 331, 305 సెక్షన్ల కింద కేసు నమో దు చేసి విచారణ చేబట్టడం విదితమే. ఒక పథకం ప్రకారం గుర్తు తెలియని దుండగులు ఆయుధాలు భద్రపరిచే గోదాము సమీపంలో గల సిసి కెమెరాలను పనిచేయకుండా చేసి తుపాకులను చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. సిసి కెమెరాలు పనిచేయకుండా అధునాతన ఫ్రీక్వెన్సీ గల జామర్ వాడి వుంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ తరహా జామర్‌ను వాడితే సిసి కెమెరాలు తాత్కాలికంగా పనిచేయవు. ఆయుధాల చోరీ తరువాత సమీపంలోని గోడను దూకి దుండగులు పారిపోయినట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. దుండగులు పారిపోయన ప్రాంతం లో తూటాలు వుంచే ఒక మ్యాగజైన్ కిందపడి వుండగా దానిని పోలీసులు జప్తు చేశారు. బరువైన తుపాకులను కనీసం నలుగురు లేదా ఐదు గురు వ్యక్తులు చోరీ చేసి వుంటారని పోలీ సులతో పాటు మిలటరీ అధికారులు అనుమాని స్తున్నారు. చోరీ తరువాత దుండగులు పారిపోయిన ప్రాంతంలో మ్యాగజైన్ లభ్యమవడంతో ఆయుధాలు ఇదే ప్రాంతంలో దాచివుంటారని పోలీసులతో పాటు మిలటరీ అధికారులు అనుమానిస్తున్నారు. ఆయుధాల చోరీ వెనుక మిలటరీ విభాగానికి చెందిన కొందరి పాత్రపై రక్షణశాఖ అధికారులకు ఆధారాలు లభించినట్లు తెలి సింది. పోలీసులకు కూడా దీనికి సంబంధించి కొన్ని ఆధారాలు లభించాయని సమాచారం. ఈ నేపథ్యంలో 12 మంది అనుమానితులను పోలీసులు అ దుపులోకి తీసుకుని మిలటరీ అధికారులతో కలిసి సంయుక్తంగా విచారిస్తున్నట్లు తెలిసింది. ఆయుధాల కోసం కంటోన్మెంట్ ప్రాంతంలో అను మానిత ప్రాంతాలు, చెట్లు, పొదల్లో జాగిలాలతో కలిసి పోలీసు, మిలటరీ అధికారులు గాలింపు నిర్వహిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో ప నిచేసిన వారిని కూడా విచారిస్తున్నారు. ఆయుధాల చోరీ జరిగిన ప్రాంతంతో పాటు కంటోన్మెంట్ పరిధిలోని అన్ని మిలటరీ స్థావరాల వద్ద గ ల సిసి కెమెరాలను పోలీసులు, మిలటరీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆయుధాలు చోరీ జరిగిన రాత్రి ఈ ప్రాంతంలో సంచరించిన అనుమానిత వాహనాలు, వ్యక్తుల గురించి ఆరా తీస్తున్నారు.

**మిలటరీ అధికారుల మధ్య విబేధాలపైనా పోలీసుల ఆరా:** ఇదిలావుండగా మిలటరీ ఆయుధాల చోరీకి సంబంధించి ఈ ప్రాంతంలోని మిలటరీ అధికారుల మధ్య ఏమైనా విబేధాలువున్నాయా? అనేకోణంలో పోలీసులు విచారిస్తున్నారు. అధికారులు, సిబ్బంది మధ్య కొన్నిసార్లు తలెత్తే విబేధాల వల్ల అక్కడ పనిచేసే కొందరు ఆయుధాలను దాచి వుంచడం లేదా,పారవేయడం చేస్తుంటారని వచ్చిన వార్తలపై పోలీసులు ఈ అంశానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.ఈ తరహా ఘటనలు ఇంతకు ముందు ఎక్కడైనా జరిగిందా? అనే అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.

**రంగంలోకి ఎన్ఐఎ:** మరోవైపు సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మిలటరీ ఆయుధాల చోరీపై ఎన్ఐఎ రంగంలోకి దిగింది. ఈ ఆయుధాలు ఒకవేళ అసాంఘీక శక్తుల చేతికి చిక్కితే? పర్యవసానాలపై విచారించేందుకు ఆ విభాగం అధికారులు ఘటనా స్థలిని పరిశీలించారు. దీనిపై మిలటరీ అధికారులతో పా టు పోలీసుల నుంచి వారు వివరాలు సేకరించారు.

# నేపాల్‌కు మరోసారి పొంచి ఉన్న వరదలముప్పు



**ఖాట్మండు, సెప్టెంబరు 2:** హిమాలయ దేశం నేపాల్‌ను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రధాన నదులు ఉధృతంగా ప్రవహిస్తూ ప్రమాదకర స్థాయికి చేరువయ్యాయి. ఈ నేపథ్యంలో, అధికారులు దేశంలోని మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. నేపాల్ హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ విభాగం ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ వెల్లడించిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 6 గంటల నాటికి మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టాలు హెచ్చరిక స్థాయిని దాటాయి. సింధూలి జిల్లాలోని సన్ కోశీ నది, గూర్ఖా జిల్లాలోని బుధి గండకి నది, దడెల్ధురా జిల్లాలోని మహాకాళి నదుల్లో నీటి ప్రవాహం ఆందోళనకరంగా ఉంది. ఈ నదుల్లో నీటిమట్టం మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, లమ్‌జంగ్ జిల్లాలోని మర్స్యంగ్ది నదిలో ప్రవాహం ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటింది. నిన్న రాత్రి 11:15 గంటలకు భుకుందెబెసి వాటర్ లెవెల్ మానిటరింగ్ కేంద్రం వద్ద ఈ నది ప్రమాద స్థాయిని దాటినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ నదిలో నీటిమట్టం ఇంకా పెరుగుతూనే ఉందని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ పేర్కొంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు ఎక్కువగా ఉందని హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) ప్రజలకు కీలక సూచనలు చేసింది. ముఖ్యంగా మర్స్యంగి నది దిగువ ప్రాంతాల ప్రజలు వెంటనే అప్రమత్తం కావాలని కోరింది. నదీ తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం రాజధాని ఖాట్మండు సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున, ప్రజలు అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం
జిల్లా పంచాయత్ ఇంజనీర్ వారి కార్యాలయం PIU డివిజన్ వికారాబాద్
ఇ-మెయిల్: eeprvkb@yahoo.co.in కాంటాక్ట్ నం: 9177539599
సంక్షిప్త టెండర్ ప్రకటన నెం. T3/63-68/2026-27, తేదీ: 01.09.2026
పనుల యొక్క సంఖ్య (12) వికారాబాద్ డివిజన్ పనులు, మొత్తం అంచనా ధర రూ.50.00 లక్షలు. బిడ్స్ జారీ ప్రారంభ తేది: 01.09.2026 నుండి ముగింపు తేదీ 08.09.2026 ము.3.00గం.కు. తదుపరి వివరాలు జిల్లా పంచాయతీరాజ్ PIU డివిజన్ వికారాబాద్ నుండి పొందవచ్చును.
సం/-. జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, PIU డివిజన్, వికారాబాద్.
DIPR.NO. 9089-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 02.09.2026

# ఎక్సైజ్ శాఖలో 562 మంది బదలీ

## పదోన్నతులతో పాటు పోస్టింగ్‌లు ఇచ్చిన ఎక్సైజ్ శాఖ కమిషనర్

**హైదరాబాద్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో 562 మంది ఏఈఎస్, సీఐలు, ఎస్సైలకు పదోన్నతులతో పాటు బదిలీలు చేపట్టారు. ఈమేరకు గురువారం ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరి కిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు.17 మంది ఎఈఎస్‌లు, 250 మంది సీఐలు, 295 మంది ఎస్సైలను కమిషనర్ బదిలీ చేశారు. 17 ఏఈఎస్‌ల్లో 14 మందికి పదోన్నతులు, ముగ్గురిని బదిలీ చేశారు. 250 మంది సీఐల్లో 57 మందికి పదోన్నతులు,193 మందిని బదిలీలు చేశారు. 295 మంది ఎస్సైల్లో 17 మందికి పదోన్నతులు,278 మందిని బదిలీలు చేశారు. బది లీలన్నీ పారదర్శకంగా చేపట్టినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

# తెలంగాణలో ధరల మోత

## రిటైల్ ద్రవ్యోల్బణం 6.32 శాతంతో అగ్రస్థానం

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** తెలంగాణలో సామాన్య ప్రజలపై ధరల పిడుగు పడుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత కష్టంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది జులైలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.32 శాతంగా నమోదైంది. దేశంలోని ప్రధాన రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణా రాష్ట్రంలో నమోదైన ద్రవ్యోల్బణం అత్యధికం. జనవరి నుంచి జులై వరకు వరుసగా ఏడు నెలల పాటు అత్యధిక ద్రవ్యోల్బణం నమోదు చేసిన రాష్ట్రంగా కొనసాగింది. జనవరిలో 4.92 శాతం, ఫిబ్రవరిలో 5.02, మార్చిలో 5.83, ఏప్రిల్‌లో 5.81, మేలో 6.15, జూన్‌లో 6.36, జులైలో 6.32 శాతంగా ఉంది. జూన్‌తో పోలిస్తే కొద్దిగా తగ్గినా 6 శాతానికి పైగా ఉండటంతో దేశంలోనే అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైన రాష్ట్రంగా తెలంగాణా తొలి స్థానంలోనే నిలిచింది. ఇక జులైలో గ్రామీణ ద్రవ్యోల్బణం 6.86 శాతం, పట్టణాల్లో 5.92 శాతం నమోదైంది. ప్రధానంగా వ్యవసాయ కుటుంబాలు, కూలీలు, తక్కువ ఆదాయ వర్గాలపై ఈ పెరుగుదల ప్రభావం ఎక్కువగా పడుతోంది. తెలంగాణ తర్వాత ఆంధ్రప్రదేశ్ 5.72, తమిళనాడు 5.44, మధ్యప్రదేశ్ 4.91, కర్ణాటక 4.89 తో ఉన్నాయి. దేశవ్యాప్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం 4.45 శాతంగా ఉంది. తెలంగాణలో వినియోగదారుల ధరల సూచిక విలువ 110.06 పాయింట్లుగా నమోదై ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉంది. నిత్యావసరాల ధరల పెరుగుదలకు కారణం ఇదే ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా కేంద్రం భావిస్తోంది. నిత్యావసరాలను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకురావడమే అని తెలుస్తోంది. పాలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు రవాణా ఖర్చుతో కలిపి బాగా ఖరీదుగా మారుతున్నాయి. దీంతో ఆదాయం పెరగని సామాన్య కుటుంబాల కొనుగోలు శక్తి తగ్గే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# హార్ముజ్ జలసంధి పూర్తిగా మా అధీనంలోనే: ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 2:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కీలకమైన హార్మూజ్ జలసంధిపై తమకు దాదాపు పూర్తి నియంత్రణ ఉందని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంపై అక్కడి ప్రజలు ఎప్పుడు తిరగబడతారని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇరాన్ లక్ష్యంగా అమెరికా సైన్యం తాజాగా వైమానిక దాడులు జరిపిన కొద్ది గంటలకే ట్రంప్ తనట్రూత్ సోషల్ ఖాతాలో ఈ పోస్ట్ పెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్‌ను చర్చల కోసం ఒత్తిడి చేస్తున్నట్టు వస్తున్న వార్తలను ట్రంప్ తోసిపుచ్చారు. నేను ఇరాన్‌ను చర్చలకు రమ్మని బలవంతం చేయడం లేదు. వాళ్లతో ఎటువంటి ఒప్పందం చేసుకున్నా నాకు అనవసరమని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితులే తనకు అనుకూలంగా ఉన్నాయని, హార్మూజ్ జలసంధిపై తమకు పూర్తి పట్టు దొరికిందన్నారు.

# మెడికల్ షాపులపై టిజి సేఫ్ దాడులు

## నిషిద్ధ డ్రగ్స్ విక్రయాలపై ఆరా

## పలు దుకాణాలకు నోటీసులు జారీ




మెడికల్ షాపులో సోదాలు చేస్తున్న టిజి సేఫ్ అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అ థారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) మెడికల్ షాపులపై తొలిసారిగా దాడులు చేబట్టింది. ఇప్పటి వరకు రెస్టారెంట్లు, హో టళ్లు, స్వీట్ షాప్‌లపై దాడులు చేసిన టిజి సేఫ్ అధికారులు బుధవారం నాడు రాష్ట్రంలోని పలు చోట్ల మెడికల్ షాప్‌లపై దాడులు నిర్వహిం చారు. వైద్యుల సిఫార్సు లేకుండా విక్రయించేందుకు వీల్లేని ట్రమడాల్, ప్రిగాబాలిన్, నైట్రాజెపాన్, అల్ప్రాజోలం, టపెంటాడల్, జియోపిడెం మాత్రలు, కొన్ని రకాల దగ్గు సిరప్‌లను కొందరు నిర్వాహకులు ఇష్టానుసారం ఎవరికిపడితే వారికి ఎంతకావాలంటే అంత టోకుగా అమ్ముతున్న ట్లు దాడుల సందర్భంగా వెలుగు చూసింది. ఒక రకంగా మాదకద్రవ్యాలతో సమానమైన ఈ ట్యాబెట్లు కొన్ని రకాల తీవ్రమైన వ్యాధులతో బాధ పడే వారు వాడుతుంటారు. వైద్యుల సిఫార్సు మేరకు పరిమిత మోతాదులో వీటిని వాడాల్సి వుంది. అ యితే వీటిని అడ్డగోలుగా అమ్ముతున్న 158 మెడికల్ షాపుల నిర్వాహకులకు టిజి సేఫ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అడ్డగోలుగా నిషిద్ధ ఔషధాల అమ్మకాలపై వెంటనే వివ రణ ఇవ్వాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌లను రద్దు చేస్తామని ఈ సందర్బంగా టిజి సేఫ్ అధికారులు ఆదేశించారు.


# మైనర్లకు ఇ సిగరెట్ల విక్రయం: ఇద్దరి అరెస్టు

## ఆన్‌లైన్‌లో సరుకు అమ్మకాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** నిషిద్ధ ఈ సిగరెట్ల గురించి అందరికి తెలిసిందే. డ్రగ్స్‌తో కూడి న ఈ తరహా సిగరెట్లపై కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాలు చాలాకాలం క్రితమే నిషేధం విధించడం విదిత మే. అయితే వీటికి డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిన కొందరు యువకులు అక్రమ మార్గంలో వీటిని కొంటూ జీవితాలను పాడుచేసుకుంటున్నారు. ఈ సిగరెట్లు ఎక్కువగా బంగ్లాదేశ్‌తో పాటు పాక్ నుంచి ఎక్కువగా స్మగ్లింగ్ అవుతుంటాయి. వీటిపై ఇంతకాలం ఆయా ప్రాంతాల పోలీసులు నిఘా వుంచగా ఇప్పుడు ఈగల్ పోలీసులు దృష్టి సారించారు. తాజాగా ఈ సిగరెట్లను అమ్ముతున్న స్మగ్లర్లు తమ వ్యాపాకం కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు చేసుకుంటూ వెబ్‌సైట్లను వాడుతున్నారని ఈ గల్ పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో కొందరు మైనర్లు ఈ సిగరెట్లకు బానిసలుగా మారారని గుర్తించిన ఈగల్ పోలీసులు పక్కాగా నిఘా వుంచి 13 మైనర్లను పట్టు కోగా వీరికి సిగరెట్లను అమ్ముతున్న ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. మైనర్ల నుంచి 13 ఈ సిగరెట్లను జప్తు చేశారు. పట్టుబడ్డ స్మగ్లర్లను ముషీరాబాద్‌కు చెందిన అర్బాజ్‌షరిఫ్ (21), టోలిచౌకికి చెందిన ముదసీర్ జావెద్ (21)గా గుర్తించారు. ఈ సిగరెట్లను మైనర్లకు అమ్మేందుకు ఎంచుకున్న వెబ్‌సైట్ల నిర్వాహకులకు ఈగల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. పట్టుబడ్డ నిందితులను పోలీసులకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించారు. కాగా ఈ సిగరెట్లతో పాటు డ్రగ్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం వున్నా 1908 లేదా 8712671111కు ఫిర్యాదు చేయాలని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు.







AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)
AU SMALL FINANCE BANK
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001
(CIN: L36911RJ1996PLC011381)

2002 యొక్క సెక్యూరిటేషన్ చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీస్

రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా, "ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" 01 ఏప్రిల్ 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" లో విలీనం చేయబడింది. AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిగా, రుణ ఖాతా నిరర్థక ఆస్తి (NPA)గా మారినందున, అధీకృత అధికారి "ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002" లోని సెక్షన్ 13(2) కింద, పత్రికలో ఇవ్వబడిన విధంగా రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/తాకట్టుదారులు/హామీదారులకు (వీరందరినీ కలిపి "రుణగ్రహీతలు"గా సూచిస్తారు) 60 రోజుల డిమాండ్ నోటీసు జారీ చేశారు. నోటీసు ప్రకారం, రుణగ్రహీతలు 60 రోజులలోపు పూర్తి మొత్తాన్ని జమ చేయకపోతే, క్రింద ఇవ్వబడిన విధంగా తాకట్టు ఆస్తులు/హామీ ఆస్తుల వేలం ద్వారా ఆ మొత్తం వసూలు చేయబడుతుంది. అందువల్ల, రుణగ్రహీతలైన మీరు డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు భవిష్యత్ వడ్డీ మరియు ఖర్చులతో పాటు మొత్తం రుణ మొత్తాన్ని జమ చేయాలని తెలియజేయడమైనది, లేని పక్షంలో, సదరు చట్టంలోని 13(4) మరియు 14 నిబంధనల ప్రకారం, అధీకృత అధికారి క్రింద ఇవ్వబడిన విధంగా తనఖా ఆస్తులు/హామీ ఆస్తులను అమ్మకం కోసం స్వాధీనం చేసుకోవడానికి స్వేచ్ఛగా ఉంటారు.
రుణగ్రహీతలు గమనించవలసినది ఏమనగా, ఈ నోటీసును స్వీకరించిన తర్వాత, 2002 చట్టంలోని సెక్షన్ 13(13) నిబంధనల ప్రకారం, హామీదారు రుణదాత యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, హామీగా ఉంచిన ఆస్తులలో దేనినీ అమ్మకం, లీజు లేదా మరే ఇతర మార్గంలోనైనా బదిలీ చేయడం మీకు నిషేధించబడింది మరియు నిరోధించబడింది. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 చట్టంలోని సెక్షన్ 13(8) మరియు రూల్ 3(5) ప్రకారం, వేలం నోటీసు ప్రచురణకు ముందు క్రింద పేర్కొన్న విధంగా పూర్తి బకాయిలను చెల్లించిన మీదట రుణగ్రహీతలు తమ హామీగా ఉంచిన ఆస్తిని విడిపించుకోవడానికి అర్హులు అని, ఆ తర్వాత వేలం ఉనికిలో ఉండదని రుణగ్రహీతల దృష్టికి తీసుకురావడమైనది.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు యొక్క పేరు/రుణ ఖాతా నం. | 13(2) సెక్షన్ క్రింద డిమాండ్ నోటీస్ యొక్క తేదీ మరియు సొమ్ము |
| --- | --- |
| (రుణ ఖాతా నెం.) 24660002699166, నల్ల దివ్య భారతి (రుణగ్రహీత), నల్ల పవన్ (సహ-రుణగ్రహీత) | 06-జూలై-26 రూ. 8,87,415/- రూ. ఎనిమిది లక్షల ఎనభై ఏడు వేల నాలుగు వందల పదిహేను మాత్రమే 04-జూలై-26 నాటికి |

తనఖా ఆస్తి యొక్క వివరణ
హనుమకొండ జిల్లా, మరియు SRO వరంగల్ RO హనుమకొండ, వడ్డేపల్లి, ఎస్.సి. కాలనీలో ఉన్న వడ్డేపల్లి రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నంబర్లు 932/B (కొత్త), 1699 (పాత) లలో గల 101.50 చదరపు గజాలు లేదా 84.86 చదరపు మీటర్లు విస్తీర్ణం కలిగిన, ఇంటి నంబర్ 2-9-1167/A గల ఖాళీ స్థలంతో కూడిన ఇల్లు; దీని సరిహద్దులు: తూర్పు నుండి పడమరకు 30.8 నుండి 30 వరకు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 30 నుండి 25 వరకు ఉండి, అందులో ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో చేపట్టే నిర్మాణాలతో సహా.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు యొక్క పేరు/రుణ ఖాతా నం. | 13(2) సెక్షన్ క్రింద డిమాండ్ నోటీస్ యొక్క తేదీ మరియు సొమ్ము |
| --- | --- |
| (రుణ ఖాతా నెం.) 21660000684024, సయ్యద్ హుస్సేన్ (రుణగ్రహీత), సయ్యద్ మహమ్మద్ (సహ-రుణగ్రహీత) | 06-జూలై-26 రూ. 3,74,948/- మూడు లక్షల డెబ్బై నాలుగు వేల తొమ్మిది వందల నలభై ఎనిమిది రూపాయలు మాత్రమే 04-జూలై-26 నాటికి |
| (రుణ ఖాతా నెం.) 23630000068371, [illegible] | 06-జూలై-26 రూ. 7,28,462/- [illegible] 04-జూలై-26 నాటికి |
| (రుణ ఖాతా నెం.) 24660002447822, [illegible] | 06-జూలై-26 రూ. 6,63,398/- [illegible] 04-జూలై-26 నాటికి |
| (రుణ ఖాతా నెం.) 23660000766997, [illegible] | 09-జూలై-26 రూ. 14,66,022/- [illegible] 08-జూలై-26 నాటికి |
| (రుణ ఖాతా నెం.) 24660002211236 & 23660001190413, [illegible] | 09-జూలై-26 రూ. 11,82,358/- [illegible] 08-జూలై-26 నాటికి |
| (రుణ ఖాతా నెం.) 24660002296064 & 22660000885444, [illegible] | 17-జూలై-26 రూ. 5,31,837/- [illegible] 16-జూలై-26 నాటికి |
| (రుణ ఖాతా నెం.) 22660000340481 & 23660000673982, [illegible] | 17-జూలై-26 రూ. 3,17,887/- [illegible] 16-జూలై-26 నాటికి |
| (రుణ ఖాతా నెం.) 24660001189974, [illegible] | 21-జూలై-26 రూ. 10,02,610/- [illegible] 21-జూలై-26 నాటికి |
| (రుణ ఖాతా నెం.) 25660000400214 & 24660000771935, [illegible] | 21-జూలై-26 రూ. 13,13,971/- [illegible] 21-జూలై-26 నాటికి |
| (రుణ ఖాతా నెం.) 25630000022785, [illegible] | 21-జూలై-26 నాటికి రూ. 8,41,036/- [illegible] 21-జూలై-26 నాటికి |

తేదీ : 02.09.2026 ప్రదేశం : తెలంగాణ
అధీకృత అధికారి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

అతిగా జాగ్రత్తపడడం దౌర్భాగ్యుని లక్షణమైతే, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం అవివేకి లక్షణం.

- సెసిల్

# భారత్ ఓ వికసిత మంత్రం!

ఎనిమిది దశాబ్దాల క్రితం మౌలిక వనరులున్నా అభివృద్ధికి నోచని భారతదేశం మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో వడివడిగా అడుగులు వేసుకుంటూ తాజాగా ప్రపంచ దేశాలకు అభివృద్ధి మంత్రాన్ని అందిస్తోంది. భారత్ అభివృద్ధి నమూనా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచి గెలిచిందని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా నిర్వచించడం విశేషం. భారత్ సాధించిన అనుభవాలను క్రోడీకరించుకుని ప్రపంచంలోని ఇతర దేశాలు కూడా అభివృద్ధిలో ముందడుగు వేయగలిగే స్థాయికి చేరుకుంటాయని ఆయన విశ్లేషిస్తున్నారు. భారత్ 2047 నాటికి వికసిత్ భారత్‌గా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు కదలడాన్ని ఆయన ప్రశంసించారు. ఇటీవలనే అమెరికా అధ్యక్ష భవనం 'వైట్‌హౌస్' కూడా భారత్ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన జిడిపి వృద్ధి 7.8 శాతంతో దూసుకువెళ్తున్న విషయంపై స్పందించింది. భారత్‌లో అత్యధిక పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా కంపెనీలు ఉవ్విళ్లూరడానికి కారణం ఇదేనన్న విషయం చెప్పకనే చెప్తోంది. భారత్ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్రియాశీలకంగా దృఢంగా స్థితిస్థాపకతతో ఉందని వైట్‌హౌస్ సీనియర్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ కుష్‌దేశాయ్ వ్యాఖ్యానించారు. చైనాలో కన్నా అమెరికా పెట్టుబడులు భారత్‌నే ఆకర్షించాయని గణాంకాలు చెబుతున్నాయి. నార్త్ కరోలినాలో జరిగిన జి20 ఆర్థికమంత్రుల సమావేశం సందర్భంగా పలు వార్తా సంస్థలతో ఆయన ఈ విషయాలను స్పష్టం చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ మరింతగా వెలుగొందగలదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నట్లు వివరిస్తున్నారు. అమెరికాలో భారత్ పెట్టుబడులకు ఆహ్వానించడం, అదే సమయంలో భారత్‌లో అమెరికా పెట్టుబడులను పెట్టడం అన్న రెండు సందర్భాలుభారత్‌కు ప్రోత్సాహకరమే. అందుకే ప్రపంచంలో ప్రధానంగా పశ్చిమాసియా యుద్ధ సంక్షోభంలోనూ భారత్ ఆర్థిక ప్రయాణానికి ఎటువంటి ఆటంకం ఏర్పడలేదు. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు, సాంకేతికతను ప్రజల్లోకి బలంగా నాటుకునేటట్లు చేయడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించుకోవాలని, ఉద్యోగ ఉపాధులకు బాటలు వేయడంలోనే భారత్ ఇతర దేశాలకు పెద్దగా నమ్మకం కలిగించింది. సామాన్యుడి జీవన ప్రమాణం పెంచడంలో కూడా భారత్ సమాంతర వృద్ధి సాధించింది. ఇవన్నీ ఇతర దేశాలు పరిగణనలోకి తీసుకున్న అంశాలు. ఈ విషయాలన్నిటిపై ప్రపంచ బ్యాంకు బాగా విశ్లేషించుకుని వ్యాఖ్యానించడం భారత్‌కు ఓ విధంగా చెప్పాలంటే ప్రశంసలే. ఎవరిమీద ఎవరికి ఎలాంటి అభిప్రాయాలున్నా కళ్లెదుట కాంక్షించే అభివృద్ధిని కాదనలేరు. భారత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రపంచ బ్యాంకు తరపున బాగా ప్రశంసలు అందుకుంది. ఆధార్ నుంచి బ్యాంకు ఖాతాల వరకు రూపొందించిన డిజిటల్ వ్యవస్థ రూపురేఖలను ఇతర దేశాలు కూడా అందిపుచ్చుకుంటున్నాయి. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంలో భారత్ ముందడుగు వేసిందన్న విషయాన్ని ఇటీవల తాను ఉత్తరప్రదేశ్‌లోనూ పర్యటిస్తున్న సమయంలో చిన్నసన్నకారు రైతులకు వ్యవసాయఇన్‌పుట్స్ అందించేందుకు సహకార సంఘాలు, గూగుల్, ప్రపంచ బ్యాంకు రూపొందించుకున్న విధానం ఎంతో బేషుగ్గా ఉందని అభినందించారు. ప్రపంచ బ్యాంకు తాజా గణాంకాల మేరకు 2025లో భారత్ జిడిపి అభివృద్ధి 7.6 శాతంగా నమోదైంది. అదే సమయంలో జిడిపి వృద్ధి 3.96 ట్రిలియన డాలర్లకు చేరింది. వికసిత్ భారత్ లక్ష్యసాధనలో తమ భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రపంచ బ్యాంకు భరోసానిచ్చింది. వచ్చే ఐదేళ్లపాటు సాలీనా 8-10 బిలియన్ డాలర్లమేర ఆర్థిక సహాయం అందించేప్రణాళికకు లోబడి ఉంది. ప్రపంచ బ్యాంకు ఆర్థికవ్యూహంలో ప్రైవేట్ రంగంలో కూడా ఉద్యోగావకాశాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రయత్నం. అందుకు అనుకూలమైన కార్యక్రమాల రూపకల్పనలో భారత్ చోదకశక్తిగా పనిచేస్తోంది. ప్రతి భారతీయుడి జీవన ప్రమాణాల్లోనూ జీవన వృద్ధిలో కనిపించదగిన మార్పు, ఆశించిన ఆకాంక్షల తీరులో గ్రామీణ రైతాంగ ఆదాయ పెంపులో, మహిళా పారిశ్రామికవేత్తల రాణింపు వంటి అంశాల్లో భారతీయ సామర్థ్యానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తోంది. వికసిత్ భారత వృద్ధికి, ప్రపంచబ్యాంకు భాగస్వామ్య ప్రణాళికకు తగిన సారూప్యత కనపడుతోంది. వ్యవసాయంలో సాంకేతికతను చొప్పించడం ద్వారా సహకార రంగంలో ఉద్యోగ సృష్టికి మార్గం చూపవచ్చునని బంగా అంచనా. 'జెన్‌జీ'కి ఉద్యోగాల కల్పనకు దారి చూపకపోతే యువత అసంతృప్తి చెలరేగుతుంది. కనుక ప్రపంచబ్యాంకు ప్రణాళికల్లో కూడా ఉద్యోగసృష్టి జరిగేఅంశాలపైనే దృష్టి సారిస్తున్నారు. భారత్ నమూనాను ప్రపంచ దేశాలకు మార్గదర్శకత్వం అయ్యే తరుణంలో ఇతర దేశాలు సులభంగా గ్రహించగల విధానాలను కలిగిఉండాలి. నిరంతర సంస్కరణలే భారత్ నమూ నాకు పునాది. ప్రస్తుతం ఆఫ్రికా,లాటిన్ అమెరికా దేశాలకు భారత్ నమూనా ప్రధాన ఆకర్షణగాఉంది. భారత్ అభివృద్ధిలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కీలకపాత్ర పోషించిందని ప్రపంచబ్యాంకు నమ్ముతోంది. అందువల్లనే మిగతా దేశాలు కూడా అటువైపుగా దారితీయగల అవకాశాలను అంచనా వేస్తోంది. ఆధార్ వ్యవస్థ ద్వారా కోట్లాది మంది పౌరులను బ్యాంకింగ్ వ్యవస్థకు అనుసంధించడం ఆర్థిక సమ్మిళితానికి మంచి ఉదాహరణ. ప్రపంచ ఆర్థిక ఒడిదొడు కుల్లోనూ భారత్ 7 నుండి 8శాతం వృద్ధి రేటును సాధించడం విశేషమని ప్రపంచబ్యాంకు ప్రకటించింది. ప్రాథమిక ఆరోగ్యసేవలు, విలువ ఆధారిత తయారీ రంగాల్లో ఉన్న ఉద్యోగ సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా మరింత ఆర్థిక వృద్ధి జతకూడగలదు.సాంకేతిక వినియోగంతో వ్యవసాయం లో అద్భుత ఫలాలు సాధించవచ్చునని ఆ దిశగా ఇతర దేశాలు భారత్ మార్గదర్శకత్వ స్ఫూర్తిని తీసుకోవాల్సి ఉంటుంది.

మనకున్న దురభిప్రాయాన్ని పట్టుకొని వ్రేళ్లాడేకంటే దాన్ని మార్చుకోవడమే మంచిది.



సోక్రటీస్

సద్వచనాలు విని ప్రయోజనం లేదు. వాటిని నిత్య జీవితంలో ఎంతవరకు ఆచరణలోకి తెసున్నామన్నదే ముఖ్యం.




స్వామి వివేకానంద

# ఆస్పత్రుల్లో భద్రతకు భరోసా ఏది?

**ఆస్పత్రి అనుమతులు, పునరుద్ధరణలు, పరికరాల తనిఖీలు వంటి అంశాలను ఒక సమగ్ర డిజిటల్ వ్యవస్థతో అనుసంధానం చేస్తే జవాబుదారీతనం పెరుగుతుంది. ఆస్పత్రులు కూడా తమ భద్రతా ప్రమాణాలను ప్రజలకు పారదర్శకంగా తెలియజేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా, ఆరోగ్య సేవలను కేవలం వ్యాపార సేవగా చూడకూడదు. రోగిఆస్పత్రికి డబ్బు చెల్లించి చికిత్స కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు మాత్రమే కాదు, అతని ప్రాణాన్ని ఆస్పత్రి తన బాధ్యతగా స్వీకరిస్తుంది. ఈ బాధ్యతకు భద్రతే పునాది. వైద్యం అందించే ప్రదేశంలోనే రోగి ప్రాణానికి ముప్పు ఏర్పడితే అది వైద్యవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పడం మాత్రమే సరిపోదు. ఆరోగ్య సేవలను అందించే సంస్థలు కూడా భద్రతే మొదటి ప్రాధాన్యం అనే సిద్ధాంతాన్ని ఆచరణలో చూపాలి.**

నండూరి రవిశంకర్

ఫ్లోరెన్స్ నైటింగేల్ చెప్పినట్లు, రోగికి హాని చేయకుండా ఉండటమే ఒక ఆస్పత్రికి ఉండాల్సిన ప్రాథమిక లక్ష్యం. వైద్యం కోసం ఆస్పత్రి గడప తొక్కిన వ్యక్తి అక్కడి నుంచి ఆరోగ్యంగా బయటకు వస్తాడనే నమ్మకంతోవస్తాడు. అయితే ఇటీవలి ఘటనలు ఆ నమ్మకాన్నే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అనారోగ్యంతో పోరాడుతున్న రోగులు, ముఖ్యంగా తమంతట తాము కదలలేని స్థితిలో ఉన్న శిశువులు, వృద్ధులు, అత్యవసర చికిత్స పొందుతున్న వారు ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు, విద్యుత్ లోపాలు, పరికరాల పేలుళ్ల వంటి ఘటనలకు బలవుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్రలోని అమరావతి జిల్లా ఆస్పత్రిలో సోమవారం వేకువజామున నవజాత శిశు సంరక్షణ యూనిట్‌లో వెంటిలేటర్ పేలి ముగ్గురు నవజాత శిశువులు మృత్యువాత పడటం, మరో శిశువు ప్రాణాపాయస్థితిలో ఉండటం అత్యంత విషాదకరం. మూడు విభాగాల్లో ఉన్న ఆ యూనిట్‌లో 39 మంది శిశువులు చికిత్స పొందుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మిగిలిన శిశువులను సురక్షితంగా బయటకు తీసుకురావడం ఉపశమనకరమైన అంశమే అయినా, ముగ్గురు పసికందుల ప్రాణాలు తిరిగి రావు. వారి తల్లిదండ్రులకు మిగిలింది జీవితాంతం మానని గాయం మాత్రమే. ఇలాంటి ఘటనలను కేవలం ప్రమాదాలుగా పేర్కొని చేతులు దులుపుకోవడం సమంజసం కాదు. ప్రమాదం అనేది ఊహించని, నివారించలేని ఘటన అయితేనే ఆ పదానికి అర్థం ఉంటుంది. కానీ ముందస్తు జాగ్రత్తలతో, క్రమబద్ధమైన తనిఖీలతో, సక్రమమైన నిర్వహణతో నివారించగల ప్రమాదం జరిగితే దానిని కేవలం ప్రమాదంగా పరిగణించలేం. ముఖ్యంగా ఆస్పత్రుల విషయంలో ఈ ప్రశ్న మరింత తీవ్రంగా నిలుస్తుంది. నవజాత శిశు సంరక్షణ కేంద్రాల్లో చికిత్స పొందేవారు సాధారణ రోగులు కాదు. నెలలు నిండక ముందే పుట్టిన శిశువులు, తక్కువ బరువుతో జన్మించిన పిల్లలు, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు, అత్యంత క్లిష్టమైన ఆరోగ్యపరిస్థితుల్లో ఉన్నవారే అక్కడ ఉంటారు. వారికి ప్రతి క్షణం వైద్య పరికరాల సహాయం అవసరం. అలాంటి ప్రాంతంలో విద్యుత్ వ్యవస్థ, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సరఫరా, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు అన్నీ నిరంతరం పనిచేసే స్థితిలో ఉండాలి. ఏచిన్న లోపమైనా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుంది. అందుకే ఆస్పత్రుల్లో భద్రత అనేది అదనపు సౌకర్యం కాదు, అది చికిత్సలో అంతర్భాగం. వైద్యుడు ఎంత నైపుణ్యం కలిగి ఉన్నా, నర్సింగ్ సిబ్బంది ఎంత అప్రమత్తంగా ఉన్నా, ఆస్పత్రి భవనం, విద్యుత్ వ్యవస్థ, అగ్నిమాపక ఏర్పాట్లు, వైద్య పరికరాల నిర్వహణలో నిర్లక్ష్యం ఉంటే మొత్తం వైద్యవ్యవస్థే ప్రమాదంలో పడుతుంది. మన దేశంలో ఆస్పత్రుల నిర్వహణ, అగ్నిప్రమాదాల నివారణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి పలు నిబంధనలు ఉన్నాయి. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌కు సంబంధించిన చట్టాలు, నేషనల్ బిల్డింగ్ కోడ్, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, విద్యుత్ భద్రతా నియమాలు వంటి వ్యవస్థలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.స్థానిక అగ్నిమాపక విభాగాల తనిఖీలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, ఫైర్ అలారాలు,ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు వంటి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాల్సిందే. అయితే సమస్యనిబం



ధనలు లేకపోవడంలో మాత్రమే లేదు. నిబంధనలు అమలవుతున్నాయా? అన్నదే అసలు ప్రశ్న. చాలా సందర్భాల్లో భద్రతా ధృవపత్రాలు తీసుకోవడం ఒకసారి జరిగే అధికారిక ప్రక్రియగా మారిపోతోంది. ఆస్పత్రి ప్రారంభానికి ముందు తనిఖీజరిగినా, ఆతర్వాత పరికరాల నిర్వహణ ఎలాఉంది? విద్యుత్ వైర్ల పరిస్థితి ఏమిటి? ఫైర్ అలారంపనిచేస్తుందా? ఆక్సిజన్ లైన్లలో లీకేజీ ఉందా? వెంటిలేటర్లు, మానిటర్లు వంటి పరికరాలకు నిర్ణీత వ్యవధిలో సర్వీసింగ్ జరుగుతోందా? అత్యవసర పరిస్థితిలో రోగులను తరలించేందుకు సిబ్బందికి శిక్షణ ఉందా? వంటి ప్రశ్నలకు సమాధానాలు నిరంతరం పరిశీలించాలి. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాత భవనాలు, అధిక రోగుల సంఖ్య, పరిమిత వనరులు, సిబ్బంది కొరత వంటి సమస్యలు ఉంటాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో మరో రకమైన సమస్యలు కనిపిస్తాయి. అధిక రద్దీ, వాణిజ్య ఒత్తిళ్లు, భవన సామర్థ్యానికి మించి సదుపాయాల ఏర్పాటు, నిర్వహణపై ఖర్చు తగ్గించే ప్రయత్నాలు వంటి అంశాలు భద్రతను ప్రభావితం చేసే అవకాశంఉంది. అందువల్ల ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా ప్రతి ఆస్పత్రికి ఒకే స్థాయి భద్రతా ప్రమాణాలు వర్తించాలి. ఆస్పత్రుల్లో జరిగే అగ్నిప్రమాదాలు ఈ సమస్య తీవ్రతను పదేపదే గుర్తు చేస్తున్నాయి. ఒక భవనంలో అగ్ని చెలరేగినప్పుడు సాధారణ కార్యాలయంలో ఉన్న వ్యక్తి పరుగెత్తి బయటకు రావచ్చు. కానీ ఐసీయూలోని రోగి, వెంటిలేటర్‌పై ఉన్న వ్యక్తి, ఆపరేషన్ థియేటర్‌లో ఉన్న రోగి లేదా ఇంక్యుబేటర్‌లో ఉన్న నవజాత శిశువు అలా చేయలేరు. వారి ప్రాణాలు పూర్తిగా ఆస్పత్రి వ్యవస్థపై ఆధారపడి ఉంటాయి. అందుకే ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాలు ఇతర భవనాల కంటే మరింత కఠినంగా ఉండాలి. ఇంకో ముఖ్యమైన అంశం ఫైర్ ఆడిట్. ఫైర్ సేఫ్టీ పరికరాలు గోడలకు అమర్చినంత మాత్రాన భద్రత ఏర్పడదు. అవి పనిచేస్తున్నాయా లేదా అన్నది నిరంతరం పరీక్షించాలి. ఫైర్ డ్రిల్స్ నిర్వహించాలి. అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఎలాంటి వస్తువులతోనూ మూసుకుపోకుండా చూడాలి. ఆస్పత్రి సిబ్బందికి అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఎవరు ఏ బాధ్యత తీసుకోవాలో ముందుగానే స్పష్టత ఉండాలి. ముఖ్యంగా ఎస్ఎన్‌సియు, ఎన్ఐసియు, ఐసియు ఆపరేషన్ థియేటర్, డయాలసిస్ కేంద్రాలు వంటి అత్యంత సున్నితమైన విభాగాలకు ప్రత్యేక భద్రతా ప్రోటోకాల్ ఉండాలి. వైద్య పరికరాల నిర్వహణ కూడా అంతే కీలకం. వెంటిలేటర్ వంటి ప్రాణాధార పరికరాల్లో చిన్న సాంకేతిక లోపం కూడా తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చు. పరికరాల కొనుగోలు సమయంలో నాణ్యతను పరిశీలించడంతో పాటు, వాటి కాలానుగుణ నిర్వహణ, సర్వీసింగ్, ఎలక్ట్రికల్ సేఫ్టీ టెస్టులు, తయారీదారుల మార్గదర్శకాల అమలు వంటి అంశాలను కచ్చితంగా పర్యవేక్షించాలి. పరికరం పనిచేస్తోంది కాబట్టిసురక్షితంగానే ఉందని భావించడం ప్రమాదకరం. అయితే ప్రతి విషాదం తర్వాత విచారణ కమిటీ వేయడం, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించడం మాత్రమే పరిష్కారం కాదు. విషాదం జరగకముందే వ్యవస్థ మేల్కొనాలి. ఒక ఆస్పత్రిలో ప్రమాదం జరిగిన తర్వాత మాత్రమే తనిఖీలు చేయడం కంటే, దేశవ్యాప్తంగా ఆస్పత్రుల భద్రతపై నిరంతర ఆడిట్ వ్యవస్థను ఏర్పాటు చేయడం అవసరం. తనిఖీలను ముందస్తు సమాచారం లేకుండా నిర్వహించాలి. లోపాలు గుర్తిస్తే వాటిని సరిదిద్దేందుకు నిర్దిష్ట గడువు ఇవ్వాలి. తీవ్రమైన భద్రతా లోపాలున్న ఆస్పత్రులపై కఠినచర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఆస్పత్రులభద్రతను కేవలంయాజమాన్యాల బాధ్యతగా చూడటం కూడా సరైందికాదు. రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, అగ్నిమాపక శాఖలు, విద్యుత్ శాఖలు, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలి. ఆస్పత్రి అనుమతులు, పునరుద్ధరణలు, పరికరాల తనిఖీలు వంటి అంశాలను ఒక సమగ్ర డిజిటల్ వ్యవస్థతో అనుసంధానం చేస్తే జవాబుదారీతనం పెరుగుతుంది. ఆస్పత్రులు కూడా తమ భద్రతా ప్రమాణాలను ప్రజలకు పారదర్శకంగా తెలియజేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా, ఆరోగ్య సేవలను కేవలం వ్యాపార సేవగా చూడకూడదు. రోగిఆస్పత్రికి డబ్బు చెల్లించి చికిత్స కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు మాత్రమే కాదు, అతని ప్రాణాన్ని ఆస్పత్రి తన బాధ్యతగా స్వీకరిస్తుంది. ఈబాధ్యతకు భద్రతే పునాది. వైద్యంఅందించే ప్రదేశంలోనే రోగి ప్రాణానికి ముప్పు ఏర్పడితే అది వైద్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పడం మాత్రమే సరిపోదు. ఆరోగ్య సేవలను అందించే సంస్థలు కూడా భద్రతే మొదటి ప్రాధాన్యం అనే సిద్ధాంతాన్ని ఆచరణలో చూపాలి. ●

# గ్రామాలలో అదుపులేని మద్యం విక్రయాలు

కామిడి సతీష్ రెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో, పట్టణాలలో పుట్టగొడుగుల్లా బెల్టు దుకాణాలు మద్యాన్ని విక్రయిస్తున్నాయి. మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతూవున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. పల్లెలు, పట్టణాలనే తేడాలేకుండా ఏరులై పారుతున్న అన్నీతెలిసినా అటువైపు కన్నెత్తిచూడకుండా ఎక్సైజ్ అధికారులు వ్యవహరించడం జరుగుతుందని ఆరోపణలున్నాయి. అన్ని జిల్లాలలో బెల్టు షాపుల దందా జోరుగా సాగుతోంది. కిరాణాదుకాణం నుంచి మొదలుకొని నివాస గృహాలు, పాన్ షాపులు, కల్లు కాంపౌండ్‌ల సమీపంలో మద్యం ఏరులై పారుతోంది. భవననిర్మాణ కార్మికులు, కూలీలు, హోటల్‌లు, ఇసుక రవాణా కార్మికులకు తెల్లవారు జామునే మద్యం అందిస్తూ బెల్టు దందాను మూడు క్వార్టర్లు, ఆరు ఆఫ్‌లుగా సాగిస్తున్నారు. గతంలో వైన్ షాపుల పరిసరాలలో కొనసాగిన ఈ దందా ప్రస్తుతం గల్లీకొకటి ఏర్పాటు కావడంతో మద్యం ప్రియులు ఉదయం టీ, కాఫీలకు బదులుగా మద్యాన్ని తాగుతూ ఎక్కడపడితే అక్కడ పడిపోతూ గాయాలపాలవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా ఉదయం పూట వాహనాలలో తీసుకువచ్చి, ఆ ప్రాంతంలోనే ఓ కల్లు కాంపౌండ్ పరిసరాలలో పలువురు పాన్‌షాపులు ఏర్పాటుచేసి అందులో బెల్టుదుకాణం నడిపిస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. గుడుంబా విక్రయాలు మానేసిన వారికి ప్రభుత్వం ఓవైపు స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మరోవైపు బెల్టు దుకాణాలు పల్లెలు, పట్టణ ప్రజలను మత్తులో ముంచుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగుతున్నా చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.లిక్కర్ డాన్లు వివిధ జిల్లాల్లో కమీషన్లకు బెల్టు షాపుల వారికి మద్యం సరఫరా చేస్తున్నారు. రోజుకు ఎంతఅమ్మితే అంత కమీషన్లు అందిస్తుండడంతో బెల్టుషాపుల నిర్వాహకులు ఒకరిని చూసి మరొకరు ఈ దందాను జీవనోపాధిగా చేసుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ దందాను బహిరంగంగా కొనసాగిస్తూ ప్రజలను మత్తులో ముంచుతున్నారు. ఆ మద్యం తాగిన వ్యక్తులు వాటికి బానిసలై తమ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. ఒకప్పుడు నగరాలు, పట్టణప్రాంతాలకే పరిమితమైన ఈదందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో బెల్టుదుకాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామనిఅధికారులు ప్రకటిస్తుంటే మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా బెల్టుదుకాణాలు కొనసాగుతున్నాయి. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో బెల్టుదుకాణాలు జోరందుకున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఒక్కో గ్రామంలో పదులసంఖ్యలోనే మద్యం షాపులుకొనసాగుతున్నాయి. వివిధ మండలాలలోని కొన్ని గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని తెలుస్తుంది. అందులో బాటిళ్లను ఎంఆర్‌పీకంటే రూ.50నుంచిరూ.100 వరకు ఎక్కువకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారిస్తేనే ఈబెల్టు దందాకు అడ్డుకట్టపడడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించిన వారవుతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనయినా ప్రభుత్వం,సంబంధిత అధికారులు దృష్టి సారించాలి.బెల్ట్ షాప్ నిర్వాహకుల మీద ఉక్కు పాదం మోపాలి. ●

# విద్యార్థుల శ్రమకు చట్టబద్ధ రక్షణ కవచం!



ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్రరావు

దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య ప్రవేశాలు, వివిధ పోటీ పరీక్షల కోసం అపారమైన శ్రమతో సిద్ధమవుతుంటారు. వారి ఆశలు, ఆశయాలు, భవిష్యత్తు అంతా ఈ పరీక్షల ఫలితాలపైనే ఆధారపడి ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ప్రశ్నపత్రాల లీకేజీలు, సంఘటిత పరీక్షా అక్రమాలు, డిజిటల్ మోసాలు తరచూ వెలుగుచూడడం వల్ల ప్రతిభకు బదులుగా అక్రమాలకు అవకాశం లభిస్తోందనే ఆందోళన దేశవ్యాప్తంగా వ్యక్తమైంది. ముఖ్యంగా నీట్ యూజీ వంటి జాతీయస్థాయి పరీక్షల చుట్టూ ఏర్పడిన వివాదాలు విద్యార్థులలోనే కాక సమాజంలో కూడా పరీక్షా వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఈనేపథ్యంలో విద్యార్థుల శ్రమను రక్షిస్తూ, పరీక్షల విశ్వసనీయతను పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పబ్లిక్ పరీక్షల (అక్రమాల నిరోధక) సవరణ చట్టం2026 ఒక కీలకమైన సంస్కరణగా చెప్పవచ్చు. వాస్తవానికి, 2024లో కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్ఫెయిర్ మీన్స్) యాక్టు అమల్లోకి తీసుకొచ్చింది. యూపీఎస్సీ ఎస్ఎస్సీ, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డులు, ఐబీపీఎస్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వంటి కేంద్ర సంస్థలు నిర్వహించే పరీక్షల్లో అక్రమాలను అరికట్టడమే ఆ చట్టం లక్ష్యం. అయితే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు, ప్రశ్నపత్రాల డిజిటల్ లీకేజీలు, అంతర్రాష్ట్ర స్థాయిలో పనిచేసే ముఠాల కార్యకలాపాలు పెరగడంతో 2024 చట్టంలోని నిబంధనలు సరిపోవని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే మరింత కఠినమైన నిబంధనలతో 2026సవరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఈ సవరణ చట్టం పరిధి కూడా విస్తృతంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ నియామక పరీక్షలతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే నీట్, జేఈఈ వంటి ప్రవేశ పరీక్షలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు వాటి అనుబంధ సంస్థలు నిర్వహించే అన్ని రకాల పబ్లిక్ పరీక్షలకు ఇది వర్తిస్తుంది. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ చట్టాన్ని నమూనాగా స్వీకరించి తమ రాష్ట్రాల్లో అమలు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ముఖ్యంగా నిజాయితీగా పరీక్షలు రాసే సాధారణ విద్యార్థులను ఈ చట్టం నేరస్థులుగా పరిగణించదు. పరీక్షావ్యవస్థను దెబ్బతీసే లీకేజీ ముఠాలు,అక్రమాలకు పాల్పడే సంస్థలు,కోచింగ్ సిండికేట్లు, ఇతర వ్యవస్థీకృత నేరగాళ్లపైనే దీని దృష్టి కేంద్రీకృతమైంది. ఈ చట్టంలో అత్యంత ముఖ్యమైన అంశం శిక్షలను గణనీయంగా కఠినతరం చేయడం. గతచట్టంలో వ్యక్తిగత అక్రమాలకు 3నుండి 5సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా ఉండగా,ఇప్పుడు 5 నుండి



10 సంవత్సరాల వరకు జైలు శిక్షతోపాటు రూ.50 లక్షల వరకు జరిమానా విధించేలా నిబంధనలు మార్చారు.సంఘటిత నేరాలకు పాల్పడే ముఠాలపై కనీసం 7 నుండి 10 సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు భారీ జరిమానా విధించే అవకాశం కల్పించారు. పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన థర్డ్ పార్టీ సర్వీస్ ప్రొవైడర్లు లేదా డిజిటల్ ఏజెన్సీలు అక్రమాలకు పాల్పడితే రూ.5కోట్లవరకు జరిమానా విధించడంతోపాటు ఎనిమిదేళ్లపాటు పరీక్షలనిర్వహణ నుంచి నిషేధించవచ్చు. పరీక్ష నిర్వహణకు అయిన మొత్తం వ్యయాన్ని కూడా వారి నుంచే వసూలు చేసే నిబంధనను చేర్చడం ఈచట్టం ప్రత్యేకత. శిక్షలను పెంచడమేకాకుండా, విచారణ ప్రక్రియను వేగవంతం చేయడంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. ప్రతి రాష్ట్రం,కేంద్రపాలిత ప్రాంతంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే అవకాశం కల్పించారు. నేరం నమోదైన రెండు నెలల్లోపు దర్యాప్తు పూర్తిచేసి ఛార్జిషీట్ దాఖలు చేయాలి. అనంతరం మూడు నెలల్లో కోర్టు తీర్పు ఇవ్వాలని సమయపరిమితి నిర్ణయించారు. అంటే మొత్తం ఐదు నెలల్లోనే కేసు విచారణ పూర్తయ్యేలా చట్టం లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్రాష్ట్ర స్థాయిలో పనిచేసే పేపర్ లీకేజీ ముఠాలను అణచివేయడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసే అధికారం కూడా కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు. అక్రమాలకు పాల్పడిన సంస్థలు లేదా వ్యక్తుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈచట్టం కల్పించడం గమనార్హం. ఈ నూతన చట్టం వల్లఎక్కువగా లాభపడేది నిజాయితీగా కష్టపడి చదివేవిద్యార్థులే. కఠినమైన శిక్షలు, భారీ జరిమానాలు అక్రమాలకు పాల్పడే ముఠాలకు గట్టి హెచ్చరికగా నిలుస్తాయి. వేగవంతమైన విచారణవల్ల పరీక్షల ఫలితాలు సంవత్సరాల తరబడి అనిశ్చితిలో ఉండే పరిస్థితి తగ్గుతుంది.పారదర్శకత పెరగడంద్వారా విద్యా,ఉద్యోగ నియామక వ్యవస్థలపై యువతలో తిరిగి విశ్వాసం పెరుగుతుంది. పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన డిజిటల్ సంస్థలు,సాంకేతిక సేవల సంస్థలు కూడా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే చట్టం తీసుకురావడం ఒక్కటే సమస్యకు సంపూర్ణ పరిష్కారంకాదు. దీని సమర్థవంతమైన అమలే విజయాన్ని నిర్ణయిస్తుంది. బ్లూటూత్ పరికరాలు, హ్యాకింగ్, ఎన్క్రిప్టెడ్ కమ్యూనికేషన్ వంటి అత్యాధునిక సైబర్ నేరాలను తక్కువ సమయంలో దర్యాప్తు చేయడం సవాలుతో కూడుకున్న అంశం. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు సమర్థంగా పనిచేయాలంటే తగిన సంఖ్యలో న్యాయమూర్తులు, సిబ్బంది,మౌలిక వసతులు అందుబాటులో ఉండాలి. అంతేకాకుండా వివిధ రాష్ట్రాల పోలీసువ్యవస్థల మధ్య సమన్వయం బలపడాల్సిన అవసరం కూడాఉంది.ముందుచూపుతో వ్యవహరించాలంటే కేవలం శిక్షలను కఠినతరం చేయడం సరిపోదు. ప్రశ్నపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనంవరకు అత్యున్నత స్థాయి సైబర్ భద్రతా ప్రమాణాలను అమలు చేయాలి. పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్ ధృవీకరణ, కృత్రిమమేధ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను విస్తృతంగా వినియోగించాలి.పరీక్షా అక్రమాలపై ముందస్తు సమాచారం అందించే విజిల్ బ్లోయర్లకు చట్టబద్ధ రక్షణ కల్పించడం కూడా అంతే అవసరం.మొత్తంగా చూస్తే, పబ్లిక్ పరీక్షల (అక్రమాల నిరోధక) సవరణ చట్టం 2026 కేవలం ఒకశిక్షా చట్టం మాత్రమే కాదు,దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల శ్రమకు,ప్రతిభకు, భవిష్యత్తుకు ప్రభుత్వం ఇచ్చిన చట్టబద్ధమైన భరోసా. పరీక్షలలో పారదర్శకతను పెంపొందించడం, అక్రమాలను అరికట్టడం,ప్రతిభకు సముచిత గౌరవం కల్పించడం వంటి లక్ష్యాల సాధనకు ఇది బలమైన అడుగు. ●

## ప్రజావాక్కు



### దొంగబాబాల ఆటకట్టించాలి

రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్లతో నడుస్తుందట.పిల్లి గుడ్డిదయితే ఎలుక ఏదో చూపిందట.అలాగ ఉంది దేశంలో రాష్ట్రంలో పాలకుల పరిస్థితి.నెహ్రూ కాలంలో బాబా అనేవాడు ఎక్కడ కనిపించేవాడు కాదు. కనిపిస్తే తంతారని భయం.ఇందిరాగాంధీ కాలంలో సగం నుండి బాబాలు బయలు దేరారు. మోడీ కాలంలో నేరుగా పార్లమెంటు భవనాన్ని ప్రారంభం చేసే స్థాయికి ఎదిగారు. మోడీనే నేరుగా కోయంబత్తూరు దగ్గర జగ్గీ వాసుదేవ్ బాబా ఆశ్రమాన్ని ప్రారంభించాడు. హత్యలు అత్యాచారాలు చేసిన డేరా బాబాకు 20 ఏళ్ల శిక్షపడితే 17 సార్లు పెరోల్ బెయిల్ వచ్చింది. ఇలాంటి వారిని జైల్లలో పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రజలు ఇంకా మోసపోకముందే ప్రభుత్వం కళ్లుతెరవాలి.ఇప్పటికైన ప్రజలు ఇంకా మోసపోకుండాప్రభుత్వం ఇలాంటి దొంగల పని పట్టాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశంజిల్లా

### ఎల్‌నినో కారణంగా పోయిన పంటలెన్నో?

పసిఫిక్ మహాసముద్రం తూర్పు, మధ్య భూ మధ్య రేఖ ప్రాంతంలో సముద్రఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడాన్ని ఎల్‌నినో అంటారు. దీనివల్ల గాలి వీచే దిశలు మారిపోయి ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో తీవ్రవఅంతరాలు ఏర్పడతాయి.కొన్నిప్రాంతాలలో కరవు తాండవిస్తే, మరికొన్నిచోట్ల భారీ వర్షాలు కురుస్తాయి. ఎల్‌నినో ప్రభావం భారతదేశంలో వర్షపాతానికి కీలకమైన నైరుతి రుతుపవనాలపై ఎక్కువగాఆధారపడి ఉండటం వలన ఆప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలహీన పడటం కారణంగా కరవు పరిస్థితులు ఏర్పడి పంటలకు భారీ నష్టం వాటిల్లింది.

- డా.దన్నాన అప్పలనాయుడు,విజయనగరం

### ఆడవారిని గౌరవిద్దాం

ఆడపిల్లలను మన సోదరీమణులుగా భావించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఎక్కడైనా మహిళలను గౌరవంగా చూడాలి,వారికి అవసరమైనప్పుడు అండగా నిలిచి రక్షణగాఉండాలి. చిన్నప్పటినుంచే పిల్లలకు ఆడపిల్లలను, మహిళలను గౌరవించడం, వారితో మర్యాదగా, బాధ్యతగా మెలగడం తల్లిదండ్రులు నేర్పించాలి. ప్రతి తల్లిలో అమ్మను,ప్రతి సోదరిలో ఆత్మీయతను చూడగలిగే మంచి సంస్కారాన్ని పిల్లల్లో పెంపొందించాలి. స్త్రీకి ఇచ్చే గౌరవమే మన వ్యక్తిత్వానికి నిజమైన గుర్తింపు.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### విద్యార్థులే నిర్వాసితులు

విశాఖపట్నం, మారికవలసలో ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలుర గురుకుల పాఠశాల 2004సంవత్సరం నుండి విజయవంతంగా నడుస్తోంది. ఏటేటా పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు నమోదు చేస్తోంది. అక్కడ చదువుకున్న విద్యార్థులు మంచి సంఖ్యలోనే ఉన్నత విద్యా సంస్థల్లో అవకాశాలు పొందారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో చక్కగా నడపబడుతూ ఉత్తరాంధ్రలోని గిరిజన బాలురకునాణ్యమైన విద్యనందిస్తూ పేరొందిన విద్యాలయం ఇది. ఈ విద్యాలయాన్ని ఉన్న ఫలంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మార్చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయం. అంటే ఇక్కడి విద్యార్థుల్ని ఖాళీ చేసి 600 మంది ఇంటర్మీడియట్ గిరిజన బాలబాలికలకు నీట్,ఐఐటీపరీక్షలకు ప్రైవేటు కోచింగ్ కూడా ఇప్పించి సిద్ధంచేస్తారట.కోచింగ్ ఉద్దేశ్యం మంచిదే.కానీ అందుకోసం విద్యాసంవత్సరం మొదలై మూడు మాసాల తర్వాత,కుదురుకొని చదువులో ఉన్నవారిని ఉన్నఫలంగాఖాళీ చేయించికొత్త కోచింగ్ సెంటర్ మొదలు పెట్టడమే బాగాలేదు.

- డా.డి.వి.జి.శంకర రావు, విజయనగరం

### విపత్తులను ముందుగానే అంచనా వేయాలి

ఒకే దేశంలో, ఒకే సమయంలో ఒక ప్రాంతం చుక్క నీటి కోసం ఎదురుచూస్తుంటే మరో ప్రాంతం వరద నీటిలో మునిగిపోవడం భారత భౌగోళిక వైవిధ్యానికి విషాదకరమైన ప్రతిబింబం. మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇదే విరుద్ధ దృశ్యం ఒక్కోసారి ఒకేరాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో కనిపిస్తుంది. ప్రకృతి వైవిధ్యం సహజమే అయినా, ప్రజల కష్టాలు మాత్రం ప్రతి ఏటా పునరావృతం కావడం సహజం కాదు. వర్షం తక్కువైతే కరువు, ఎక్కువైతే వరద అన్నట్టుగా పరిస్థితి మారింది. నగరాల్లోఅయితే సాధారణ వర్షానికే రహదారులు కాలువలుగా మారుతున్నాయి. ప్రతి ఏడాది ఉపశమన చర్యల కోసం ఎదురుచూసే దేశం నుంచి, విపత్తులను ముందుగానే అంచనా వేసి వాటి ప్రభావాన్ని తగ్గించే దేశంగా భారత్ మారాల్సిన సమయం వచ్చింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పురాతన సాంప్రదాయాలు పాటించాలి

గ్రామాలలో జరిగే బోనాల పండుగలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికిపూజలు నైవేద్యాలు సమర్పించాలి.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుజరగకుండా రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ సామరస్యబద్ధంగా వేడుకలు జరుపుకోవాలి. చిన్న పెద్దఅనే తేడా లేకుండా అందరిని గౌరవిస్తూ వేడుకలను జరుపుకోవాలి.సంప్రదాయాలను భవిష్యత్‌తరాలకు తెలపాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన విధి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇరాన్‌పై దాడులు భద్రతకు పెనుముప్పు

## - ఎన్‌సిఒ కీలక ప్రకటన - షాంఘై సహకార సదస్సులో

## 'బిష్కెక్ డిక్లరేషన్'కు ఆమోదం - రాజకీయ దౌత్యమే పరిష్కార మార్గం :భారత్



**బిష్కెక్, సెప్టెంబరు 2:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్‌పై జరిగిన సైనిక దాడులను ఖండిస్తూ 'బిష్కెక్ డిక్లరేషన్ను సభ్య దేశాలు ఆమోదించాయి. ఈ చర్యలు అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు విరుద్ధంగా ఉన్నాయని, అంతర్జాతీయ శాంతి, భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తున్నాయని ప్రకటన పేర్కొంది. అయితే భారత్ ఈ సంయుక్త ప్రకటనకు మద్దతు తెలిపింది. అయితే భారత్ తన ద్వైపాక్షిక ప్రకటనల్లో అమెరికా, ఇజ్రాయెల్ పేర్లను నేరుగా ప్రస్తావించకుండా ఇరాన్ సార్వభౌమత్వానికి మద్దతు, సమస్యలకు రాజకీయదౌత్య పరిష్కారమే మార్గమని తన వైఖరిని కొనసాగించింది. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశంలో భారత్‌కు అనూహ్య ప్రశంసలు లభించాయి. బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకాషెంకో భారత్‌ను ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన దేశాల సరసన నిలిపారు. చైనా, రష్యాతో పాటు భారత్‌ను మూడు కీలక శక్తులుగా అభివర్ణించారు. ఎస్‌సిఒ వేదికపై లుకాషెంకో మాట్లాడుతూ సభ్య దేశాలన్నీ సమానమే అయినప్పటికీ, చైనా, భారత్, రష్యా మూడు అత్యంత శక్తివంతమైన దేశాలని గుర్తించాల్సి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మూడు దేశాలు ఆర్థికంగా బలమైనవి, వనరులు కలిగినవి, అణ్వస్త్ర సామర్థ్యం ఉన్న దేశాలని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల్లో అమెరికాను ఆ మూడు దేశాల జాబితాలో ప్రస్తావించకపోవడం అంతర్జాతీయంగా ఆసక్తిని రేకెత్తించింది. ఎస్‌సిఒ సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భద్రత, కనెక్టివిటీ, అవకాశాలపై భారత్ ప్రాధాన్యతలను వివ రించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటు వాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు ఉండకూడదని భారత్ మరోసారి స్పష్టం చేశారు. పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తదితర నేతల సమక్షంలో మోడీ, ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే శక్తులను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. యుద్ధాలకు ముగింపు పలికి చర్చలు, దౌత్యం ద్వారా సమస్యలను పరిష్కరించాల్సిన అవసరాన్ని మోడీ పునరుద్ఘాటించారు. మొత్తంగా బిష్కెక్ ఎస్‌సిఒ సదస్సు.. భారత్‌ను కీలక ప్రపంచ శక్తిగా లుకాషెంకో అభివర్ణించడం, ఇరాన్ అంశంపై సంయుక్త ప్రకటన, ఉగ్రవాదంపై మోడీ స్పష్టమైన వైఖరి, రష్యాచైనాలతో భారత్ దౌత్య చర్చలు వంటి పరిణామాలతో అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# భారత్‌ను హిందూదేశంగా ప్రకటించాలి

## పద్మభూషణ్ గ్రహీత సాధ్వి రితంబర

**పూరీ, సెప్టెంబరు 2:** భారత్ సాంస్కృతిక విలువలు, సంప్రదాయాలు, జీవన విధానం పరంగా ఇప్పటికే హిందూ దేశంగా ఉందని పద్మభూషణ్ అవార్డు గ్రహీత సాధ్వి రితంభర అన్నారు. రాజకీయంగానూ భారత్‌ను హిందూ దేశంగా ప్రకటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పూరీలో బుధవారం శ్రీ జగన్నాథుడిని దర్శించుకున్న అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పూరీలోని బాలియాపండాలోని సెవెన్ హిల్స్‌లో ఏడు రోజుల పాటు భాగవత కథ నిర్వహించేందుకు సాధ్వి రితంభర వచ్చారు. ఈ సందర్భంగా హిందూ రాష్ట్రం డిమాండ్‌పై జరుగుతున్న రాజకీయ చర్చపై ఆమె స్పందించారు. భారతదేశ మెజారిటీ ప్రజల ఆలోచనల్లో 'వసుధైవ కుటుంబకమ్ భావన ఉందన్నారు. ప్రపంచమంతా ఒకే కుటుంబమనే ఈ సిద్ధాంతాన్ని రాజకీయ పార్టీలు ప్రపంచానికి పరిచయం చేయాలని చెప్పారు. సనాతన ధర్మంలోని ప్రాథమిక సిద్ధాంతాలను ప్రోత్సహించడం ద్వారా 'వసుధైవ కుటుంబకం సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించవచ్చని సాధ్వి రితంభర అన్నారు. భారతీయ సంప్రదాయాలు, ఆచారాలు, సామూహిక చైతన్యంలో హిందూ దేశ భావన ఇప్పటికే ఉందని చెప్పారు. భారత రాజ్యాంగంలో శ్రీరామచంద్రుడి ప్రస్తావన నుంచి 'సత్యమేవ జయతే వరకు దేశ సాంస్కృతిక భావజాలం కనిపిస్తోందని ఆమె అన్నారు. హిందువుల సంక్షేమమే భారత సంక్షేమమని వ్యాఖ్యానించారు. భావాలు, ప్రవర్తన, జీవన విధానం పరంగా భారత్ హిందూ దేశంగానే ఉందని.. రాజకీయంగా కూడా హిందూ దేశంగా ప్రకటించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఆవుల సంరక్షణపైనా ఆమె మాట్లాడారు. గోవధ, మహిళలపై హింస, గర్భంలోని ఆడ శిశువుల హత్య జరిగే చోట శాంతి, సంతోషం ఉండవని అన్నారు. ప్రభుత్వాలు ఇతర మార్గాల్లో ఆదాయం పొందవచ్చని.. గోమాంసం విక్రయాల ద్వారా ఆదాయం పొందడం తీవ్రమైన పాపమని వ్యాఖ్యానించారు. జగన్నాథుడి దర్శనం తనకు ఎంతో భావోద్వేగ అనుభూతిని ఇచ్చిందని సాధ్వి రితంభర తెలిపారు. పూరీ సమన్వయానికి ప్రతీకగా నిలిచే పవిత్ర క్షేత్రమని ఆమె పేర్కొన్నారు.



## రామ్ మందిర్ సిఇఒగా మాజీ ఐఎఎఫ్ అధికారి జితేంద్ర మిశ్రా

**అయోధ్య, సెప్టెంబరు 2:** అయోధ్యలోని రామ్ మందిర్‌కు తొలి పూర్తికాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా మాజీ భారత వైమానిక దళ (ఐఏఎఫ్) అధికారి జితేంద్ర మిశ్రా నియమితులయ్యారు. మొత్తం 5,585 దరఖాస్తుల నుంచి ఎంపిక చేసిన ముగ్గురు అభ్యర్థుల షార్ట్‌లిస్ట్‌లో మిశ్రాను సీఈఓగా ఎంపిక చేశారు. ఆలయ విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఎనిమిది మంది అరెస్టు కావడం, రామ్ మందిర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా చేయడం వంటి పరిణామాల అనంతరం అయోధ్యలో ట్రస్ట్ సమావేశమైంది. ఈ సమావేశంలోనే సీఈఓ నియామకంపై నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఖాళీగా ఉన్న మూడు ట్రస్టీ పదవులను భర్తీ చేసే అంశంపైనా చర్చించారు. ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్, స్వామి కమలనయన్ దాస్, తాత్కాలిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ మోహన్, ట్రస్టీ మహంత్ దినేంద్ర దాస్, కోశాధికారి స్వామి గోవింద్ దేవ్ గిరి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ట్రస్ట్ మత వ్యవహారాల కమిటీలో సభ్యుడైన స్వామి కమలనయన్ దాస్ సమావేశానికి ముందు మాట్లాడుతూ ఆలయ కార్యకలాపాలు సజావుగా కొనసాగడమే తన ప్రధాన ప్రాధాన్యత అని తెలిపారు. ట్రస్ట్ డీడ్‌లో సవరణలు చేయడం, మీడియా ప్రతినిధిని నియమించడం, ఇతర పరిపాలనా అంశాలపై కూడా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ట్రస్ట్ అధ్యక్షుడి నివాసంలో ఈ సమావేశం జరిగింది.

# అమెరికాలో శాశ్వత నివాసానికి 179 యేళ్ల నిరీక్షణ





**వాషింగ్టన్, సెప్టెంబరు 2:** అమెరికాలో ఉద్యోగం చేస్తూ శాశ్వత నివాసం పొందాలనుకునే భారతీయ నిపుణులకు ఎదురుచూపులు మరింత పెరిగాయి. గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసే కొందరు భారతీయులు 179 ఏళ్ల వరకు వేచి చూడాల్సి రావచ్చని 'నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ తాజా అంచనా వెల్లడించింది. అమెరికా ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలో ఇతర దేశాల వారితో పోలిస్తే భారతీయులకే అత్యంత సుదీర్ఘ నిరీక్షణ ఉంటోందని తెలిపింది. డిసెంబరు 2025 నాటికి ఉద్యోగ ఆధారిత ఇమ్మిగ్రేషన్ పెండింగ్ దరఖాస్తులు 12 లక్షలు దాటాయి. వీటిలో దాదాపు 10 లక్షల మంది భారతీయులే ఉన్నారు. అంటే మొత్తం పెండింగ్ దరఖాస్తుల్లో భారతీయుల వాటా 79 శాతంగా ఉంది. జనవరి 2026 లేదా ఆ తర్వాత లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తు లేదా ఉద్యోగ ఆధారిత ఇమ్మిగ్రెంట్ పిటిషన్ దాఖలు చేసిన భారతీయులకు ఈబీ2 కేటగిరీలో గ్రీన్‌కార్డ్ రావడానికి 179 ఏళ్లు, ఈబీ3లో 38 ఏళ్లు, ఈబీ1లో 5 ఏళ్లు పట్టే అవకాశం ఉందని ఎన్ఎఫ్ఏపీ పేర్కొంది. అమెరికా చట్టాల ప్రకారం ప్రతి ఏడాది ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డులకు సుమారు 1.40 లక్షల పరిమితి ఉంది. ఇందులో ఉద్యోగితో పాటు అతడి కుటుంబ సభ్యులకూ గ్రీన్ కార్డులు ఉంటాయి. మరోవైపు దేశాల వారీగా కూడా కోటా పరిమితులు ఉన్నాయి. జనాభా భారీగా ఉన్న భారత్ వంటి దేశాలకు చిన్న దేశాలతో సమానంగా పరిమిత సంఖ్యలో గ్రీన్‌కార్డులు లభిస్తుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. చైనాకు చెందిన ఈబీ2 దరఖాస్తుదారులకు సుమారు 25 ఏళ్ల నిరీక్షణ ఉండొచ్చని ఎన్ఎఫ్ఏపీ అంచనా వేసింది. చైనా ఈబీ3 దరఖాస్తుదారులకు దాదాపు 7 ఏళ్ల సమయం పడొచ్చని తెలిపింది. భారతీయుల ఈబీ2 క్యూ ఎలా పెరిగిందో గత గణాంకాలు కూడా చెబుతున్నాయి.

2016లో 47,601 మంది భారతీయుల ఈబీ 2 పిటిషన్లను యూఎస్‌సీఐఎస్ క్లియర్ చేసింది. కుటుంబ సభ్యులతో కలిపి ఇది దాదాపు 98,594 మందికి సమానం. అయితే ఆ ఏడాది కేవలం 4,407 మంది భారతీయులకే ఈబీ2 శాశ్వత నివాసం లభించింది.

# బర్త్‌రైట్ సిటిజెన్‌షిప్‌కు ట్రంప్ చెక్

# నిబంధనలు మరింత కఠినం





**వాషింగ్టన్, సెప్టెంబరు 2:** అమెరికాలో పుట్టే పిల్లలకు లభించే ఆటోమేటిక్ పౌరసత్వం విషయంలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం మరో సంచలన నిర్ణయానికి తెరదీస్తోంది. అమెరికాలో జన్మించిన చిన్నారులకు పాస్‌పోర్ట్ కావాలంటే ఇకపై కేవలం వారి బర్త్ సర్టిఫికేట్ మాత్రమే సరిపోదు. దరఖాస్తు చేసుకునే సమయంలో తల్లిదండ్రులు కూడా తమ పౌరసత్వాన్ని లేదా అధికారిక ఇమ్మిగ్రేషన్ హోదాను కచ్చితంగా నిరూపించుకోవాల్సి ఉంటుందనే ప్రతిపాదన వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన ముసాయిదా మార్గదర్శకాలను యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ సిద్ధం చేస్తోంది. కేవలం పిల్లలకు అమెరికా పౌరసత్వం సంపాదించడం కోసమే చాలామంది విదేశీయులు గర్భవతిగా ఉన్న సమయంలో పర్యాటక వీసాలపై యూఎస్ వస్తుంటారు. దీనిని అరికట్టడానికే ట్రంప్ ప్రభుత్వం గతనెల6న ఒక ప్రత్యేక కార్య నిర్వాహక ఉత్తర్వును జారీ చేసింది. ఈ నిబంధనలను పక్కాగా అమలు చేయడంలో భాగంగానే స్టేట్ డిపార్ట్‌మెంట్ కొత్త రూల్స్ రూపకల్పన చేస్తోంది. అమెరికన్ పౌరసత్వానికి ఉన్న విలువను కాపాడటానికే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి టామీ పిగోట్ తేల్చి చెప్పారు. పిల్లలకు పాస్‌పోర్ట్ అప్లై చేసేటప్పుడు తల్లిదండ్రులు తాము అమెరికన్ పౌరులమని నిరూపించుకోవడానికి చెల్లుబాటు అయ్యే యూఎస్ పాస్‌పోర్ట్ లేదా బర్త్ సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ తల్లిదండ్రులు విదేశీయులైతే తమ ఇమ్మిగ్రేషన్ హోదాను స్పష్టం చేసే ఐ94 ఫారం లేదా గ్రీన్ కార్డ్ వంటి కీలక పత్రాలను చూపించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానంలో పిల్లల బర్త్ సర్టిఫికేట్, తల్లిదండ్రుల ఫోటో ఐడీ మాత్రమే అడుగుతున్నారు తప్ప, తల్లిదండ్రుల పౌరసత్వానికి సంబంధించిన ప్రత్యేక ఆధారాలు అడగడం లేదు. పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు ట్రంప్ గతంలో తెచ్చిన ఆదేశాలను అమెరికా సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది. దీంతో ఈసారి విదేశీ దౌత్యవేత్తలు, మోసపూరిత మార్గాల్లో పౌరసత్వం పొందేందుకు వచ్చినవారు, లేదా బర్త్ టూరిజం ద్వారా వచ్చిన వారి పిల్లలకు మాత్రమే పౌరసత్వాన్ని పరిమితం చేస్తూ కొత్త ఉత్తర్వులను తీసుకొచ్చారు. అయితే ఈ కొత్త ఉత్తర్వులపైనా ఇప్పటికే అమెరికా కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. మేరీ ల్యాండ్‌లోని ఫెడరల్ జడ్జి ముందు ఈ కేసుకు సంబంధించి విచారణ జరుగుతుండగా, ప్రభుత్వం ఇంకా అధికారికంగా నోటిఫికేషన్ ఇవ్వలేదు కాబట్టి ఇప్పటికిప్పుడు స్టే ఇవ్వలేమని న్యాయశాఖ లాయర్లు వాదిస్తున్నారు.



# నేపాల్‌లో వరద బాధితులకు సోనూసూద్ సాయం

## వరద ఉపద్రవాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన బాలీవుడ్ నటుడు

**ముంబయి, సెప్టెంబరు 2:** బాలీవుడ్ నటుడు సోనూ సూద్ నేపాల్ వరద బాధితలకు సహాయక సామగ్రి అందిస్తున్నారు. నేపాల్‌లో ఆయన సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. నేపాల్ వెళ్లిన నటుడు సోనూ సూద్ బుధవారం ఉదయం త్రిశూలీ బజార్‌ను సందర్శించారు. సోనూసూద్ ఛారిటీ క్లబ్ తరపున ఆయన సాయం చేస్తున్నారు. ఆగస్టు 26వ తేదీన సంభవించిన వరదల్లో త్రిశూలీ నది పరివాహక ప్రాంతంలో ఉన్న త్రిశూలీ గ్రామం, బజార్ పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. కళ్లముందు చాలా విధ్వంసం జరిగిందని, దాని తీవ్రత మరీ అధికంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. త్రిశూలీ నదిలో బురద, బండరాళ్లతో కూడిన వరద పోటెత్తుతున్నా ఓ ఇల్లు మాత్రం చెక్కుచెదరకుండా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఆ లైట్ గ్రీన్ హౌజ్‌ను ఇప్పుడు మిరాకిల్ హౌజ్‌గా పిలుస్తున్నారు. ఆ ఇంటి సమీపానికి నటుడు సోనూ సూద్ చేరుకున్నారు. వరదల సమయంలో ఆ మిరాకిల్ ఇల్లు ఎలా సజీవంగా నిలిచిందో చూడవచ్చు అని అయన అన్నారు. ఆ ఇంట్లో ఆరుగురు పైకప్పుపై నిలుచుని ప్రాణాలు కాపాడుకున్నారు. సుమారు 9 గంటలు శ్రమించిన తర్వాత తాము త్రిశూలీ ప్రాంతానికి చేరుకున్నట్లు సోనూ సూద్ చెప్పాడు. ఇక్కడ చాలా మంది ఇండ్లు , కుటుంబాలు కోల్పోయారని, వారిని చూస్తుంటే బాధేస్తుందన్నారు. చాలా కఠినమైన ప్రదేశాలకు చేరుకుని, వీలైనంత సహాయం చేయనున్నట్లు సోనూ సూద్ చెప్పాడు.

## రష్యాపై అతిపెద్ద డ్రోన్లదాడి చేసి తీరుతాం: జెలెన్‌స్కీ

**కీవ్, సెప్టెంబరు 2:** రష్యాఉక్రెయిన్ యుద్ధం మరోసారి అత్యంత ఉద్రిక్త రూపం దాల్చింది. రష్యాపై మునుపెన్నడూ లేని రీతిలో అతిపెద్ద డ్రోన్ దాడులు చేయడానికి సిద్ధమైనట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఏ క్షణంలోనైనా ఈ దాడులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున రష్యా గగనతలం పౌర విమానయానానికి ఎంతమాత్రం సురక్షితం కాదని, మాస్కోలోని విమానాశ్రయాలు కూడా తమ లక్ష్యాలలో భాగమేనని ఆయన స్పష్టం చేశారు. పౌర విమానాలు తమ టార్గెట్ కాదనే ఉద్దేశంతోనే ముందస్తుగా ఈ బహిరంగ హెచ్చరిక జారీ చేశామని, అంతర్జాతీయ విమానయాన సంస్థలు, విదేశీ ప్రభుత్వాలు ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించి ఆ ప్రాంతంలో ప్రయాణాలను తక్షణమే నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. రష్యా స్వయంగా ప్రారంభించిన యుద్ధం వల్లే నేడు ఆ దేశానికి ఈ దుస్థితి ఎదురైందని ఆయన వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ చేసిన ఈ బహిరంగ హెచ్చరికలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉక్రెయిన్ వైఖరి ఉగ్రవాదుల తీరును తలపిస్తోందని ఆరో పించారు. అంతర్జాతీయంగా తమపై ఎంత ఒత్తిడి వచ్చినా, ఉగ్రవాద తరహా చర్యలకు పాల్పడుతున్నవారితో ఎలాంటి చర్చలు జరిపే ప్రసక్తే లేదని పుతిన్ తెగేసి చెప్పారు. ఈ పరిణామాల మధ్యనే రష్యా జరిపిన విధ్వంసకర దాడుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు.


## భారత్ అభివృద్ధి ఇతర దేశాలకు పాఠం!

### ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్‌బంగా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** భారత్ అభివృద్ధి ప్రయాణం ఇప్పుడు మరో దేశానికి పాఠంగా మారే స్థాయికి చేరుకుందని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా అన్నారు. భారత్ సాధించిన అనుభవాలను ఇతర దేశాలతో పంచుకునే అవకాశాలు పెరిగాయని చెప్పారు. జీ20 ఆర్థిక మంత్రుల సమావేశం సందర్భంగా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ 2047 నాటికి వికసిత్ భారత్‌గా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ ప్రయాణంలో దేశ ఆర్థిక వృద్ధి మాత్రమే కాకుండా ప్రపంచ ఆర్థిక, రాజకీయ వ్యవహారాల్లో భారత్ పొందే స్థానం కూడా కీలకమని బంగా చెప్పారు. పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ప్రభావాన్ని పెంచుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ను బంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆధార్ నుంచి బ్యాంకు ఖాతాల వరకు ఏర్పడిన డిజిటల్ వ్యవస్థను ఇతర దేశాలు అధ్యయనం చేయవచ్చని చెప్పారు. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగం కూడా ప్రపంచానికి ఉపయోగపడే మరో నమూనా అని అన్నారు. తాను ఇటీవల ఉత్తరప్రదేశ్లో పర్యటించినప్పుడు చిన్న రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్పుట్స్ అందించేందుకు సహకార సంఘాలు, గూగుల్, ప్రపంచ బ్యాంకు కలిసి పనిచేస్తున్న విధానాన్ని చూశానని బంగా తెలిపారు. టెక్నాలజీ సాయంతో ఈ సేవలను పెద్ద సంఖ్యలో రైతులకు చేరువ చేయడం మంచి ప్రయత్నమని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డిజిటల్ వ్యవస్థలతో ప్రాంతీయ ఆసుపత్రులు, వైద్యులతో అనుసంధానించవచ్చని ఆయన వివరించారు. మౌలిక వసతులు, విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం, నియంత్రణ సంస్కరణలు, ప్రైవేటు పెట్టుబడుల సమీకరణ వంటి రంగాల్లో భారత్తో ప్రపంచ బ్యాంకు కలిసి పనిచేస్తోందన్నారు.

# పిఎఫ్ ట్రస్టులకు మరోసారి కార్మికశాఖ వెసులుబాటు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోని ప్రావిడెంట్ ఫండ్ ట్రస్టులకు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ భారీ ఊరట కల్పించింది. ఆదాయపు పన్ను చట్టం కింద గుర్తింపు పొంది, ఈపీఎఫ్ చట్టం ప్రకారం అధికారిక మినహాయింపు ఉత్తర్వులు లేని పీఎఫ్ ట్రస్టుల కోసం వన్ టైమ్ పరిష్కార పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద అర్హులైన ట్రస్టులు తమ మినహాయింపు హోదాను క్రమబద్ధీకరించుకునేందుకు డిసెంబర్ 28వ తేదీ వరకు గడువు విధించింది. ఈ మేరకు 2026 జూన్ 29న కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆదాయపు పన్ను చట్టం1961 కింద గుర్తింపు ఉండి, ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్స్ అండ్ మిసిలేనియస్ ప్రొవిజన్స్ (ఈపీఎఫ్ ఎంపీ) యాక్ట్ 1952లోని సెక్షన్ 17 లేదా కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ (సీఓఎస్ఎస్), 2020లోని సెక్షన్ 143 కింద అధికారిక మినహాయింపు లేని పీఎఫ్ ట్రస్టులకు ఈ అమ్నెస్టీ పథకం వర్తిస్తుంది. ఇది ఒక పరివర్తన చర్యగా, ఆరు నెలల పాటు అందుబాటులో ఉంటుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పథకం అమలుకు సంబంధించిన పూర్తి కార్యాచరణ మార్గదర్శకాలతో ఈపీఎఫ్ఓ 2026 జులై 11న ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఈ పథకం ద్వారా ట్రస్టులు తమ హోదాను గడిచిన కాలానికి కూడా వర్తించేలా క్రమబద్ధీకరించుకోవచ్చు. దీంతో పాటు కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ, 2020లో నిర్దేశించిన పలు నిబంధనల నుంచి కూడా మినహాయింపు లభిస్తుంది. ముఖ్యంగా కనీస ఉద్యోగుల సంఖ్య, కనీస కార్పస్ పరిమాణం, మూడేళ్ల పాటు నిబంధనలు పాటించాలనే షరతుల నుంచి ఉపశమనం కలుగుతుంది. క్రమబద్ధీకరణ తర్వాత సంబంధిత సంస్థలు మినహాయింపు పొందిన సంస్థగా లేదా మినహాయింపు లేని సంస్థగా కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. ఈ అమ్నెస్టీ పథకంపై అర్హులైన పీఎఫ్ ట్రస్టులకు అవగాహన కల్పించేందుకు ఈపీఎఫ్ఓ విస్తృత ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) వంటి వృత్తిపరమైన సంస్థల సహకారాన్ని తీసుకుంటోంది. సంస్థల చట్టబద్ధమైన, ఆదాయపు పన్ను ఆడిట్‌లు నిర్వహించే చార్టర్డ్ అకౌంటెంట్లు అర్హులైన ట్రస్టులను సులభంగా గుర్తించగలరని ఈపీఎఫ్ఓ భావిస్తోంది. పథకం వివరాలను తెలియజేసి, అర్హులైన ట్రస్టులు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు.



# మేధస్సుతోనే ఐదునిమిషాల్లో 120 దేశాల టైమ్ లెక్కింపు!

## ప్రపంచ రికార్డుసాధించిన అహ్మదాబాద్ యువకుడు

**అహ్మదాబాద్, సెప్టెంబరు 2:** నగరానికి చెందిన 21 ఏళ్ల విద్యార్థి యశ్ హేమంగ్ బక్షీ అసాధారణ మేధోసంపత్తితో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరం, చార్ట్ లేదా ఇతర సహాయం లేకుండా కేవలం తన మెదడుతోనే 120 దేశాల స్థానిక సమయాన్ని కేవలం 5 నిమిషాల 14 సెకన్లలో లెక్కించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అరగంట, 45 నిమిషాల తేడాలున్న సంక్లిష్టమైన టైమ్ జోన్‌లను సైతం పరిగణనలోకి తీసుకుని ఈ ఘనత సాధించడం విశేషం. ఆహ్వానితులు, రికార్డు అధికారుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వరల్డ్ రికార్డ్ యూనియన్ ప్రతినిధి షరీఫా హనీఫా ఈ రికార్డును అధికారికంగా ప్రకటించారు. ఇంతకుముందు కూడా యశ్ తన పేరు మీద రికార్డులు నెలకొల్పాడు. భారత కాలమానం ఆధారంగా 101 దేశాల స్థానిక సమయాన్ని 14 నిమిషాల 42 సెకన్లలో లెక్కించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. ఇప్పుడు ఆ రికార్డును తానే అధిగమించి 120 దేశాల సమయాన్ని కేవలం 5.14 నిమిషాల్లో లెక్కించి సరికొత్త బెంచ్‌మార్క్‌ను సృష్టించాడు. యశ్ ఈ ఘనత సాధించడం వెనుక అతని గురువు కమలేష్ సుర్తి మార్గదర్శకత్వం ఎంతగానో ఉంది. విద్యార్థులలోని సహజ ప్రతిభను గుర్తించి, బట్టీ పద్ధతులపై కాకుండా దానికే పదునుపెట్టడంపై ఆయన దృష్టి సారిస్తారు. ఆయన శిక్షణలో ఎందరో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఈ సామర్థ్యాన్ని ప్రసాదించిన భగవంతునికి కృతజ్ఞతలు.

# సంక్షిప్త వార్తలు

## సిక్కింలో 40 ప్రమాదకర సరస్సులు గుర్తించిన సర్కారు



**లేహ్, సెప్టెంబరు 2:** పొరుగు దేశం నేపాల్‌లో హిమ సరస్సుల ఆకస్మిక ఉప్పెన సృష్టించిన పెను విషాదం నేపథ్యంలో సిక్కిం రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్న 40 హిమ సరస్సులను జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం గుర్తించింది. వీటిలో ఏడు సరస్సులను అత్యంత ప్రమాదకర జాబితాలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించి, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించింది. ఈ ప్రమాదకర సరస్సులలో కొన్ని సముద్ర మట్టానికి సుమారు 17వేల అడుగుల ఎత్తులో ఉన్నాయి.

## రైతులపై కేసులన్నీ ఎత్తివేసిన విజయ్ ప్రభుత్వం

**చెన్నై, సెప్టెంబరు 2:** తమిళనాడులో అధికారంలోకి వచ్చిన టీవీకే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసులను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా నిరసనకారులకు భారీ ఊరట లభించినట్లయింది. 2021 మే నుంచి 2026 మధ్య కాలంలో అప్పటి ఎం.కె. స్టాలిన్ ప్రభుత్వం సిప్‌కాట్ పారిశ్రామిక వాడ, పరందూర్ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసనలు తెలిపిన వారిపై అమానుషంగా వ్యవహరించిందని విజయ్ విమర్శించారు.

## పరస్పరం ఢీకొన్న వాణిజ్యనౌకలు



**ఇస్తాంబుల్, సెప్టెంబరు 2:** టర్కీలోని ఇస్తాంబుల్ తీరం మార్మరా సముద్రంలో ఘోర నౌకా ప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో టర్కీ పతాకంతో ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక నౌకకు చెందిన 10 మంది సిబ్బందితో సంబంధాలు తెగిపోవడంతో వారి ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్ బలగాలు విస్తృతంగా గాలిస్తున్నాయి.

## థాయ్‌లాండ్ వీసా నిబంధనల్లో మార్పులు

**బ్యాంకాక్, సెప్టెంబరు 2:** థాయ్‌లాండ్ వీసా రహిత ప్రవేశ నిబంధనలను సవరించింది. 2026 సెప్టెంబర్ 15 నుంచి భారతీయ పర్యాటకులకు వీసా లేకుండా థాయ్‌లాండ్‌లో ఉండే గరిష్ఠ వ్యవధిని 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గిస్తోంది. కానీ భారత పాస్‌పోర్ట్‌దారులకు వీసా రహిత ప్రవేశ సౌకర్యాన్ని పూర్తిగా రద్దు చేయలేదు. గతంలో ప్రతిపాదించినట్లుగా భారత్‌ను చెల్లింపు వీసా ఆన్ అరైవల్ విధానంలోకి మార్చకుండా, 30 రోజుల వీసా మినహాయింపును కొనసాగించింది. ఈ సవరించిన నిబంధనలను థాయ్‌లాండ్ రాయల్ గెజిట్ గతనెల 31న ప్రచురించింది. 15 రోజుల తర్వాత, అంటే ఈనెల 15 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి.

## సుశాంత్‌సింగ్ మేనేజర్ మృతిపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశం



**ముంబయి, సెప్టెంబరు 2:** అనుమానాస్పద రీతిలో మృతిచెందిన బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌కు సెలబ్రిటీ మేనేజర్‌గా పని చేసిన దిశా సాలియన్ మృతి కేసులో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ఇవాళ బాంబే హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2020లో ఆమె ప్రాణాలు కోల్పోయారు. అయితే దిశా మృతి పట్ల ఆమె తండ్రి అనుమానాలు వ్యక్తం చేశారు. సారంగ్ కోత్వాల్, రంజిత్‌సిన్హా రాజా భోంస్లేతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ ఆ కేసులో ఎఫ్ఐఆర్‌ను సీబీఐ నమోదు చేస్తుందని, దిశా తండ్రి సతీశ్ సాలియన్ వాంగ్మూలం కూడా తీసుకుంటారని పేర్కొన్నది.



బుధవారం న్యూఢిల్లీలో మాజీ సిఎం రాజశేఖర్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్, ఎంపీలు తదితరులు

# ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి

### ఢిల్లీలో వైఎస్ చిత్రపటానికి సిఎం రేవంత్ రెడ్డి, వివేక్,హర్కర, ఎంపిల నివాళి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబరు2:** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులు, ఔటర్ రింగు రోడ్డు వంటి అభివృద్ధి పనులు, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలతో పాలనపై చెరగని ముద్ర వేసిన నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (ప్రోటోకాల్) హర్కర వేణుగోపాల్ రావు ఎంపీలు డాక్టర్ మల్లురవి, సురేశ్ షెట్కార్, పోరిక బల రాం నాయక్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సం క్షేమం కోసం వైఎస్సార్ గారు చేసిన సేవలు, ఆ యన ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధి దృక్పథం ఎప్పటికీ చిరస్మరణీయం.మహానేత వైఎస్సార్ ఆశయాలు, ప్రజా సేవా స్ఫూర్తి మనందరికీ ఎల్ల ప్పుడూ మార్గదర్శకం అని హర్కర వేణుగోపాల్ పేర్కొన్నారు.

# కెపిహెచ్‌బిలో గజం భూమి రూ.2.70లక్షలు

### మరోసారి రికార్డు ధరలకు అమ్ముడుపోయిన హౌసింగ్ బోర్డు భూములు

### రూ.47.14 కోట్ల మేర ఆదాయం: హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి గౌతం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబరు2:** కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓపెన్ ఫ్లాట్లకు మరోసారి భారీ ధర పలికింది. ఎటువంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెంది మంచి డిమాండ్ ఉన్న కెపిహెచ్‌బిప్రాంతంలోని ప్లాట్లు (ఓపెన్ ప్లాట్స్) బహిరంగ వేలంలో రికార్డు ధరలకు అమ్ముడు పోయాయి. కెపిహెచ్‌బి 7 ఫేజ్‌లోని 16 ఎంఐజి ప్లాట్లకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించగా, ఒకచదరపు గజం భూమిని 2.70 లక్షలకు (రెండు లక్షల డెబ్బై వేలకు) కొనుగోలు చేశారు. ఈ ప్లాట్ల బహిరంగ వేలం కోసం ఆగస్టు 10 వ తేదీన హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర రూ.1.60 లక్షలుగా నిర్ధారించగా, చదరపు గజం రూ.2.70 లక్షలకు అమ్ముడు పోయిందని, మరో ప్లాట్‌ను చదరపు గజం రూ.2.36 లక్షలకు కొనుగోలు చేశారని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతం తెలిపారు. ఇంకో రెండు ప్లాట్లను 2.06 లక్షలకు వేలం పాటలో కొనుగోలు చేసారని తెలిపారు. పూర్తి పారదర్శకంగా నిర్వహించిన ఈ వేలం పాటలో తమకు నచ్చిన ప్లాట్లను దక్కించుకోడానికి మొత్తం 19మంది బిడ్డర్లు (కొనుగోలు దారులు) పోటీ పడ్డారు. బుధవారం బహిరంగ వేలంలో చదరపు గజం సగటు ధర సుమారు రూ.1.79 లక్షలు పలికిందని వివరించారు. ఈ విధంగా నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డ్‌కు సుమారు రూ. 47.14 మేర ఆదాయం వచ్చిందని వైస్ ఛైర్మన్ విపి గౌతం వివరించారు.

# హత్యాచార ఘటనపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం

### వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని డిజిపికి ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** నగర శివార్లలోని పహాడిషరీఫ్ పరిధిలో ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న 22 ఏళ్ల యువతిపై జరిగిన లైంగిక దాడి, హత్యపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటన దారుణమని వ్యాఖ్యానించిన మహిళా కమిషన్ ఛైర్మన్ విజయ రహత్కర్ దీనిపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని డిజిపి ఆనంద్‌కు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో విచారణ వేగంగా సాగాలని, సాక్ష్యాలను భద్రపరచాలని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేడాలని మహిళా కమిషన్ ఆదేశించింది. ఈ కేసులో బాధితురాలి కుటుంబానికి అందాల్సిన నష్ట పరిహారం వెంటనే అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజయ రహత్కర్ ఆదేశించారు. ఈ కేసు విచారణను తాము నిరంతరం పరిశీలిస్తుంటామని ఆమె పేర్కొన్నారు. కాగా నర్సు హత్యాచార ఘటన రాష్ట్రంలో సంచలనం రేపగా పోలీసులు వెంటనే స్పందించి 30 గంటల వ్యవధిలోనే బైక్ మెకానిక్‌గా వున్న నిందితుడు సనావుల్లా (34)ను అరెస్టు చేసి రిమాండుకు తరలించడం విదితమే. ఈ ఘటనపై మహిళా కమిషన్ ఆదేశాల మేరకు డిజిపి కార్యాలయం స్థానిక పోలీసుల నుంచి పూర్తి వివరాలను తెప్పించుకుంది.

# కామారెడ్డిలో 310 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** తెలంగాణలో రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయాల్సిన బియ్యం పొరుగు రాష్ట్రాలకు తరలిపోవడం ఆగడం లేదు. ఇప్పటికే పోలీసులతో పాటు విజిలెన్స్, పౌర సరఫరాల విభాగం వరుస దాడులు చేస్తూ భారీగా రేషన్ బియ్యాన్ని జప్తు చేస్తున్నా గోల్‌మాల్ వ్యవహారాలు కొనసాగుతూనే వున్నాయి. తాజాగా కామారెడ్డి జిల్లా బిక్కనూరు గ్రామంలో ఒకచోట దాచివుంచిన 310 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల విభాగం అధికారులు మంగళవారం రాత్రి దాడిచేసి పట్టుకున్నారు.

హైదరాబాద్ నుంచి ఈ బియ్యం బస్తాలను కామారెడ్డి మీదుగా గుజరాత్‌కు తరలి స్తుండగా పట్టుబడింది. దీని విలువ తొమ్మిది లక్షల రూపాయలుగా తేల్చారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# వ్యవసాయ అధికారి సస్పెన్షన్

### వేరుశనగ విత్తనాల్లో అక్రమాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** వేరుశనగ విత్తనాల అక్రమాల వ్యవహారంలో మండల అధికారిని సస్పెండ్ చేస్తూ వ్యవసాయ శాఖ రాష్ట్ర అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపీ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖలో వేరుశనగ విత్తనాల వ్యవహారం ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యవహారంపై వికారాబాద్ కలెక్టర్ నివేదికతో పాటు, అదనపు కలెక్టర్ నిర్వహించిన విచారణ నివేది వ్యవసాయ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి చేరింది. ఈ నివేదికను ఆధారంగా చేసుకుని మండల వ్యవసాయ అధికారిని సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ నిర్ణయించారు. 2025-26 యాసంగి సీజను లో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ సీడ్స్ (ఎన్ఎంఈఓ-ఓఎస్) పథకం కింద పంపిణీ చేసిన వేరుశనగ విత్తనాలకు సంబంధించిన సబ్సిడీయేతర మొత్తాన్ని జమ చేసే ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు పేర్కొన్నారు. అధికారిక విధుల్లో నిరక్ష్యం, నగదు జమలో అక్రమాలకు సంబంధించి మండల వ్యవసాయ అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే పరిస్థితి ఏర్పడిందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే టీజీఎస్సీసీఏ నిబంధనల ప్రకారం విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్‌లో ఉంచారు. సస్పెన్షన్ కాలంలో ప్రధాన కార్యాలయంగా వికారాబాద్‌లో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయం విడిచి వెళ్లరాదని ఆదేశించారు. కాగా ఈ వేరుశనగ విత్తనాల నగదు జమ వ్యవహారంలో ఇటీవలే మరో ఇద్దరిపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో మరో ఏడీఏ, ఎంఏఓ స్థాయి అధికారులపై చర్యలు తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# 42 శాతం బిసి రిజర్వేషన్లతోనే

### జెడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించాలి: ఆర్.కృష్ణయ్య

**మోమిన్‌పేట్, సెప్టెంబరు 2. ప్రభాతవార్త:** రాష్ట్రంలో 42, శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు పార్లమెంటు సభ్యులు ర్యాగ కృష్ణయ్య, జాతీయ బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్, అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మోమిన్‌పేట మండల పరిధిలోని తమ స్వగ్రామం రాళ్లగుడిపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు గతంలో ఉన్న రిజర్వేషన్లను తగ్గించి, మున్సిపల్ ఎన్నికల్లోనూ బీసీలకు అన్యాయం చేశారని ఆయన విమర్శించారు. మంత్రివర్గంలో 9 బీసీలకు ఇవ్వకుండా తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉండగా, కేవలం 3 కే అవకాశం కల్పించి, ప్రాధాన్యత లేని శాఖలు కేటాయించడం ద్వారా బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని అన్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవులు, సమాచార శాఖ కమిషనర్లు, కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ తదితర కీలక పోస్టుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించడం లేదని ఆరోపించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని కోరారు.

# కుట్టు మిషన్ల పథకం ప్రొక్యూర్‌మెంట్ 7లోగా పూర్తి

### కుట్టు మిషన్ల కోసం ఇప్పటి వరకు 1,80,170 దరఖాస్తులు

### కళ్యాణ లక్ష్మి పథకం పై పెండింగ్ లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలి

### బిసి సంక్షేమ శాఖ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు



బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబరు2:** మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న కుట్టు మిషన్ల పథకం దరఖాస్తులు, ప్రొక్యూర్‌మెంట్, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మినిస్టర్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. కుట్టు మిషన్ల కోసం ఇప్పటివరకు వివిధ జిల్లాల నుంచి 1,80,170 దరఖాస్తులు అందినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కుట్టు మిషన్ల ప్రొక్యూర్‌మెంట్‌కు సంబంధించిన షెడ్యూల్, టెండర్ల తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. సెప్టెంబర్ 7వ తేదీలోపు ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 15 తర్వాత ప్రీబిడ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెయ్యి కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన నియోజకవర్గాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, మహిళా సంఘాలు, గ్రామపంచాయతీల సహకారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యేలోపు అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కుట్టు మిషన్ల పథకం అమలుపై సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల వివిధ బీసీ కుల సంఘాల కార్పొరేషన్లకు ఎన్నికైన చైర్మన్లకు కార్యాలయాలు, మౌలిక సదుపాయాలు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని మంత్రి ఆదేశించారు.బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణం, వాటి పురోగతి తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు.

రాష్ట్రంలోని 327 మహాత్మ జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాలల పనితీరు, మౌలిక సదుపాయాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలు, విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలపై మంత్రి సమీక్షించారు.కొన్ని ప్రాంతాల్లో బీసీ గురుకులాలకు స్థలాలు అందుబాటులో ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో స్థలాలు లేని పరిస్థితిపై నియోజకవర్గాల వారీగా నివేదిక రూపొందించాలని సూచించారు. అవసరమైన చోట్ల జిల్లా కలెక్టర్ ద్వారా స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందుకోసం బీసీ సంక్షేమ శాఖకు చెందిన నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక నియోజకవర్గంలో మంజూరైన మహాత్మ జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాలలు ఇతర నియోజకవర్గాల్లో కొనసాగుతున్న వాటిని గుర్తించి, మంజూరైన నియోజకవర్గంలోనే పాఠశాల నిర్వహణకు అనువైన భవనాలను గుర్తించి షిఫ్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గురుకుల పాఠశాలలు, బీసీ సంక్షేమ హాస్టళ్లలో భవనాల అద్దెలు, ఇతర పెండింగ్ బిల్లుల సమస్యలను పరిష్కరించేందుకు బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ, ఎంజేపీ సెక్రెటరీ, ఫైనాన్స్ సెక్రెట రీలతో సమావేశమై సమస్యలను క్లియర్ చేసుకో వాలని సూచించారు.గురుకుల పాఠశాలలు, బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు యూనిఫాంలు, షూస్, ఇతర మౌలిక సదుపాయాలు ఎంతవరకు పూర్తయ్యాయో, తక్కువ శాతం మాత్రమే పూర్తయిన పాఠశాలలు ఏవో గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించి హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో 2023-26 మధ్య వచ్చిన దరఖాస్తులు, క్లియర్ చేసిన చెక్కులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు,పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి దరఖాస్తులను వేగంగా పరిష్కరించి అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బాలమాయాదేవి, ఎం జేపీ సెక్రెటరీ సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధి కారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల ప్రభావంతో సింగరేణిలో తగ్గిన బొగ్గు ఉత్పత్తి

### 50 వసంతాలు పూర్తి చేసిన ఎస్ఆర్‌పి1 గని

### సింగరేణి చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**గత నెలలో కురిసిన వర్షాలతో సింగరేణి కాలరీస్‌కు చెందిన వివిధ ప్రాంతాల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడి ఉత్పత్తిలో తగ్గుదల చోటు చేసుకుంది. జనవరి 1 నుండి ఆగస్టు 31 వరకు, వార్షిక లక్ష్యం 23.21 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ఈ ప్రాంతంలో ఇప్పటివరకు 15.44 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును తవ్వినట్లు, ఇది 67 శాతంగా ఉంది. శ్రీరాంపూర్ ఏరియా చీఫ్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ యూనిట్ నెలవారీ పనితీరుపై మీడియాకు వివరించారు. ఎస్ఆర్‌పి 1 భూగర్భ గని 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం స్వర్ణోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ మైలురాయికి బొగ్గు గని కార్మికులు, అధికారుల పాత్రే కారణమని పేర్కొన్నారు. ఈ మైలురాయిని చేరుకున్నందుకు ఆయన కార్మికులకు, అధికారులకు అభినందనలు తెలిపారు. కాగా ఆగస్టులో సింగరేణి శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని చెప్పారు. శ్రీరాంపూర్ ప్రాంతం తన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 81 శాతాన్ని నమోదు చేయగా, బెల్లంపల్లి, మందమర్రి వరుసగా 85, 86 శాతాన్ని సాధించాయి. శ్రీరాంపూర్ ఏరియాలో 4.09 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గాను 3.3 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును మాత్రమే తవ్వారు. ఆర్‌కేఎన్‌టి, ఎస్ఆర్‌పి1 గనులు వరుసగా లక్ష్యంలో 102, 112 శాతం నమోదు చేయగా, ఆర్‌కే 7, ఎస్ఆర్‌పి 3, 3ఏ భూగర్భ గనులు ప్రతి నెలా 100శాతం లక్ష్యాన్ని సాధించాయని వివరించారు. ఎస్ఆర్‌పి ఓసిఐఐ, ఐకే ఓసిపి వంటి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు లక్ష్యంలో 100 శాతం కంటే తక్కువ ఉత్పత్తిని నమోదు చేశాయన్నారు. అలాగే బెల్లంపల్లి ఏరియాలో 2 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గాను 1.69 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, 85 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు నమోదైంది. అదేవిధంగా, మందమర్రి ఏరియాలో 1.74 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు లక్ష్యానికి గాను 1.50 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, 86 శాతం లక్ష్యాన్ని సాధించిందని పేర్కొన్నారు.

# సింగరేణి గనుల ప్రైవేటీకరణ అవాస్తవం

### అటువంటి ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదు

### సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. సింగరేణి భూగర్భ బొగ్గు గనులను ప్రైవేటుపరం చేస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన ప్రభుత్వ సంస్థ సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ గనులు, 17 ఓపెన్‌కాస్ట్ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తోందని తెలిపారు. తెలంగాణతో పాటు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బొగ్గును సరఫరా చేస్తూ దేశ ఇంధన భద్రతకు, పారిశ్రామిక అభివృద్ధికి నిరంతరం తోడ్పడుతున్నట్లు వెల్లడించింది. భూగర్భ గనులు ఆర్థికంగా నష్టాల్లో ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రాంతంలో ఉపాధి కల్పన, ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకుని నష్టాలను సాధ్యమైనంత మేర తగ్గిస్తూ వాటిని కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. భూగర్భ గనులను మూసివేయడం లేదా ప్రైవేటుపరం చేయడం కాకుండా వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, నిర్వహణ వ్యయాలను తగ్గించడం ద్వారా సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అలాగే భారీ నష్టాల్లో ఉన్న శాంతిఖని గనిలో ఉత్పత్తి కార్యకలాపాలను ఎండీఓ (మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్) విధానంలో నిర్వహించడం ద్వారా ఉత్పత్తి వ్యయాలను తగ్గించగలమా, నష్టాలను నివారించగలమా అనే అంశాన్ని అధ్యయనం చేసేందుకు మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా ఒక ప్రతిపాదనను రూపొందించినట్లు యాజమాన్యం పేర్కొంది. ఇందులో భాగంగా ఆసక్తిగల సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించగా దీనిపై తగిన స్పందన లభించకపోవడంతో ఆ నిర్ణయాన్ని విరమించుకున్నట్లు స్పష్టం చేశారు.

# సాధారణ గృహిణికి రూ.1.43 లక్షల బిల్లు

### విద్యుత్ శాఖలో ఎఐ అధునాత సాంకేతికత ఉన్నా తప్పులు కంటిన్యూ

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖలో అమలు చేస్తున్నట్లు చెబుతున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వాటిల్లో జరుగుతున్న లోపాలు, తప్పుడు బిల్లులు, అక్రమ వ్యవహారాల విషయాల్లో మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నాయి. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా బస్తీ బాట, వినియోగదారుల వద్దకు అధికారులు వంటి కార్యక్రమాలు చేస్తూ సేవలు అందిస్తున్నట్లు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటుండగా, మరోపక్క తప్పుడు విద్యుత్ బిల్లులతో సర్వీస్‌దార్లను ఠారెత్తించి పరుగులు పెట్టిస్తూ అధికారుల చూట్టూ తిప్పుకుంటున్నారు. రాష్ట్రంలో తరచూ లక్షల్లో వస్తున్న బిల్లులు చూసి కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. ములుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో పూరి గుడిసెలో నివసిస్తున్న ఒక సాధారణ గృహిణికి లక్షల్లో కరెంటు బిల్లు రావడం ఠారెత్తిస్తోంది. కేవలం ప్రాథమిక గృహోపకరణాలను మాత్రమే ఉపయోగించినా, ఎలాంటి బకాయిలు లేకపోయినా, ఆగస్టు నెలకు రూ.1,43,136 విద్యుత్ బిల్లు రావడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రేమ్‌నగర్‌లో ఎనిమిది నెలలుగా అద్దె ఇంట్లో నివసిస్తున్న కొమ్మినేని ప్రమీల, తమ కుటుంబానికి విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌పై ఎలాంటి బకాయిలు లేవని చెప్పారు. వారు కేవలం ఒక టెలివిజన్, రెండు సీలింగ్ ఫ్యాన్లు, రెండు ఎల్ఈడీ బల్బులను మాత్రమే ఉపయోగిస్తారని ఆమె తెలిపారు. తమ కుటుంబం గత ఎనిమిది నెలలుగా ఆ ఇంట్లో నివసిస్తున్నప్పటికీ, ఇలా తమకు ఎలాంటి విద్యుత్ బిల్లులు అందలేదని చెప్పారు. రూ.1,43,136 మొత్తంతో వచ్చిన తాజా బిల్లు చూసి తాము దిగ్భ్రాంతికి గురయ్యామని పేర్కొన్నారు. దాన్ని సరిదిద్దమని తాము అభ్యర్థించినప్పటికీ, విద్యుత్ అధికారులు పూర్తి మొత్తాన్ని చెల్లించాలని పట్టుబడుతున్నారని ఆ కుటుంబం ఆరోపించింది. మీటర్ రీడింగ్, గత వినియోగ రికార్డులను సరిచూసి, సరిదిద్దిన బిల్లును జారీ చేయాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. అసాధారణంగా అధికంగా ఉన్న బిల్లుపై అధికారులు విచారణ జరిపి, ఈ వ్యత్యాసానికి గల కారణాన్ని స్పష్టం చేయాలని స్థానిక నివాసితులు కూడా డిమాండ్ చేశారు.

### రేవంత్ పాలనకు 1000 రోజులు...

# గాంధీభవన్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

### కెసిఆర్ అసెంబ్లీకి రాకపోయినా నష్టమేం లేదు: జగ్గారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబరు2:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తైన సందర్భంగా గాంధీభవన్‌లో పార్టీ నేతలు విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు నిర్బంధ వాతావరణంలో గడిపారని జగ్గారెడ్డి విమర్శించారు. స్వేచ్ఛ కావాలనే ఆకాంక్షతోనే ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో పోలీసుల నిర్బంధాలు లేవని, మీడియాపై ఆంక్షలు విధించలేదని జగ్గారెడ్డి అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సచివాలయానికి స్వేచ్ఛగా వెళ్లే అవకాశాన్ని రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. అన్ని రంగాల్లో నియంతృత్వ ధోరణికి ముగింపు పలికి స్వేచ్ఛా యుత వాతావరణాన్ని తీసుకొచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగుల కు ఉద్యోగాలు కల్పించలేకపోయిందని జగ్గారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ 1,000 రోజుల పాలనలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, రేషన్ కార్డులు పంపిణీ చేసి, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచామని తెలిపారు. తెలంగాణ కోసం వందలాది మంది విద్యార్థులు ప్రాణత్యాగాలు చేశారని జగ్గారెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని తామే సాధించామని చెప్పుకునే కేసీఆర్ కుటుంబంలో తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసిన ఒక్కరినైనా చూపించాలని ప్రశ్నించారు. కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నిస్తే కేటీఆర్ చెప్పే సమాధానం హాస్యాస్పదంగా ఉందని జగ్గారెడ్డి అన్నారు. కేసీఆర్ రాజీనామా చేసినా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. కేసీఆర్, ఆయన కుటుంబంలోని ముగ్గురు అసెంబ్లీకి రాకపోయినా ప్రభుత్వానికి ఎలాంటి సమస్య లేదని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అండ్ ఫ్యామిలీని కాంగ్రెస్ ఎప్పుడో లైట్ తీసుకుంది అని జగ్గారెడ్డి అన్నారు. రాహుల్ గాంధీని విమర్శించే నైతిక హక్కుకేసీఆర్‌కు ఎక్కడిదని జగ్గారెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. విద్యార్థుల త్యాగా లను తన ఖాతాలో వేసుకున్న కేసీఆర్ తెలం గాణ కోసం కృషి చేసిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను విమర్శించకూడదని జగ్గారెడ్డి హితవు పలికారు.



బుధవారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

# మరిన్ని జిల్లాలకు అంగన్వాడీ బ్రేక్‌ఫాస్ట్

### 35,781 కేంద్రాల్లో తొలి ముద్ద విస్తరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్వాడీ సెంటర్లలో చిన్నారుల హాజరును పెంచటం కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా అంగన్వాడీ సెంటర్లలో బాలలకు పౌష్టికాహారం అందించే తొలి ముద్ద బ్రేక్‌ఫాస్ట్ పథకం విస్తరణ దిశగా రాష్ట్ర సర్కార్ చర్యలు చేపట్టింది. పైలెట్ ప్రాజెక్ట్ గత కొన్ని రోజులుగాగా అందిస్తున్న ప్రభుత్వం మరికొన్ని జిల్లాలకు ఈ బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ను విస్తరించటానికి రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని మహబూబాబాద్, వికారాబాద్, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, ములుగు జిల్లాల్లో ఈ పథకాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్, కొత్తగూడెం జిల్లాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తుండగా, దీని వల్ల పిల్లల హాజరు గణనీయంగా పెరిగింది. పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన జిల్లాలలో సత్‌ఫలితాలు రావటంతో మరికొన్ని జిల్లాలలో ఈ పథకం అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. తొలిముద్ద బ్రేక్ ఫాస్ట్ స్కీం ద్వారా చిన్నారులకు ఉదయం పూటనే పౌష్టికమైన ఆహారం అందించి పోషకాహార లోపాన్ని నివారించడం, అంగన్వాడీల హాజరు పెంచడం, వారి ఆరోగ్యం, అభివృద్ధిని మెరుగుపరచడం ఈ పథకం ముఖ్య లక్ష్యం. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 35,781 అంగన్వాడీ కేంద్రాలకు విస్తరించే ఆలోచన చేస్తోంది. సాధారణంగా పాలు, అన్నం, పప్పు, కూరగాయలు, గుడ్డు లేదా ఇతర పౌష్టిక వస్తువులతో కూడిన సాధారణ, పోషకమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ప్రతి జిల్లా అవసరాలకు అనుగుణంగా మెనూ మారుతుంది. రెండో విడత అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 35,781 అంగన్వాడీ కేంద్రాలకు ఈ తొలిముద్ద పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అధికారవర్గాలు వెల్లడించాయి.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా

### దక్షిణ తెలంగాణ పంపిణీ సంస్థ సిఎండి జితేష్


**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ పాటిల్ సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బుధవారం టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించే విధానాన్ని అవలంబించాలన్నారు. ఆర్‌పీడీసీఎల్‌కు బదిలీ చేయాల్సిన నెట్‌వర్క్ అసిస్టెంట్ డేటాను ఈ నెల 5వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని చెప్పారు. రాబోయే శ్రీకృష్ణాష్టమి, వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా విద్యుత్ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే తొలగించడం, వంగిపోయిన, తుప్పుపట్టిన స్తంభాలను మార్చడం, అవసరమైన ప్రాంతాల్లో ఏబీ కేబుళ్లను ఏర్పాటు చేయడం వంటి చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుదలకు సంబంధించి, ఆగస్టు నెలలో అత్యధిక అంతరాయాలు నమోదైన ఒక ఫీడర్‌ను ప్రతి డివిజన్ గుర్తించి, సమస్యల మూల కారణాలను విశ్లేషించి వాటిని పరిష్కరించాలన్నారు. అలాగే, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించిన ఉత్తమ ఫీడర్లను గుర్తించి, ఆయా ప్రాంతాల వినియోగదారులకు నిర్వహణ పద్ధతులు, విద్యుత్ శాఖ చేపట్టిన మరమ్మత్తు, అభివృద్ధి పనుల గురించి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

# హెలి టూరిజం పెంచండి

### ఆదిలాబాద్, మామునూరు ఎయిర్‌పోర్టుల పనులు వేగంగా చేయండి

### హుస్సేన్ సాగర్‌లో సీప్లేన్ ల్యాండింగ్‌పై 2 వారాల్లో నివేదిక

### కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ



బుధవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుని కలిసిన సిఎం రేవంత్ రెడ్డి, తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబరు2:** తెలంగాణలో ఆదిలాబాద్, మామూనూరు (వరంగల్) విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుకు విజ్ఞప్తి చేశారు. మామూనూరు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో రన్‌వే ఫైనలైజ్ చేయడానికి సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. మామునూరు (వరంగల్) విమానాశ్రయం టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకు స్థాపన చేస్తామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తెలిపారు.
తెలంగాణలో చాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని రామ్మోహన్ నాయుడుకి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెప్పారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, సురేశ్ షెట్కార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

### దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థలో

## 53 మంది ఇంజనీర్ల బదలీ

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** పునర్వ్యవస్థీకరణలో భాగంగా, పరిపాలనా కారణాల దృష్ట్యా ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని 53 మంది అసిస్టెంట్ ఇంజనీర్లను (ఏఈలను) వివిధ ప్రదేశాలకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. తొలిసారిగా, విద్యుత్ పంపిణీ సంస్థలోని అసిస్టెంట్ ఇంజనీర్లను వివిధ ప్రదేశాలకు బదిలీ చేస్తూ పూర్తిస్థాయి పునర్వ్యవస్థీకరణను చేపట్టింది. ఈ మేరకు వీటికి సంబంధించి ఆ సంస్థ సిఎండి జితేష్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. తమ సంస్థల్లో పరిపాలనా నిర్వహణలో భాగంగా ఈ బదిలీలు జరిగినట్లు చెప్పారు. ఈ ఉత్తర్వులో పేర్కొన్న ప్రకారం, ఇన్‌చార్జ్ ఏర్పాట్లు పూర్తిగా తాత్కాలికమైనవని, బాధ్యతలు స్వీకరించిన తేదీ నుండి అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు.
పదోన్నతి, క్రమబద్ధీకరణ, ద్రవ్య ప్రయోజనాలకు ఎటువంటి హక్కును కల్పించవని తెలిపారు. సంబంధిత ఉత్తర్వుల ప్రకారం సమీక్షకు లోబడి ఉంటాయన్నారు. తమ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే ఈ చర్య యొక్క లక్ష్యమని పేర్కొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ జాగరూకత దివస్ నిర్వహించిన టిజిసిఎస్‌బి

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** సైబర్ నేరాలను నివారించేందుకు అందరు స్వీయ రక్షణ చర్యలు తీసుకునేందుకు ఉద్దేశించిన సైబర్ జాగరూకత దివస్‌ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ( టిజిసిఎస్‌బి) బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించింది. దేశ వ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమం టిజిసిఎస్‌బి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధుల్లో జరిగింది. ఈ సందర్భంగా సైబర్ నేరాలను ఎలా ఎదుర్కోవాలనే దానిపై ఆయా ప్రాంతాల పోలీసులు ప్రజలకు వివరించారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి? ఎక్కడ జరుగుతాయి ? ఎక్కడ జరిగేందుకు ఆస్కాకం వుంది? ఈ సందర్భంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే దానిపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారినపడితే వెంటనే 1930 లేదా సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు రండి



### రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఆహ్వానించిన సిఎం రేవంత్ రెడ్డి

### ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబరు2:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో-2026ను ప్రారంభించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. రక్షణ ఎక్స్‌పో లో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రి హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు రక్షణ శాఖ సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూ సేకరణ చేపట్టిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలియజేశారు. రక్షణ శాఖ కోరినట్లు మొత్తం 1500 ఎకరాలు కోరినందున, మరో 750 ఎకరాలు సేకరించే ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు.
మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్) ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

## జిఎస్‌ఎల్‌విఎఫ్-17 రేపే ప్రయోగం

**సూళ్లూరుపేట, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుంచి శుక్రవారం వేకువ జామున 2 గంటల 55 నిమిషాలకు జిఎస్‌ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ప్రయోగం జరుగునున్నది. ఇందుకు సంబంధించి కౌంట్ డౌన్ బుధవారం రాత్రి 11 గంటల 25 నిమిషాలకు ప్రారంభమైంది. ఈ ప్రయోగం ద్వారా అత్యంత ఆధునిక నితతయారైన భారతదేశ ప్రప్రథమభూ పరిశీలన ఈవోఎస్05 ఉపగ్రహాన్ని కక్షలోకి ప్రవేశపెట్టనున్నారు. శ్రీహరికోటలోని రెండవ లాంచ్ పాడ్ నుంచి ఈ ప్రయోగం జరగనున్నది. మూడు దశల్లో ఈ ప్రయోగం ఉంటుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత జిఎస్ఎల్వి ప్రయోగాల్లో ఎదురైన సాంకేతిక లోపాలను అధిగమించి ప్రస్తుత ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు ఇస్రోశాస్త్రవేత్తలు శ్రమిస్తున్నారు. ఈఓఎస్ 5 ఉపగ్రహం సబ్ జిఒ సింక్రోనోస్ ట్రాన్స్ఫర్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టిన అనంతరం అక్కడి నుంచి భూస్థిర కక్షలోకి చేరుకుంటుంది. అత్యంత కీలకమైన ఈ ఉపగ్రహం 2367 బరువు కలిగి రోదసిలో 36 వేల కిలోమీటర్ల ఎత్తు నుంచి తన సేవలను అందిస్తుంది. రోదసిలో 7 నుండి 10 సంవత్సరాల కాలం ఉండి సేవలందించే విధంగా ఈ ఉపగ్రహానికి శాస్త్రవేత్తలు రూపకల్పన చేశారు. భారతదేశ రక్షణ రంగానికి కవచముల పని చేయనున్నది. అలాగే ప్రకృతి వైపరీత్యాలు, వ్యవసాయం, వాతావరణ మార్పులు అనే అంశాలపై ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించిచేరవేస్తుంది. గతంలో విఫలమైన జిసాట్ 1మిషన్‌కు ప్రత్యామ్నాయంగా ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు.

# నకిలీ వైద్యుల ముఠా గుట్టురట్టు..10 మంది అరెస్ట్

### 10 క్లినిక్‌లపై ఏకకాలంలో దాడులు

### భారీగా వైద్య పరికరాలు, మందులు స్వాధీనం







బుధవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి, పోలీసులు స్వాధీనం చేసుకున్న వైద్య పరికరాలు, మందులు

**పేట్ బషీరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** ఎలాంటి గుర్తింపు పొందిన వైద్య విద్యార్హతలు లేకుండానే క్లినిక్‌లు నిర్వహిస్తూ ప్రజలకు వైద్యం అందిస్తున్న 10 మంది నకిలీ వైద్యులను సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్, స్థానిక పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో అరెస్ట్ చేశారు. బుధవారం పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ డీసీపీ కోటిరెడ్డి ఈ వివరాలను వెల్లడించారు.
మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 10 క్లినిక్‌లపై ఏకకాలంలో దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ తెలిపారు. వీరిలో కొందరికి ఇంటర్మీడియట్, మరికొందరికి డిగ్రీలు మాత్రమే ఉండగా, వైద్య వృత్తి నిర్వహించేందుకు అవసరమైన గుర్తింపు పొందిన వైద్య అర్హతలు లేవని పోలీసులు గుర్తించారు. **అరెస్టయిన నిందితులు** వి. బుచ్చయ్య (35), ఎం. సుధాకర్ చారి (61), డి. అంజ గౌడ్ (49), రామావత్ ప్రకాష్ (26), మేకల అక్షయ్ కుమార్ (35), కె. నారాయణ (50), జి. ప్రహ్లాద్ (55), కోనపాల బుచ్చిబాబు (50), ఎస్. శ్రీనివాసరావు (47), పి. గంగారామ్ (55). ఈ ఘటనకు సంబంధించి వివిధ పోలీస్‌స్టేషన్లలో మొత్తం 10 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మేడ్చల్, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్లలో రెండేసి కేసులు, పేట్ బషీరాబాద్,జగద్గిరిగుట్ట, సూరారం, బాచుపల్లి, ఆర్.సి.పురం, ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్లలో ఒక్కో కేసు నమోదైంది.

**చిన్నారులకు కూడా వైద్యం.. సెలైన్లు ఎక్కించిన వైనం..**

నిందితులు సాధారణ వైద్యంతో పాటు చిన్నారులకు కూడా చికిత్స అందిస్తున్నట్లు డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. కొన్ని క్లినిక్‌లలో బెడ్‌లు ఏర్పాటు చేసి రోగులను చేర్చుకోవడంతో పాటు, సరైన వైద్య అనుభవం లేకుండానే సెలైన్లు ఎక్కిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. ఇలాంటి చర్యలు రోగుల ప్రాణాలకు తీవ్ర ముప్పు కలిగించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈదాడుల్లో క్లినిక్‌ల నుంచి 9 స్టెతస్కోప్‌లు, 9 బీపీ మిషన్లు, 6థర్మామీటర్లు, పల్స్ ఆక్సీమీటర్, వెయింగ్ మిషన్, షుగర్ పరీక్షి ంచే పరికరం, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్లు, కాలం చెల్లిన మందులు, సిరంజీలు, సెలైన్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైద్యం కోసం క్లినిక్‌కు వెళ్లే ముందు సంబంధిత వైద్యుడి గుర్తింపు, వైద్య రిజిస్ట్రేషన్, విద్యార్హతలను తప్పనిసరిగా పరిశీలించాలని డీసీపీ కోటిరెడ్డి ప్రజలకు సూచించారు. అర్హత లేని వ్యక్తుల వద్ద చికిత్స పొందుతూ ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుకోవద్దని హెచ్చరించారు. నకిలీ వైద్యులు లేదా అనుమతులు లేని క్లినిక్‌ల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# 'విమోచనం' అక్కరలేదా?

### 1200 మంది ఆత్మబలిదానాలను అగౌరవ పరుస్తున్న కాంగ్రెస్

### బిజెపి రాగానే విముక్తి దినోత్సవం జరుపుతాం: పార్టీ రాష్ట్ర చీఫ్ రాంచంద్రరావు



**పరకాల, సెప్టెంబరు 2, ప్రభాత వార్త:** మజ్లీస్ పార్టీకి భయపడి తెలంగాణ స్వాతంత్ర్య దినోత్సవం గురించి.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ పాలకులు తెలంగాణ చరిత్రను వక్రీకరిస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నరపరాజు రామచంద్రరావు మండిపడ్డారు. బుధవారం హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలో తెలంగాణ విమోచన ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన వీరులకు అమరవీరుల మైదానం, అమరధామంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రారావు మాట్లాడుతూ పాఠ్య పుస్తకాల్లో తెలంగాణ చరిత్ర లేకుండా.. విద్యార్థులకు తెలవకుండా చరిత్రను దాచిపెడుతున్నారని ఆరోపించారు. వచ్చే రెండు సంవత్సరాల తర్వాత బీజేపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే తెలంగాణ విముక్తి దినోత్సవం జరుపుతామని అన్నారు. నిజాం, రజాకార్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని తెలిపారు. రజాకారుల దమనకాండకు వ్యతిరేకంగా పరకాల ప్రజలు, అమరవీరులు చూపిన ధైర్యసాహసాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని చెప్పారు. కాంగ్రెస్, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వాలు తెలంగాణ విమోచన పోరాట చరిత్రకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. వందేమాతరం కేవలం ఒక గీతం కాదని, అది ప్రతి భారతీయుడి గుండె చప్పుడని, స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిన తారకమంత్రమని గుర్తుచేశారు. అటువంటి పవిత్రమైన గీతాన్ని కాంగ్రెస్ నాయకత్వం అవమానించడం యావత్ దేశ ప్రజలను అవమానించడమేనని వారు మండిపడ్డారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను కాంగ్రెస్ పార్టీ మంటగలుపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ ప్రయోజనాలు, దేశభక్తి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే అమరవీరుల త్యాగాలు, తెలంగాణ విమోచన పోరాట చరిత్రను ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం పార్టీకి భయపడి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరపడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1200మంది ఆత్మబలిదానాలను అగౌరవ పరిచిందన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో ప్రభుత్వాలు విమోచన దినోత్సవంగా జరుపుతుంటే రేవంత్ రెడ్డి విమోచన దినోత్సవాన్ని ఎందుకు జరపడంలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, జిల్లా ఇంచార్జి బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పగ డాల కాళీ ప్రసాద్‌రావు, గంట రవి రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తనేని ధర్మారావు, డాక్టర్ విజయ చందర్ రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, కాచం గురు ప్రసాద్, గుజ్జ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రఘునాథపాలెం మండలానికి అదనంగా 2000 ఇళ్లు మంజూరు చేయండి

### కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబరు2:** ఢిల్లీలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. రఘునాథపాలెం మండలానికి అదనంగా 2,000 పిఎంఏవై ఇళ్లు మంజూరు అయ్యేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలోని ఏజెన్సీ, గిరిజన గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీ మౌలిక వసతుల అభివృద్ధికి రూ.110 కోట్ల నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

### ఖర్గేను కలిసిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబరు2:** ఢిల్లీలో బుధవారం సాయంత్రం ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క కలిశారు. కొండా సురేఖ వివాదం, మంత్రివర్గం విస్తరణపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలపై చర్చించినట్లు సమాచారం. భేటీ అనంతరం ఖర్గేకారులోనే వైఎస్ఆర్ అవార్డ్ కార్యక్రమానికి వెళ్లారు. అంతకు ముందు ఏఐసీసీ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్‌ను సిఎం కలిశారు.


AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)
AU SMALL FINANCE BANK
A SCHEDULED COMMERCIAL BANK
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001
(CIN: L36911RJ1996PLC011381)

2002 యొక్క సెక్యూరిటేషన్ చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీస్

రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా, "ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" 01 ఏప్రిల్ 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" లో విలీనం చేయబడింది. AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిగా, రుణ ఖాతా నిరర్థక ఆస్తి (NPA)గా మారినందున, అధీకృత అధికారి "ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002" లోని సెక్షన్ 13(2) కింద, పత్రికలో ఇవ్వబడిన విధంగా రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/తాకట్టుదారులు/హామీదారులకు (వీరందరినీ కలిపి "రుణగ్రహీతలు"గా సూచిస్తారు) 60 రోజుల డిమాండ్ నోటీసు జారీ చేశారు. నోటీసు ప్రకారం, రుణగ్రహీతలు 60 రోజులలోపు పూర్తి మొత్తాన్ని జమ చేయకపోతే, క్రింద ఇవ్వబడిన విధంగా తాకట్టు ఆస్తులు/హామీ ఆస్తుల వేలం ద్వారా ఆ మొత్తం వసూలు చేయబడుతుంది. అందువల్ల, రుణగ్రహీతలైన మీరు డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు భవిష్యత్ వడ్డీ మరియు ఖర్చులతో పాటు మొత్తం రుణ మొత్తాన్ని జమ చేయాలని తెలియజేయడమైనది, లేని పక్షంలో, సదరు చట్టంలోని 13(4) మరియు 14 నిబంధనల ప్రకారం, అధీకృత అధికారి క్రింద ఇవ్వబడిన విధంగా తనఖా ఆస్తులు/హామీ ఆస్తులను అమ్మకం కోసం స్వాధీనం చేసుకోవడానికి స్వేచ్ఛగా ఉంటారు.
రుణగ్రహీతలు గమనించవలసినది ఏమనగా, ఈ నోటీసును స్వీకరించిన తర్వాత, 2002 చట్టంలోని సెక్షన్ 13(13) నిబంధనల ప్రకారం, హామీదారు రుణదాత యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, హామీగా ఉంచిన ఆస్తులలో దేనినీ అమ్మకం, లీజు లేదా మరే ఇతర మార్గంలోనైనా బదిలీ చేయడం మీకు నిషేధించబడింది మరియు నిరోధించబడింది. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 చట్టంలోని సెక్షన్ 13(8) మరియు రూల్ 3(5) ప్రకారం, వేలం నోటీసు ప్రచురణకు ముందు క్రింద పేర్కొన్న విధంగా పూర్తి బకాయిలను చెల్లించిన మీదట రుణగ్రహీతలు తమ హామీగా ఉంచిన ఆస్తిని విడిపించుకోవడానికి అర్హులు అని, ఆ తర్వాత వేలం ఉనికిలో ఉండదని రుణగ్రహీతల దృష్టికి తీసుకురాడమైనది.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు యొక్క పేరు/రుణ ఖాతా నం. | 13(2) సెక్షన్ క్రింద డిమాండ్ నోటీస్ యొక్క తేదీ మరియు సొమ్ము |
| --- | --- |
| (రుణ ఖాతా నెం.) 24660002699166, నల్ల దివ్య భారతి (రుణగ్రహీత), నల్ల పవన్ (సహ-రుణగ్రహీత) | 06-జూలై-26 రూ. 8,87,415/- రూ. ఎనిమిది లక్షల ఎనభై ఏడు వేల నాలుగు వందల పదిహేను మాత్రమే 04-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: హనుమకొండ జిల్లా, మరియు SRO వరంగల్ RO హనుమకొండ, వడ్డేపల్లి, ఎస్.సి. కాలనీలో ఉన్న వడ్డేపల్లి రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నంబర్లు 932/B (కొత్త), 1699 (పాత) లలో గల 101.50 చదరపు గజాలు లేదా 84.86 చదరపు మీటర్లు విస్తీర్ణం కలిగిన, ఇంటి నంబర్ 2-9-1167/A గల ఖాళీ స్థలంతో కూడిన ఇల్లు; దీని సరిహద్దులు: తూర్పు నుండి పడమరకు 30.8 నుండి 30 వరకు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 30 నుండి 25 వరకు ఉండి, అందులో ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో చేపట్టే నిర్మాణాలతో సహా. | |
| (రుణ ఖాతా నెం.) 21660000684024, సయ్యద్ హుస్సేన్ (రుణగ్రహీత), సయ్యద్ మహమ్మద్ (సహ-రుణగ్రహీత) | 06-జూలై-26 రూ. 3,74,948/- మూడు లక్షల డెబ్బై నాలుగు వేల తొమ్మిది వందల నలభై ఎనిమిది రూపాయలు మాత్రమే 04-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం, బిజినేపల్లి గ్రామంలోని ఇంటి నం. 8-100/A ఇది 116.11 చదరపు గజాల విస్తీర్ణం గల ప్లాట్‌లో ఉంది మరియు 240 చదరపు అడుగుల RCC ప్లింత్ ఏరియా కలిగి ఉంది. | |
| (రుణ ఖాతా నెం.) 23630000068371, బోడ భద్రమ్మ (రుణగ్రహీత), బోడ సతీష్ (సహ-రుణగ్రహీత) | 06-జూలై-26 రూ. 7,28,462/- ఏడు లక్షల ఇరవై ఎనిమిది వేల నాలుగు వందల అరవై రెండు రూపాయలు మాత్రమే 04-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: వరంగల్ జిల్లా, నెక్కొండ మండలం, నెక్కొండ తండా గ్రామం మరియు గ్రామ పంచాయతీ పరిధిలో రిజిస్ట్రేషన్ జిల్లా: వరంగల్; జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, నర్సంపేట పరిధిలో ఉన్న ఇంటి నం. 9-30; ఇది ఖాళీ స్థలంతో కూడిన RCC పైకప్పు గల ఇల్లు. దీని మొత్తం విస్తీర్ణం 248.65 చదరపు గజాలు లేదా 207.90 చదరపు మీటర్లు మరియు ప్లింత్ ఏరియా నిర్మాణ విస్తీర్ణం 351.75 చదరపు అడుగులు. | |
| (రుణ ఖాతా నెం.) 24660002447822, కేశవరాపు కృష్ణమాచారి (రుణగ్రహీత), కేశవరాపు పద్మ (సహ-రుణగ్రహీత) | 06-జూలై-26 రూ. 6,63,398/- ఆరు లక్షల అరవై మూడు వేల మూడు వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే 04-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: సూర్యాపేట మున్సిపాలిటీ మరియు జిల్లా పరిధిలోని వార్డు నం. 3, బ్లాక్ నం. 12, ఎరుకలవాడలో ఉన్న ఆస్తి: డోర్ నం. 3-12-3/4/3/1/B పశ్చిమ భాగం కలిగిన నివాస గృహం. దీని విస్తీర్ణం 63.60 చదరపు గజాలు 53.17 చదరపు మీటర్లకు సమానం మరియు ప్లింత్ ఏరియా 272.26 చదరపు అడుగులు. | |
| (రుణ ఖాతా నెం.) 23660000766997, మహారాజు రఘుపతి (రుణగ్రహీత), మహారాజు చైతన్య (సహ-రుణగ్రహీత) | 09-జూలై-26 రూ. 14,66,022/- పద్నాలుగు లక్షల అరవై ఆరు వేల ఇరవై రెండు రూపాయలు మాత్రమే 08-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: G.P.H. నం. 2-119/1 (అసెస్మెంట్ నం. 535) కలిగిన RCC పైకప్పు గల ఇల్లు మరియు ఖాళీ స్థలం. దీని విస్తీర్ణం 155.72 చదరపు గజాలు లేదా 130.20 చదరపు మీటర్లు మరియు RCC పైకప్పు గల ఇంటి ప్లింత్ ఏరియా 324.18 చదరపు అడుగులు. ఇది వరంగల్ జిల్లా, సంగెం మండలం, కాపులకనపర్తి గ్రామం మరియు గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. ఇది వరంగల్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు వరంగల్-రూరల్ జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి వస్తుంది. | |
| (రుణ ఖాతా నెం.) 24660002211236 & 23660001190413, వెంపాటి కృష్ణారావు (రుణగ్రహీత), వెంపాటి శిరీష (సహ-రుణగ్రహీత) | 09-జూలై-26 రూ. 11,82,358/- పదకొండు లక్షల ఎనభై రెండు వేల మూడు వందల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే 08-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: RCC పైకప్పు కలిగిన ఇల్లు నం: 15-3 YSR/509/A/1, (అసెస్మెంట్ నం. 1106074633), RCC పైకప్పు విస్తీర్ణం (టాయిలెట్లతో సహా) 389.75 చదరపు అడుగులు, 72.00 చదరపు గజాల స్థలం; విద్యుత్ ఫిట్టింగ్‌లు, విద్యుత్ కనెక్షన్, శానిటరీ మరియు ఇతర అమరికలతో సహా. ఈ ఆస్తి YSR నగర్ కాలనీ, టేకులపల్లి పరిధి, ఖమ్మం అర్బన్ మండలం, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం SRO పరిధి, ఖమ్మం జిల్లాలో ఉంది. దీని సరిహద్దులు: | |
| (రుణ ఖాతా నెం.) 24660002296064 & 22660000885444, శ్రీమతి భుక్యా ఉపేంద్రి - దివంగత శ్రీ భుక్యా ఉపేంద్రి భార్య మరియు చట్టపరమైన వారసురాలు (సహ-రుణగ్రహీత - దివంగత శ్రీ భుక్యా బాలు - రుణగ్రహీత యొక్క చట్టపరమైన వారసురాలు), | 17-జూలై-26 రూ. 5,31,837/- ఐదు లక్షల ముప్పై ఒక్క వేల ఎనిమిది వందల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే 16-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: నివాస గృహం D.No. 31-1-155 మరియు 266.66 చదరపు గజాల స్థలం; ఇది వెంగళరావు కాలనీ, పాల్వంచ మున్సిపాలిటీ పరిధి మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉంది. | |
| (రుణ ఖాతా నెం.) 22660000340481 & 23660000673982, రత్లావత్ మోహన్ (రుణగ్రహీత), రత్లావత్ చండి (సహ-రుణగ్రహీత), రత్లావత్ గోవిందు (సహ-రుణగ్రహీత) | 17-జూలై-26 రూ. 3,17,887/- మూడు లక్షల పదిహేడు వేల ఎనిమిది వందల ఎనభై ఏడు రూపాయలు మాత్రమే 16-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: స్థిరాస్తి- తెలంగాణ రాష్ట్రం, వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలం, అన్నారం తండా గ్రామంలో ఉన్న 187.65 చదరపు గజాల స్థలంలో ఇ.నం. 4-85, 711 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మించిన RCC ఇంటి భవనం మరియు దానికి సంబంధించిన అన్ని అమరికలు తలుపులు, ఫ్రేమ్‌లు, అల్మారాలు, వెంటిలేషన్లు, కిటికీలు, ఫ్లోరింగ్, పైకప్పు, వైరింగ్, పెరడు, వాస్తు అంశాలు, నాలుగు వైపుల గోడలు మొదలైనవి. | |
| (రుణ ఖాతా నెం.) 24660001189974, బెద్దల నాగేందర్ (రుణగ్రహీత), బెద్దల లక్ష్మి (సహ-రుణగ్రహీత) | 21-జూలై-26 రూ. 10,02,610/- పది లక్షల రెండు వేల ఆరు వందల పది రూపాయలు మాత్రమే 21-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, భూపాలపల్లి గ్రామం మరియు మండలంలో ఉన్న స్థిరాస్తి, ఇది వార్డు నం. 24లో, ఇంటి నం. 24-1-10/1 కలిగి, 180.41 చదరపు గజాలు లేదా 159.413 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, 473.55 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో ఉన్న ACC షీట్ రూఫ్ ఇల్లు మరియు ఖాళీ స్థలం. దీని కొలతలు: తూర్పు నుండి పడమరకు 97.2 నుండి 88.7 వరకు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 17.3 నుండి 17.6 వరకు ఉండి, మొత్తం 473.55 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని కలిగి ఉంది. అందులో ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో చేపట్టే నిర్మాణాలతో సహా, | |
| (రుణ ఖాతా నెం.) 25660000400214 & 24660000771935, కుర్వ గోవిందు (రుణగ్రహీత), కుర్వ మాణిక్యమ్మ (సహ-రుణగ్రహీత) | 21-జూలై-26 రూ. 13,13,971/- పదమూడు లక్షల పదమూడు వేల తొమ్మిది వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే 21-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: (సమోదైన ఇంటి - గిఫ్ట్ డీడ్, డాక్యుమెంట్ నం. 1962/2024, తేదీ: 22-02-2024 & సవరణ డీడ్ - డాక్యుమెంట్ నం. 3317/2024, తేదీ: 22.03.2024 ప్రకారం) జోగులాంబ గద్వాల్ జిల్లా, ధరూర్ మండలం, రేవులపల్లి గ్రామంలో ఉన్న ఇంటి నం. 6-90 (అసెస్మెంట్ నం. 674) గల ఆస్తి. దీని కొలతలు 60'x40' అడుగులు, మొత్తం విస్తీర్ణం 266.6 చదరపు గజాలు 222.9 చదరపు మీటర్లకు సమానం. ఇందులో 880 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా నిర్మాణ వైశాల్యం కలిగిన RCC ఇల్లు ఉంది. ఈ ఆస్తి ప్రస్తుతం శ్రీమతి కుర్వ మాణిక్యమ్మ భర్త: కుర్వ గోవిందు అలియాస్ KK గోవిందు గారికి చెందుతుంది. దీని సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి:- | |
| (రుణ ఖాతా నెం.) 25630000022785, మహమ్మద్ ఫక్రొద్దీన్ (రుణగ్రహీత), సమీనా తబస్సుమ్ (సహ-రుణగ్రహీత) | 21-జూలై-26 నాటికి రూ. 8,41,036/- ఎనిమిది లక్షల నలభై ఒక్క వేల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే 21-జూలై-26 నాటికి |
| తనఖా ఆస్తి యొక్క వివరణ: ఇంటి నం. 4-50 గల ఆస్తి, దీని విస్తీర్ణం 150.00 చదరపు గజాలు, RCC పైకప్పు మరియు 618.37 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా నిర్మాణ వైశాల్యం కలిగి ఉంది. ఇది తెలంగాణ రాష్ట్రం, జగిత్యాల జిల్లా, జగిత్యాల మండలం, చెల్గల్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెల్గల్ గ్రామంలో ఉంది. | |

తేది : 02.09.2026 ప్రదేశం : తెలంగాణ
అధీకృత అధికారి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

# మైనర్‌తో పెళ్లి.. 'పోక్సో' వర్తిస్తుంది




## - కేరళ హైకోర్టు స్పష్టీకరణ

**తిరువనంతపురం, సెప్టెంబర్ 2:** బాల్య సంరక్షణ పట్ల భారతదేశ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, వ్యక్తిగత మత చట్టాల ప్రకారం జరిగినా కూడా, మైనర్‌తో వివాహం అనేది కఠినమైన లైంగిక నేరాల నుండి బాలల రక్షణ చట్టం (పోక్సో) కింద క్రిమినల్ విచారణ నుండి ఎలాంటి రక్షణ కల్పించదని కేరళ హైకోర్టు స్పష్టంగా తీర్పు చెప్పింది. 17యేళ్ల బాలికపై పదేపదే అత్యాచారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై ఉన్న క్రిమినల్ విచారణను కొట్టివేయడానికి హైకోర్టు నిరాకరించింది. వారి వివాహం ముస్లిం మత సంప్రదాయాల ప్రకారం జరిగినప్పటికీ, అది అతడిని పోక్సో చట్టం కింద క్రిమినల్ బాధ్యత నుండి రక్షించదని స్పష్టం చేసింది. మన్నార్‌కాడ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో మొదటి నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ జోబిన్ సెబాస్టియన్ కొట్టివేశారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన చట్టాన్ని ఉటంకిస్తూ, 18యేళ్లలోపు బాలికతో లైంగిక సంబంధం పెట్టుకున్న వ్యక్తి, బాధితురాలు తన భార్య మరియు ఆమె వయస్సు 15 నుండి 18 ఏళ్ల మధ్య ఉన్నప్పటికీ, భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 376 కింద అత్యాచారం నేరానికి పాల్పడినట్లుగా పరిగణించబడుతుందని కోర్టు పేర్కొంది. "అందువల్ల, ప్రస్తుత కేసులో, నిందితుడు ఐపిసి సెక్షన్ 375లోని మినహాయింపు 2 సహాయంతో వివాహం నుండి తప్పించుకోలేడు అని తన ఉత్తర్వులో పేర్కొంది. ఆ యువతి తన చట్టబద్ధమైన భార్య అని, ఆమెకు 17యేళ్ల ఒక నెల వయసు ఉన్నప్పుడు ఇస్లామిక్ సంప్రదాయాల ప్రకారం వివాహం జరిగిందని నిందితుడు తరఫు న్యాయవాది చేసిన వాదనలను కోర్టు తోసిపుచ్చింది. వ్యక్తిగత చట్టం ప్రకారం ఆ వివాహం చెల్లుబాటు అవుతుందా లేదా అనే దానితో సంబంధం లేకుండా, వివాహంలోని ఇద్దరిలో ఒకరు మైనర్ అయితే 'పోక్సో' వర్తిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. వివాహ బంధం ఆధారంగా నిందితుడు చట్టపరమైన విచారణ నుండి తప్పించుకోలేడని కోర్టు పేర్కొంది.



# మధ్యప్రాచ్యంలో మళ్లీ కాలుదువ్విన అమెరికా

## జోర్డాన్, బహ్రెయిన్ ఇతర గల్ఫ్‌దేశాలపై ఇరాన్ క్షిపణుల వర్షం

**టెహ్రాన్, సెప్టెంబరు 2:** మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా ఇరాన్‌పై తాజా దాడులకు దిగింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కు చెందిన లక్ష్యాలపై విరుచుకుపడింది. ఒమన్ గల్ఫ్‌లో అమెరికా యుద్ధనౌకలపై ఇరాన్ క్షిపణులు ప్రయోగించడమే దీనికి కారణం. దీనికి ప్రతిగా ఇరాన్ సైతం వైమానిక దాడులతో బెంబేలెత్తిస్తోంది. జోర్డాన్, బహ్రెయిన్ ఇతర గల్ఫ్ దేశాల్లో అమెరికాకు చెందిన బేస్ క్యాంప్ లపై బాంబుల వర్షాన్ని కురిపించింది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. నిన్నటి వరకు చల్లారినట్టే కనిపించిన ఈ యుద్ధం మళ్లీ మొదటికొచ్చినట్టయింది. ముమ్ముందు మరింత తీవ్రంగా దాడులు చేపడతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం ప్రకటించడం అక్కడి తీవ్రతను అద్దం పట్టినట్లయింది. ఈ దాడులను అటు అమెరికా, ఇటు ఇరాన్‌ఆత్మరక్షణలో భాగమని చెప్పుకొన్నాయి. ఇరాన్‌లోని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ లక్ష్యాలపై దాడులు ప్రారంభించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దీనిపై తన అధికారిక ఎక్స్ ప్లాట్ ఫామ్ పై పోస్ట్ పెట్టింది. హర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలు, ఆ ప్రాంతంలో మోహరించిన అమెరికన్ సైనికులపైనా ఐఆర్‌జీసీ దాడుల ప్రయత్నాలకు ప్రతీకారానికి దిగామని తెలిపింది. ఇరాన్‌లోని ఖేష్మ్ ఐలాండ్, జాస్క్, సిరిక్ రీజియన్, జిరోఫ్ట్ ఎయిర్ పోర్ట్ సమీపంలో కూడా పేలుళ్ల సంభవించినట్టు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ తెలిపింది. తన భూభాగం నుంచి అమెరికా సైనిక స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ దీన్ని ధృవీకరించింది. జోర్డాన్‌లోని మువాఫ్ఫక్ సాల్టి ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై తాము భారీగా బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేశామని ప్రకటించింది. అమెరికాకు చెందిన అత్యాధునిక ఆర్క్యూ4, ఎమ్క్యూ9 డ్రోన్ల హ్యాంగర్లే లక్ష్యంగా జోర్డాన్‌లో దాడులు జరిగాయని అధికారిక మీడియా ఐఆర్ఐబీ పేర్కొంది. ఈ దాడిలో పలు డ్రోన్లు ధ్వంసం కావడంతో పాటు అమెరికా ప్రాణనష్టాన్ని కూడా చవి చూసిందని వివరించింది. దీనిపై అమెరికా గానీ, జోర్డాన్ గానీ అధికారికంగా ఎటువంటి ప్రకటనా వెలువడించలేదు. ఇరాన్ ఎలాంటి సాహసానికి ఒడిగట్టినా అంతకంటే రెట్టింపుగా సమాధానం ఇస్తామని అన్నారు. హోర్ముజ్ జలసంధిలో సముద్రపు ల్యాండ్ మైన్లు అమర్చేందుకు ఇరాన్ చేసిన విఫలయత్నానికి, జోర్డాన్ స్థావరాలపై దాడులకు ప్రతీకారంగానే తాము ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. దీంతో దాడుల తీవ్రత మరింత పెరిగే సూచనలు కనిపిస్తోన్నాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో జోర్డాన్ సరిహద్దుల్లో హై అలర్ట్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా వార్ సైరన్లు మోగాయి. ఇరాన్ దాడుల నేపథ్యంలో మఫ్రాక్ సిటీ గగనతలంపై పలు రాకెట్లను జోర్డాన్ రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నట్లు ఆదేశ రక్షణశాఖప్రకటించింది.

# నకిలీ పత్రాలతో రూ.4.11 కోట్ల గృహ రుణాల మోసం!

## - రిజిస్ట్రేషన్లకు సహకరించిన మాజీ సబ్‌రిజిస్ట్రార్ అరెస్ట్ - ఏడు కేసుల్లోనూ పాత్ర.. - 11 రుణ లావాదేవీలపై పోలీసుల దర్యాప్తు, మరింత మంది అరెస్టుకు రంగం సిద్ధం: డిసిపి శ్రీధర్

**నేరెడ్ మెట్,మల్కాజిగిరి కమిషనరేట్, సెప్టెంబర్ 2, ప్రభాత వార్త :** నకిలీ, తారుమారు చేసిన స్థిరాస్తి పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయించి.. వాటి ఆధారంగా బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల నుంచి రూ.4.11 కోట్ల గృహ రుణాలు పొందిన మోసపూరిత వ్యవహారంలో అప్పటి కీసర సబ్‌రిజిస్ట్రార్ మహమ్మద్ యూసుఫ్ ఉర్ రహ్మాన్ అరెస్టయ్యారు. నకిలీ పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకరించారనే ఆరోపణలపై ఆయనను ఏడు కేసుల్లో నిందితుడిగా గుర్తించిన పోలీసులు.. న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ కేసులో మరింత మంది నిందితుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని మల్కాజిగిరి జోన్ డీసీపీ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పలు స్థిరాస్తి మోసం, నకిలీ పత్రాలు, మోసపూరిత రిజిస్ట్రేషన్ కేసుల దర్యాప్తులో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రియల్ ఎస్టేట్ మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్లు, జీపీఏ హోల్డర్లు, నకిలీ విక్రేతలు, ఇంపర్సనేటర్లు, రుణగ్రహీతలు కలిసి మోసానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులను గుర్తించి.. వారి పేర్లను ఉపయోగించి నకిలీ స్థిరాస్తి పత్రాలు సృష్టించి రుణాలు పొందినట్లు దర్యాప్తులో తేలింది. ముందుగా ఈఎంఐలు.. ఆపై ఎగవేనకిలీ పత్రాల ఆధారంగా బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు పొందిన అనంతరం కొంతకాలం క్రమం తప్పకుండా ఈఎంఐలు చెల్లించేవారు. బ్యాంకులకు అనుమానం రాకుండా వ్యవహరించిన అనంతరం ఉద్దేశపూర్వకంగా రుణ వాయిదాలు నిలిపివేసినట్లు పోలీసులు గుర్తించారు. కొన్ని ఆస్తులు వాస్తవంగా లేనట్లు, సర్వే నంబర్లు, ప్లాట్ నంబర్లు, ఇతర ఆస్తి వివరాలు తారుమారు చేసినట్లు బయటపడింది. ఇప్పటివరకు 11 మోసపూరిత గృహ రుణ లావాదేవీల్లో రూ.4.11 కోట్ల మేర మోసం జరిగినట్లు గుర్తించామని డీసీపీ శ్రీధర్ వెల్లడించారు. సబ్‌రిజిస్ట్రార్ పాత్రపై ఆధారాలుకీసర సబ్‌రిజిస్ట్రార్‌గా యూసుఫ్ ఉర్ రహ్మాన్ పనిచేసిన సమయంలో పలు అనుమానాస్పద స్థిరాస్తి లావాదేవీలకు సంబంధించిన పత్రాలు రిజిస్ట్రేషన్ అయినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా క్రైం నంబర్ 928/2025 దర్యాప్తులో 2021, 2022 సంవత్సరాల్లో కీసర ఎస్ఆర్ఓలో నమోదైన పలు సేల్ డీడ్లను పోలీసులు పరిశీలిస్తున్నారు. అనంతరం ఈ పత్రాలను నిందితులు బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల వద్ద టైటిల్, సెక్యూరిటీ పత్రాలుగా సమర్పించి రుణాలు పొందినట్లు తేలింది. రిజిస్ట్రేషన్ రికార్డులు, సేల్ డీడ్లు, జీపీఏ/ఏజీపీఏ పత్రాలు, థంబ్ ఇంప్రెషన్, బయోమెట్రిక్ రికార్డులు, ఫొటోలు, సాక్షుల వాంగ్మూలాలు తదితరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఏడు కేసుల్లో కీలక పాత్రమాజీ సబ్‌రిజిస్ట్రార్ పాత్ర క్రైం నంబర్లు 723/2021, 714/2025, 419/2025, 241/2025, 195/2023, 84/2026, 928/2025 కేసుల్లో వెలుగులోకి వచ్చినట్లు డీసీపీ తెలిపారు. నకిలీ, కల్పిత స్థిరాస్తి పత్రాలు, తప్పుడు లింక్ డాక్యుమెంట్లు, ఇంపర్సనేషన్, జీపీఏ/ఏజీపీఏ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేసి.. వాటిని తదుపరి ఆస్తి లావాదేవీలు, రుణాల కోసం వినియోగించినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు చెప్పారు.

**ఇంట్లో కీలక పత్రాల స్వాధీనం..**

సెప్టెంబర్ 1న సాయంత్రం 6 గంటలకు యూసుఫ్ ఉర్ రహ్మాన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించారు. ఆయన వెల్లడించిన సమాచారంతో నివాసం నుంచి కేసులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాల ప్రతులు, ఇతర కీలక డాక్యుమెంటరీ ఆధారాలను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల లోన్ ఫైళ్లు, టైటిల్ వెరిఫికేషన్ నివేదికలు, మార్ట్గేజ్ పత్రాలు, కేవైసీ వివరాలు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నారు. నిందితుల మధ్య జరిగిన కమ్యూనికేషన్లు, ఆర్థిక లావాదేవీలను నిర్ధారించేందుకు డిజిటల్, ఎలక్ట్రానిక్ ఆధారాలను సైతం సేకరిస్తున్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు.. మోసం ద్వారా వచ్చిన డబ్బు, ఆస్తులను గుర్తించి మొత్తం నేర నెట్‌వర్క్‌ను వెలుగులోకి తీసుకొచ్చేందుకు దర్యాప్తు కొనసాగుతోందని డీసీపీ శ్రీధర్ తెలిపారు.

# 'రీల్స్ చూసి నకిలీ కరెన్సీ తయారీ

## - ముగ్గురు అరెస్ట్, రూ.2.91 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం - ప్రింటర్, స్కానర్, లామినేటర్ సీజ్

**అత్తాపూర్ సెప్టెంబరు 2,ప్రభాతవార్త :** యూట్యూబ్,ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూసి నకిలీ కరెన్సీ తయారీకి స్కెచ్ వేసి ముఠా చివరకు పోలీసులకు చిక్కింది. శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బాలాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నకిలీ కరెన్సీ నోట్లను తయారు చేసి చలామణి చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2,91,100 విలువైన నకిలీ కరెన్సీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాజేంద్ర నగర్‌లోని శంషాబాద్ టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో కేసు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ సిఐ కృష్ణ మోహన్, బాలపూర్ సిఐ సుధాకర్‌తో కలిసి అడిషనల్ డిసిపి కె ఎస్ రావు వెల్లడించారు. వడిపట్ల చింతల్ తండాకు చెందిన ప్రధాన నిందితుడు రామావత్ రాము అలియాస్ మహమ్మద్ (36) డెలవరి భాయ్‌గా పనిచేస్తుండగా, ఆర్థిక ఇబ్బందులతో అక్రమంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. తన బంధువు రామావత్ మోతీలాల్ (35)తో కలిసి యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ నోట్ల తయారీకి సంబంధించిన వీడియోలను చూసి పద్ధతిని నేర్చుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రింటర్, స్కానర్, బాండ్ పేపర్లు, ఇతర సామగ్రిని సమకూర్చుకుని నకిలీ రూ.500, రూ.100, రూ.200 నోట్లను తయారు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అసలైన నోట్ల మాదిరిగా కనిపించేలా వాటర్‌మార్క్ ఏర్పాటు చేసి వాటిని చలామణిలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. వైన్ షాపులు.. కూరగాయల మార్కెట్లు టార్గెట్ నకిలీ నోట్లను ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా రాత్రివేళల్లో వైన్ షాపులు, కూరగాయల మార్కెట్లలో చిన్న మొత్తాల్లో చలామణి చేసినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే మూడో నిందితుడు రామావత్ గాంధీ (19) ద్వారా మార్కెట్‌లో నకిలీ కరెన్సీని చలామణి చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. రూ. 2.91 లక్షల నకిలీ కరెన్సీతో పాటు సామగ్రి సీజ్ నిందితుల నుంచి మొత్తం 437 నకిలీ రూ.500 నోట్లు, 648 నకిలీ రూ.100 నోట్లు, 39 నకిలీ రూ.200 నోట్లు కలిపి రూ.2,91,100 విలువైన నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఎప్సన్ కలర్ ప్రింటర్, కలర్ స్కానర్, జీబ్రానిక్స్ లామినేటర్, పేపర్ కట్టర్, వివిధ రంగులు, నకిలీ వాటర్‌మార్క్ పేపర్లు, మూడు స్మార్ట్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం తదితరాలను సీజ్ చేశారు. ఈ కేసులో మరో నిందితుడు సుధీర్ జాన్ చెలా అలియాస్ వంశీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని కోసం గాలింపు కొనసాగుతోంది. స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఎస్ఐ కె. మన్సూర్ అలీతో పాటు టాస్క్‌ఫోర్స్, బాలాపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డిసిపి శ్రీనివాస్ రావు

# సిజెపి సభ్యుల తనిఖీతోనే కన్వర్‌పురా గ్రామానికి కొత్త స్కూలు భవనం

## సిజెపి నేత అశుతోష్

**జైపూర్, సెప్టెంబరు 2:** పాఠశాలలను బాగు చేసుకుందాం ప్రచారంలో భాగంగా కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులతో గ్రామస్తుల ఘర్షణ జరిగిన కొన్ని రోజుల తర్వాత రాజస్థాన్ రాజధాని జైపూర్ జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను కూల్చివేశారు. బగ్రూ అసెంబ్లీ నియోజకవర్గంలోని రాంపురా కన్వర్‌పురా గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. త్వరలో కొత్త స్కూల్ భవనాన్ని నిర్మించనున్నారు. ఆగస్ట్ 23వ తేదీనే పాఠశాల కోసం జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధుల నుంచి రూ.12 లక్షలు, ఎమ్మెల్యే స్థానిక అభివృద్ధి నిధి నుంచి రూ. 6 లక్షలు ఇప్పటికే ఆమోదించినట్లు ఎమ్మెల్యే కైలాష్ వర్మ తెలిపారు. రాంపురా కన్వర్‌పురా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో ఆ సమీపంలోని ఆవుల పాకలో పిల్లలకు క్లాసులు నిర్వహిస్తుండటం సీజేపీ దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆగస్ట్ 21న అశుతోష్ ప్రచారంలో సందర్శించారు.

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలి:చాడ వెంకటరెడ్డి




సదస్సులో ప్రసంగిస్తున్న చాడ వెంకటరెడ్డి. చిత్రంలో ఎం.నర్సింహ్మా, ఎం.డి.యూసఫ్, చంద్రయ్య, వి.ఎస్.బోస్, ఎస్.బాల్‌రాజ్ తదితరులు

**సైఫాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వానికి నిత్యం సేవలు అందిస్తున్నారని వారిని పర్మినెంట్ చేయడం ద్వారానే వారికి సరైన న్యాయం జరుగుతుందని సిపిఐ మాజీ శాసన సభ్యుడు చాడ వెంకటరెడ్డి చెప్పారు. 1970లో వచ్చిన కాంట్రాక్ట్ రెగ్యులేషన్ అండ్ అబోల్యూషన్‌ఆక్ట్‌లో 240 రోజులకు పైబడి పనిచేసిన వారందరికి పర్మినెంట్ చేయాలని చట్టం చెబుతున్నదని, కాని ప్రభుత్వాలు చట్టాలను పట్టించుకోకుండా సంవత్సరాలు తరబడి కార్మికులతో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయించుకుంటూ శ్రమదోపిడీకి గురిచేయడం దారుణమన్నారు. బుధవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత పదేళ్ళ కాలంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని, పిఆర్‌సిని అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగిలా బేసిక్ వేతనం కాంట్రాక్ట్ ఉద్యోగులకు వచ్చేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ మాట్లాడుతూ కనీస వేతనాల బోర్డులో కనీస వేతనం 26 వేలు ఉండాలని డిమాండ్ చేసినప్పటికి ఈ ప్రభుత్వం బోర్డు సూచనలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ ఎఐటియుసి రాష్ట్ర మహాసభల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల డిమాండ్లపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు. ఈ సదస్సులో ఎఐటియుసి సీనియర్ నాయకుడు వి.ఎస్.బోస్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు చంద్రయ్య, ప్రేమ్‌పావని, కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# కొండపోచమ్మ రిజర్వాయర్‌లో మునిగి విద్యార్థి మృతి

**ములుగు, సెప్టెంబరు 2 (ప్రభాతవార్త):** కొండ పోచమ్మ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి విద్యార్థి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ములుగు ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్‌లోని ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన నేపాలి అమర్‌కిషోర్ కుమారుడు నేపాలి మోహన్‌ప్రసాద్(18) బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, అతనితో పాటు తోటి విద్యార్థులు లోకేష్, ఆదిత్య బంగు, మేడ్చల్ శశాంక్, గట్టు ఆర్యన్, బురద దినేష్, మణికంఠ, సాయిలతో కలిసి బుధవారం ఉదయం 11 గంటలకు కళాశాల నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటలకు కొండపోచమ్మ రిజర్వాయర్‌కు చేరుకున్నారు. అనంతరం రిజర్వాయర్ లోపలి ప్రాంతంలోకి దిగిన వారు నీటిలో ఆడుతున్న సమయంలో మోహన్‌ప్రసాద్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు, మృతుని సోదరుడు మణికంఠకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ములుగు పోలీసులు, మృతుని కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి మోహన్‌ప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# 6న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'ఉద్యోగుల సంకల్ప సభ'




వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెఎసి నాయకులు


**సైఫాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి, డిఎ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 'చలో హైదరాబాద్' పేరిట ఈ నెల 6వ తేదీన ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'ఉద్యోగుల సంకల్ప సభ' నిర్వహిస్తున్నామని తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ లచ్చిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ సంకల్ప సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై చిన్న చూపు చూడటం తగదన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉద్యోగులు సక్రమంగా అమలు చేస్తున్నారని అయితే ఉద్యోగులు మాత్రం పిఆర్‌సి, డిఎలు, పదవి విరమణ చేసిన ఉద్యోగుల బెనిఫిట్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయంపై ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. రేపటి నుంచి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాన్ని చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు రాజశేఖర్, రాములు, రామిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, దర్శన్, కుమారస్వామి, జగదీశ్వరెడ్డి, వివేక్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిజెపి మధ్యే వచ్చే అసెంబ్లీ పోరు

## కార్యకర్తల సహనాన్ని పరీక్షిస్తే మూల్యం తప్పదు : ఎన్. రామచందర్‌రావు




**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని, దాడులకు పాల్పడితే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఘర్షణ నేపథ్యంలో పోలీసులు అరెస్టు చేసిన బీజేపీ కార్యకర్తలను న్యాయస్థానం బెయిల్‌పై విడుదల చేయడంతో వారిని రామ చందర్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై దాడులు, అక్రమ కేసులకు పాల్పడుతోందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. గత మూడు రోజులుగా బీజేపీ కార్యాలయాలపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు యత్నిస్తున్నారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడికి యత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలను ప్రతిఘటించిన తమ పార్టీ కార్యకర్తలపై అధికార మదంతో అక్రమ కేసులు నమోదు చేశారని రామచందర్‌రావు ఆరోపించారు. దాడులను అడ్డుకున్న కార్యకర్తలపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే బీజేపీ వెనక్కి తగ్గబోదని స్పష్టం చేశారు. అక్రమ కేసులతో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోలేరని అన్నారు. కాంగ్రెస్ పాలనకు ప్రజలు త్వరలోనే గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. వెయ్యి రోజుల్లో చేయని అభివృద్ధిని 700 రోజుల్లో చేయడం సాధ్యం కాదని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలను విస్మరించి ప్రతిపక్ష కార్యకర్తలపై కేసులు, దాడులతో పాలన సాగించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రామచందర్‌రావు పరామర్శ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల మురళీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్, కాదూరి అచ్చయ్య, కార్యదర్శి తడిసిన మల్లారెడ్డి, జిల్లా కోశాధికారి సోమ నర్సయ్య, మీడియా కన్వీనర్ రామకృష్ణ, కార్యాలయ కార్యదర్శి మంగ నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు రత్నపురం ఉన్నారు.



# సావర్కర్‌కు ఎప్పుడూ ముస్లింలపై ద్వేషంలేనే లేదు!

## కోర్టులో సాక్ష్యం చెప్పిన సావర్కర్ మనవడు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** హిందుత్వ భావజాల వేత్త వినాయక్ దామోదర్ సావర్కర్‌కు ముస్లింలపై ఎన్నడూ ద్వేషం లేదని, పైగా వారి పురోభివృద్ధికి తన రచనల్లో దిశానిర్దేశం చేశారని ఆయన మనవడు సాత్యకి సావర్కర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన వ్యాఖ్యల ద్వారా సావర్కర్‌ను తీవ్ర ముస్లిం ద్వేషిగా చిత్రీకరించారని ఆయన ఆరోపించారు. రాహుల్ గాంధీపై సాత్యకి దాఖలు చేసిన పరువునష్టం దావాకు సంబంధించి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సాత్యకిని అడ్వకేట్ మిలింద్ పవార్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు.

2023లో లండన్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, సావర్కర్ తన ఐదారుగురు స్నేహితులతో కలిసి ఒక ముస్లిం యువకుడిపై దాడి చేసి ఆనందం పొందానని తన పుస్తకంలో రాసుకున్నారని అన్నట్లు సాత్యకి గుర్తుచేశారు.

# హమాస్‌కు చేరాల్సిన 5.60 లక్షల డాలర్ల క్రిప్టోను స్వాధీనం చేసుకున్న ఎఫ్‌బిఐ



**వాషింగ్టన్,సెప్టెంబరు 2:** హమాస్‌కు అందించేందుకు ఉద్దేశించిన 5.60 లక్షల డాలర్లకు పైగా విలువైన క్రిప్టోకరెన్సీని అమెరికా ఎఫ్‌బీఐ స్వాధీనం చేసుకుంది. హమాస్ నిర్వహిస్తున్న ఆన్‌లైన్ నిధుల సేకరణ, రిక్రూట్‌మెంట్ నెట్‌వర్క్‌పై అమెరికా న్యాయ శాఖ భారీ స్థాయిలో చర్యలు చేపట్టినట్లు ప్రకటించింది. అమెరికా న్యాయ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం హమాస్ నిధుల సేకరణ, మద్దతుదారుల నియామకానికి ఉపయోగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలు వెబ్‌సైట్ డొమైన్లు, కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లను అధికారులు తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో హమాస్‌ను సంప్రదించిన వేలాది మంది వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని కూడా దర్యాప్తు అధికారులు సేకరించారు. అమెరికా డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా అటార్నీ జీనిన్ పిర్రో మాట్లాడుతూ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, క్రిప్టోకరెన్సీలను ఉపయోగించి హమాస్ నిధులు సమకూర్చుకునే సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని తెలిపారు. హమాస్‌కు చెందిన నెట్‌వర్క్‌లు సురక్షితం కావని, వారి క్రిప్టో ఆస్తులు కూడా తమకు అందుబాటులోనే ఉంటాయని, వారి యుద్ధ సామర్థ్యం దెబ్బతినే వరకు చర్యలు కొనసాగుతాయని ఆమె హెచ్చరించారు. ఎఫ్‌బీఐ దాఖలు చేసిన అఫిడవిట్ల ప్రకారం హమాస్ తన సైనిక విభాగమైన అల్‌ఖస్సామ్ బ్రిగేడ్స్ ద్వారా 2019 ప్రారంభంలోనే క్రిప్టోకరెన్సీ ఆధారిత నిధుల సేకరణను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది.

# నేపాల్‌కు వాతావరణ పరిహారం చెల్లించాల్సిందే..

## చైనా, అమెరికా, భారత్‌కు చారిత్రక బాధ్యత ఉందన్న విదేశాంగ మంత్రి

**ఖాట్మండు, సెప్టెంబరు 2:** నేపాల్‌లో సంభవించిన భారీ ఆకస్మిక వరదల్లో 1100 మందికి పైగా మృతి చెందడం, వేలాది మంది గల్లంతవడంతో నేపాల్ అంతర్జాతీయంగా వాతావరణ పరిహారం కోరింది. వాతావరణ మార్పులకు అత్యంత సున్నితంగా ఉన్న నేపాల్ వంటి దేశాలకు పరిహారం చెల్లించాల్సిన చారిత్రక బాధ్యత ప్రపంచంలో అత్యధిక కార్బన్ ఉద్గారాలు విడుదల చేసే దేశాలైన చైనా, అమెరికా, భారత్‌లపై ఉందని నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. చైనాతో సరిహద్దులో ఉన్న నేపాల్‌లోని రసువా జిల్లాలో ఆగస్టు 26న ఈ ఆకస్మిక వరదలు సంభవించాయి. తాజా నివేదికల ప్రకారం ఈ ఘటనలో మొత్తం 1127 మంది మృతి చెందారు. వీరిలో నేపాల్‌లో 987 మంది, చైనా వైపు 16 మంది ఉన్నారు. మరో 4,500 మందికి పైగా ఇంకా ఆచూకీ లభించలేదని ఏఎఫ్‌పీ తెలిపింది. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం, హిమనదం కూలిపోవడంతో భారీ మొత్తంలో నీరు, మట్టి, శిథిలాలు దిగువ ప్రాంతాలకు ఒక్కసారిగా ప్రవహించడం వల్ల ఈ వరదలు సంభవించాయి. ఆ సమయంలో ఆ ప్రాంతంలో వర్షపాతం కూడా నమోదు కాలేదన్నారు.

# మధుమేహానికి రెండు పార్శ్వాలు



మధుమేహం టైప్ డయాబెటిస్ స్త్రీ, పురుష లిద్దరినీ ఒకే రకంగా బాధించవు. దాని వలన కలిగే ప్రభావాలు వేర్వేరుగా ఉంటాయి. లింగ భేదాన్ని బట్టి వారి కొచ్చే ఆరోగ్య సమస్యలకు వేర్వేరు డయాబెటిస్ నిర్ధారణ తర్వాత మహిళలు మానసిక ఆరోగ్య సమస్యలకు ఎక్కువగా గురవుతుండగా, పురుషుల్లో గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధుల ముప్పు అధికంగా ఉన్నట్లు ఒక తాజా అధ్యయనం తేల్చి చెప్పింది. మరోవైపు, పురుషుల్లో గుండె సంబంధిత వ్యాధులు (కార్డియో వాస్కులర్), కిడ్నీ వైఫల్యం (ఎండ్‌స్టేజ్ రీనల్ డిసీజ్), అధిక రక్త పోటు (హైపర్ టెన్షన్) వంటి సమస్యలు ఎక్కువగా నమోదయ్యాయి. అంతే కాకుండా, మహిళలతో పోలిస్తే పురుషుల్లో ఈ సమస్యలు తక్కువ వయసులోనే బయటపడుతున్నట్లు గుర్తించారు. అయితే స్త్రీ, పురుషులిద్దరి లోనూ సాధారణంగా కనిపించిన సమస్య అధిక రక్తపోటు కావడం గమనార్హం. ఈ అధ్యయనం ప్రకారం, డయాబెటిస్ నిర్ధారణ తర్వాత మహిళలు మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. మగ వారితో పోలిస్తే (5.3 ), మహిళల్లో (8.1 ) ఈ సమస్యలు అధికంగా కనిపించాయి. వారు ఆరోగ్య సేవలను ఎక్కువగా వినియోగిం చడం, దీర్ఘకాలిక మందులు వాడటం కూడా ఈ నిర్ధారణ రేట్లు పెరగడానికి ఒక కారణం కావొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ప్రముఖ అంతర్జాతీయ సైన్స్ జర్నల్ 'ప్లాస్ మెడిసిన్'లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమ య్యాయి. లండన్‌లోని క్వీన్ మేరీ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం చేపట్టారు. ఇందుకోసం 2010 నుంచి 2020 మధ్య యూకేలో టైప్ 2 డయాబెటిస్ బారినపడిన 28,720 మంది ఆరోగ్య రికార్డులను విశ్లేషించారు. వ్యాధి నిర్ధారణ అయిన కొన్నేళ్లలో వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. చివరాఖకి ఈ అధ్యయనం తేల్చిందేమిటంటే డయాబెటిస్‌కు మానసిక ఆరోగ్య సమస్యలు తోడైతే, అది స్త్రీ, పురుషులిద్దరి లోనూ అకాల మరణాలకు దారితీస్తుందని పరిశోధకులు తీవ్రంగా హెచ్చరిం చారు. ఈ ఫలితాల నేపథ్యంలో, డయాబెటిస్ చికిత్సా విధానాల్లో వయసు, లింగ భేదాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు సిఫార్సు చేస్తున్నారు. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్న మహిళలకు మానసిక ఆరోగ్యంపై స్క్రీనింగ్ చేయాలి, పురుషుల్లో గుండె, కిడ్నీల ఆరోగ్యంపై మరింత నిశితంగా పర్యవేక్షించాల్సి ఉంటుంది.

# ఏడ్చారని.. భ్రమలో పెట్టద్దు!



ఏదైనా కావాలి అని పిల్లలు ఏడవడం ఆలస్యం.. 'అమ్మమ్మా.. వద్దమ్మా' అని బతిమాలేస్తాం. అన్నం తిన్ననో మరింకెలాగో మొండికేస్తే చాలు కోరిందల్లా తెచ్చి చేతిలోపెడతాం. ఇలాగైతే వాటి విలువ వాళ్లకెలా తెలుస్తుంది? కాబట్టి.. కిందపడో ఏదైనా గాయం తగిలో ఏడుస్తుంటే వాళ్ల ధ్యాస మళ్లించాలినసందే. బుజ్జగించి ఏడుపు ఆపేలా చూడాల్సిందే. వద్దన్న పనిచేసో.. లేదన్న వస్తువు కావాలనో ఏడుస్తోంటే మాత్రం వాళ్లనలా వదిలేయండి. మనసు చివుక్కుమన్నా.. ఆ గోలకి తల నొప్పి వచ్చినా పట్టించుకోవద్దు. అప్పుడే భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం, తమని తాము సంభాళించుకోవడం వంటివి పిల్లలకు తెలుస్తాయి. అలాగే ప్రతి చిన్నదానికీ ఏడుపే పరిష్కారం కాదని తెలుస్తుంది. ఇక అలక! వాళ్లకి వాళ్ల హాని తలపెట్టుకోవడం, ఇంట్లో వస్తువు లను పగులుకొట్టడం వంటివి చేయనంతవరకూ దాన్నీ పట్టించుకోవాల్సిన పనిలేదు. అలాగని అలా చేస్తే ఇవ్వమనీ కాదు. వారించాలి, ఆపడానికి ప్రయత్నించాలి. అంతేకానీ అడిగింది ఇవొవ్వద్దు. అలాకాకుండా అన్నం తినకున్నా, మాట్లాడకుండా కూర్చున్నా, కిందపడి ఏడుస్తున్నా పట్టించుకోవద్దు. లేదంటే 'ఇలా చేస్తేనే కావాల్సినవి వస్తా'యన్న భ్రమలోకి వెళ్లిపోతారు. తీరా పెద్దయ్యాక మార్చా లన్నా కష్టమే కాబట్టి, వదిలేయండి. అంతకుముందు ఇస్తానన్నవీ ఇవ్వొద్దు. అప్పుడు గోలచేస్తే అడిగినవి రాకపోగా.. వచ్చేవీ దక్కకుండా పోతాయని అర్థమవుతుంది.

# ఇంటి తోట కోసం..

ఆరోగ్య కారణాల రీత్యా నేడు అందరి ఇళ్లలో మిద్దెతోటలు, బాల్కనీ తోటలంటూ చాలా మొక్కలను పెంచుతున్నారు. వీటిలో కొన్ని ఆలంకరణ కోసం అయితే, మరికొన్ని ఆరోగ్యం కోసం. మనల్ని సంరక్షించే ఈ మొక్కలు ఆరోగ్యంగానే ఉన్నాయా..! అని ఎప్పుడైనా ఆలోచించారా? వాటిని కాపాడేందుకు సహజ ఎరువులను ఇంట్లోనే ఎలాతయారు చేసుకోవాలో తెలుసుకుందామా.. !

**అరటి తొక్కల నీళ్లు..** మన ఇంట్లో అరటి పండ్లు తిన్న తొక్కలను ముక్కలుగా కోసి ఒక బకెట్ లేదా బాటిల్‌లో వేసి నిండుగా నీటిని నింపాలి. వీటిని ఒక రాత్రంతా నిల్వ చేసి మరుసటి రోజు మొక్కలపై పిచికారీ చేసినా.. మొక్క ఉండే కుండీలో వేసినా అవి ఆరోగ్యంగాపెరుగుతాయి. క్రిమికీటకాలు దరిచేరవు.

**నిమ్మనీరు..** ఇంట్లో వాడేసిన నిమ్మ చెక్కలను బకెట్‌లో వేసి రెండురోజుల తరవాత తొక్కలను వడకట్టాలి. ఈ నీటిని మొక్కలకు అందించాలి. ఇలా చేయడం వల్ల నేలలో పిహెచ్ స్థాయిలు స్థిరంగా ఉంటాయి. వేర్లకు పురుగు పట్టకుండా మొక్కలను కాపాడుతుంది. నిమ్మకి బదులు నారింజ తొక్కలను కూడా వాడవచ్చు.

# వ్యథ ప్రేమవేరు జీవితం వేరు !



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు




ప్రశ్న :నాకు 28 ఏళ్లు. బెంగుళూరులోని ఓ మల్టీనేషనల్ కంపెనీలో ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తున్నాను. మా కంపెనీలో పనిచేసే వ్యక్తిని ప్రేమించాను. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించు కున్నాం. కులం వేరు కావడంతో మొదట మా తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పినా, తరువాత అంగీకరించారు. అయితే అతనిది విచ్చిన్న కుటుంబం. అతని తల్లి భర్తను వదిలి మరొక వ్యక్తితో వెళ్లి, తరువాత అతడిని కూడా వదిలేసింది. ప్రస్తుతం ఒంటరిగా ఉంటోంది. అతని తమ్ముడు ఓ అత్యాచారం కేసులో నిందితుడని తెలిసింది. అతనికి మద్యం అలవాటు కూడా ఉంది. నేను ఫోన్ సమయానికి లిఫ్ట్ చేయకపోతే పదేపదే ఫోన్ చేసి ఆందోళన చెందుతారు. ఈ విషయాలు తెలిసిన తరువాత అయోమయంగా ఉంది. విచ్ఛిన్న కుటుంబం నుంచి వచ్చిన వారిలో ప్రవర్తనా లోపాలు ఉంటా యని స్నేహితులు చెబుతు న్నారు. ఈ నేపథ్యంలో మంచి సలహా ఇవ్వండి.

- ఒక సోదరి, చిత్తూరు

జవాబు: విచ్ఛిన్న కుటుంబంలో పుట్టడం ఎవరి తప్పు కాదు. తల్లిదండ్రుల వైవాహిక జీవితం ఆధారంగా వారి పిల్లల వ్యక్తిత్వాన్ని నిర్ణయించడం సరికాదు. అలాగే తమ్ముడు కేసులో నిందితుడై నందుకు అన్నను తప్పుబట్టలేం. కాబట్టి కుటుంబ నేపథ్యం ఒక్కటే పెళ్లిని తిరస్కరించడానికి కారణం కాకూడదు. అయితే మద్యం అలవాటు, మీ ఫోన్ విషయంలో అతని ప్రవర్తనను మాత్రం నిర్లక్ష్యం చేయకండి. మీరు ఫోన్ ఎత్తకపోతే ఆందోళన చెందడం ప్రేమ కావచ్చు. కానీ పదేపదే ఫోన్ చేయడం, అనుమానించడం, మీ వ్యక్తిగత స్వేచ్ఛను నియంత్రించడం అలవాటుగా మారితే అది హెచ్చరిక. పెళ్లికి ముందు అతని మద్యం అలవాటు ఎంతవరకు ఉందో, కోపం వచ్చినప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో, మీ ఉద్యోగం, స్నేహితులు, వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవిస్తాడో తెలుసుకోండి. ఆర్థిక బాధ్యతలు, కుటుంబ సభ్యుల జోక్యం, భవిష్యత్ జీవితం గురించి కూడా స్పష్టంగా మాట్లాడుకోండి. ప్రేమ కంటే ముఖ్యమైనది పరస్పర గౌరవం, నమ్మకం, బాధ్యత. అతను తన అలవాట్లను మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాడా? మీ పరిమితులను గౌరవిస్తున్నాడా? అన్నదే అసలు పరీక్ష. కాబట్టి తొందరగా పెళ్లి నిర్ణయం తీసుకోకుండా కొంతకాలం అతని ప్రవర్తనను గమనించండి. వీలైతే పెళ్లికి ముందు కౌన్సెలింగ్ తీసుకోండి. కుటుంబ నేపథ్యం చూసి ప్రేమను వదులుకోవద్దు. కానీ ప్రేమ పేరుతో కనిపిస్తున్న హెచ్చరికలను కూడా విస్మరించవద్దు. ప్రేమ కంటే జీవితం ముఖ్యం కాబట్టి, పెళ్లికి ముందే జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

# సాయిలీలా విలాసాలు



శిరిడీలో సాయిబాబా నివసించే రోజుల్లోనే ఆయన మహిమలు ఒక్కొక్కటిగా వెలుగు చూశాయి. అయితే ఆయన ఎప్పుడూ కూడా కావాలని తన మహిమలు చూపలేదు. భక్తులను ఆదుకోవడానికి ఆయన చేసిన ప్రయత్నాలే .. లీలా విశేషాలుగా మారాయి. తనని విశ్వసించే భక్తులు ఎక్కడ .. ఎలాంటి పరిస్థితుల్లో వున్నా, వాళ్లని గట్టెక్కిస్తూ వచ్చాడు. అందువల్లనే భక్తులు తమ గ్రామాల్లో .. కాలనీలలో ఆయన ఆలయాలు నిర్మిస్తూ వస్తున్నారు. అలా భక్తుల సంకల్పం కారణంగా నిర్మించిన బాబా ఆలయాలలో ఒకటిగా, ఖివట్టిపర్తిఖి కనిపిస్తుంది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం పరిధిలో ఈ ఆలయం దర్శనమిస్తుంది. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారికి దగ్గరలో ఈ ఆలయం కనిపిస్తుంటుంది. సువిశాలమైన ప్రదేశంలో అందంగా తీర్చిదిద్దబడిన ఆలయంలో బాబా అభయాన్నిస్తూ దర్శనమిస్తూ ఉంటాడు. ప్రశాంతమైన వాతావరణంలో నిర్మించబడిన ఈ ఆలయానికి గ్రామస్తులతో పాటు, ఆ మార్గంలో ప్రయాణించే భక్తులు ఎక్కువగా వస్తుంటారు. బాబా దర్శనం వలన మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా, ఆపదలు .. ఆటంకాలు తొలగిపోతాయని చెబుతుంటారు.


# పుచ్చకాయ మజ్జిగ పులుసు



తయారీ విధానం: ముందుగా పుచ్చకాయలో ఎరుపు రంగు ముక్కలు తరిగి పక్కన పెట్టేయాలి. పైన తెలుపు లేదా ఆకుపచ్చ రంగులో ఉండే ముక్కనే మనం మజ్జిగ పులుసు కోసం వాడతాం. పుచ్చకాయపై చెక్కు తీసేసి కాస్త మీడియం సైజు ముక్కలుగా తరగాలి. దాన్ని కుక్కర్లో వేసి కొంచెం ఉప్పు పసుపు జోడించి ఉడికిం చాలి. ఇప్పుడు మజ్జిగలో అల్లం, పచ్చిమిర్చి, కొబ్బరి ముద్ద, జీలకర్ర, ధనియాల పొడి, శనగపిండి, బియ్యప్పిండి, మజ్జిగకు సరిపడా ఉప్పు వేసి బాగా కలపాలి. ఇందాక ఉడికించిన ముక్కలను చల్లారబెట్టి మజ్జిగలో వేయాలి. కొత్తిమీరను సన్నగా తరిగి పక్కకు పెట్టుకోవాలి. ఇప్పుడు అన్నీ కలిపిన మజ్జిగను పొయ్యి మీద పెట్టాలి. కాస్త మరుగుతుండగా తరిగిన కొత్తిమీరను వేయాలి. రెండు నిమిషాలు ఆగి పొయ్యి ఆపేయాలి. చిన్న మూకుట్లో కొద్దిగా నూనె వేసి, వేడయ్యాక పోపుగింజలు వేసి చిటపటలాడనివ్వాలి. అందులో ఎండు మిరపకాయలను ముక్కలుగా చేసి వేసి చివర్లో కాస్త ఇంగువ, కరివేపాకు వేయాలి. ఇందాక చేసుకున్న మజ్జిగలో ఈ పోపు వేస్తే పుచ్చకాయ మజ్జిగ పులుసు రెడీ!!

తెర

# 'రోమాంచకం' ఒక ఫ్రెష్ లవ్ స్టోరీ: సుమంత్ ప్రభాస్




బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా 'రోమాం చకం', సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్‌గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా ఈ నెల 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. మా మూవీ కోసం ప్రభాస్‌ని కలవడం చాలా హ్యాపీగా అనిపించింది. నా గతం, నా జర్నీ అంతా ఒక్కసారిగా గుర్తుకువచ్చింది. ఆయనను కలిసే ముందు ఒక ఎక్స్ పెక్టేషన్‌తో వెళ్లాం. ప్రభాస్‌చాలా బాగా రిసీవ్ చేసుకున్నారు. మన ఫ్యాన్ బాయ్ అనే ప్రేమ ఆయనలో కనిపించింది. మా కుటుంబంలో ఎవరికీ సినిమా నేపథ్యం లేదు. తెలంగాణ నేపథ్యంతో మేమ్ ఫేమస్ అనే సినిమా చేశాను. ఇక్కడి ఆడియెన్స్ బాగా చూశారు. ఆంధ్ర నేపథ్యంతో గోదారిగట్టుపైన సినిమా చేశాను. ఇంజినీ రింగ్ కంప్లీట్ చేసి ఒక స్టార్టప్ కంపెనీ పెట్టాలని ప్రయత్నించే యువకుడిగా ఈ చిత్రంలో కనిపిస్తాడు. ఆ క్యారెక్టర్ క్యూట్‌గా, ఇన్నోసెంట్‌గా ఉంటుంది. రోమాంచకం సినిమా ఆరేళ్ల నుంచి అరవై ఏళ్ల వరకు ఎవరైనా చూసి ఒకేలా ఎంజాయ్ చేస్తారు. ఫ్యామిలీస్‌తో ఫ్రెండ్స్‌తో ఎవరితో అయినా ఈ మూవీని చూడొచ్చు. నేను హీరోగా రెండు సినిమాలు చేసినా డైరెక్టర్ వేణుగోపాల్ గారు ఆయనకు ఈ క్యారెక్టర్ కు ఎలా ఉండాలో అలా మార్చుకునేందుకు ఆర్నెళ్లు వర్క్ షాప్స్ కండక్ట్ చేశారు. ఈ క్యారెక్టర్ లో ఎలా నటించాలి అనేది నాకు ఐడియా ఉంది. కానీ వర్క్ షాప్స్ తో షార్ప్ అయ్యాను. సందీప్ అన్న ఒక అవార్డ్ ఫంక్షన్ లో కలిసి ఒక క్యూట్ స్టోరీ ఉంది నువ్వు విను అన్నారు. ఆయన చెప్పాడంటే తప్పకుండా బాగుంటుందని కథ విన్నాను. వేణు అన్న చెప్పిన నెరేషన్ రెండున్నర గంటలు ఎంజాయ్ చేశాను. సందీప్ అన్న, ప్రణయ్ అన్న బయటకు అలా కనిపిస్తారు కానీ వాళ్లు చాలా స్వీట్ పర్సన్స్. వాళ్లతో ట్రావెల్ అయిన వాళ్లకు తెలుస్తుంది. హ్యాపీగా అనిపించింది. విజయ్ దేవరకొండ అన్న మా మూవీ ప్రీ రిలీజ్ కు రావడం చాలా హ్యాపీగా అనిపించింది.

# 'బెత్లెహెం కుడుంబ' చిత్రం ప్రిరిలీజ్ ఈవెంట్



నివిన్ పౌలీ, మమితా బైజు జంటగా నటించిన లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ బెత్లెహెం కుడుంబ యూనిట్. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవల మలయాళంలో విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4న తెలుగులో గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ప్రీరిలీజ్ ఈవెంట్ లో నిర్మాత, హీరో ఫహద్ ఫాసిల్ మాట్లాడుతూ. ఈ మధ్యకాలంలో నేను హైదరాబాద్‌కు తరచూ వస్తున్నాను. ఇది నాకు నా సొంత ఊరులా మారింది. ఇక్కడి ప్రేక్షకుల ప్రేమ, అభిమానం నాకు ఎంతగానో సంతోషాన్ని ఇస్తున్నాయి. హీరో నివిన్ పౌలీ మాట్లాడుతూ.. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. తెలుగులో రిలీజ్ అవుతున్న నా ఫస్ట్ ఫిల్మ్. తెలుగు ఆడియన్స్ ముందుకు ఈ సినిమాను తీసుకొ స్తున్న మైత్రీ మూవీ మేకర్స్‌కు ధన్యవాదాలు. నిర్మాత రవి శంకర్ మాట్లాడుతూ.. బెత్లెహెం కుడుం' యూనిట్ ఇప్పటికే సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. నైజాంలో మేము మలయాళం వెర్షన్ రిలీజ్ చేశాము. ఆ మలయాళం వెర్షన్ దాదాపు 60 లక్షలు గ్రాస్ చేసింది. మనకి ఇరుముడిలాగా ఈ సినిమా మలయాళంలో 200 కోట్లు కలెక్ట్ చేసింది. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ.. ఈ సినిమా మలయాళంలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అదే హిట్ ఇక్కడ కూడా కొనసాగుతుందని నమ్ముతున్నాము. డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సినిమా మలయాళం వెర్షన్‌లో అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. డైరెక్టర్ గిరీష్ ఏడీ మాట్లాడుతూ.. తెలుగు ఆడియన్స్ అంటే మాకు చాలా గౌరవం. ప్రేమలు సినిమాకు మీరు ఎంతో ప్రేమను ఇచ్చారు. మీకు ఈ సినిమా కూడా నచ్చుతుందని నమ్ముతున్నాను. శ్యామ్ మోహన్ మాట్లాడుతూ..నేను తెలుగులో ఒక సినిమా చేస్తున్నాను.

# 'రంభ ఊర్వశి మేనక'తో హ్యాపీగా నవ్వుకుంటారు: అల్లరి నరేష్



**ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?**

నాది చాలా ఎంటర్టైనింగ్ ఉండే క్యారెక్టర్. అందరి దగ్గర అప్పులు చేసి ఉంటాడు. తనని ఎవరు ఊర్లో నమ్మరు. అందరూ కొంచెం నెగిటివ్‌గా అనుకునే క్యారెక్టర్. తనకి చాలా కష్టాలు వస్తుంటాయి.

**ఇందులో కామెడీ ఎలా ఉండబోతోంది?**

ఆడియన్స్ కామెడీని చూసే విధానం మారింది. నా బడీ లాంగ్వేజ్ సరిపడే కామెడీని డైరెక్టర్ డిజైన్ చేశారు. అలాగే స్వర్గం, నరకం, ఇంద్రలోకం ఇలాంటి కథలు చూసి చాలా కాలం అయింది. కచ్చితంగా ఆడియన్స్, అలాగే చిన్నపిల్లలు చాలా ఎక్సైట్ అవుతారు. .

**వెన్నెల కిషోర్, శ్రీనివాస్ రెడ్డి క్యారెక్టర్స్ గురించి?**

శ్రీనివాస్ రెడ్డి గారు, పెద్ద నరేష్ గారు కలిసి నాతో ట్రావెల్ అవుతుంటారు. మా మధ్య కామెడీ చాలా హిలేరియస్‌గా ఉంటుంది. అలాగే కిషోర్ , అజయ్ గారు, తారక్ పొన్నప్ప చాలా క్యారెక్టర్లు ఉన్నాయి. అన్నీ కూడా చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటాయి. వెన్నెల కిషోర్ గారిది చాలా ఫన్ క్యారెక్టర్. చాలా కొత్తగా ఉంటుంది. ఇంద్రుడు కూడా ఇంగ్లీష్ మాట్లాడే క్యారెక్టర్. మధ్య మధ్యలో హిందీలో కూడా వస్తుంటాయి. ఎందుకంటే దేవుడికి అన్ని భాషలు వస్తాయి కదా.

**దర్శకత్వం చేయాలని ఆలోచన ఉందా?**

ప్రస్తుతానికి నా దృష్టి మొత్తం నటనపైనే ఉంది. నటుడిగా మంచి విజయవంతమైన చిత్రాలు చేయడం పైన నా దృష్టి ఉంది.

**సుడిగాడు 2 సీక్వెల్ గురించి?**

"సుడిగాడు 2 చేయాలని నాకూ ఉంది. కాకపోతే ఒకప్పటి పరిస్థితులకి, ఇప్పుడు పరిస్థితులకి చాలా మార్పులు వచ్చాయి.

**ఇప్పటి యంగ్ డైరెక్టర్స్ లో ఎవరితో సినిమా చేయాలని ఉంది?**

నాకు రితేష్ రానా స్టైల్ చాలా నచ్చింది."మత్తు వదలరా సినిమా నాకు చాలా ఇష్టం. ఆయన కథల్లో చాలా డీటెయిల్‌గా ఉంటుంది.

**"'మహర్షి' తర్వాత మీ నుంచి ఎక్కువగా మల్టీస్టారర్స్ రాలేదనిపిస్తుంది?**

శంభో శివ శంభో నుంచి మల్టీస్టారర్ కథలలో చేస్తున్నాను. అలాంటి మంచి కథలతో దర్శకులు వచ్చినప్పుడు ఖచ్చితంగా చేస్తాను. .

**చేతన్ భరద్వాజ్ మ్యూజిక్ గురించి?**

తనతో ఫస్ట్ టైమ్ ఈ సినిమా చేస్తున్నాను. తను మంచి ట్రెండ్‌లో ఉన్న మ్యూజిక్ డైరెక్టర్. ఇందులో నాకు సురభికి ఒక సాంగ్ ఉంది.

# 'మా రాముడు అందరివాడు' మంచి విజయం సాధిస్తుంది : సుమన్




'మా రాముడు అందరివాడు' దమ్మున్న సినిమా : హీరో శ్రీరామ్‌మా రాముడు అందరివాడ్ను చిత్రంలోని ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ అందరికీ కనెక్ట్ అవుతుంది: చిత్ర దర్శకుడు యుద్ధనపూడి మైకిల్ 'మా రాముడు అందరివాడు' చిత్ర విజయంపై నమ్మకంగా ఉన్నాం : నిర్మాత, విలన్ లక్ష్మణరావుఅనుముల ప్రొడక్షన్స్, శ్రీరామ్ క్రియేషన్స్ బ్యానర్లపై అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మిస్తున్న చిత్రం"మా రాముడు అందరివాడ్ను. యద్దనపూడి మైకిల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీరామ్, స్వాతి మందాడి జంటగా నటించారు. సుమన్, సమ్మెట గాంధీ, నాగ మహేష్, బాహుబలి ప్రభాకర్ కీలక పాత్రల్లో నటించారు. ఆనంద భారతి, గడ్డం నవీన్, చిట్టిబాబు, గోల్డ్ రెడ్డి ఇతర పాత్రలు పోషించారు. సెప్టెంబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు సుమన్ మాట్లాడుతూ ..సినీ ఇండస్ట్రీలో గ్లామర్ కంటే టాలెంట్ ముఖ్యమని ఇప్పటికే చాలామంది నిరూపించారు. ఈ సినిమా హీరో శ్రీరామ్‌లో కూడా మంచి టాలెంట్ ఉంది. డ్యూయెల్ రోల్‌లో ఆయన పెర్ఫార్మెన్స్ బాగా చేశారు. నిర్మాత అనుముల లక్ష్మణరావు మాట్లాడుతూ.. మా సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది. ఈ చిత్రాన్ని నిర్మిస్తూనే, ఇందులో విలన్ పాత్ర పోషించా. ఫస్టాఫ్‌లో వైల్డ్ విలన్‌గా కనిపిస్తా. దర్శకుడు యుద్ధనపూడి మైకిల్ మాట్లాడుతూ.. దాదాపు పద్నాలుగు నెలలు ఈ సినిమాతో జర్నీ చేశాం. ఎన్నో అవాంతరాలు ఎదుర్కొని అవన్నీ దాటుకుని సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకొస్తున్నాం.

# 'దేవరాయ' శ్రీకృష్ణదేవరాయగా కిచ్చా సుదీప



అభినయ చక్రవర్తి కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ స్పెక్టాకిల్ ' దేవరాయ' టైటిల్ అనౌన్స్‌మెంట్ చేశారు మేకర్స్. విజయనగర సామ్రాజ్యంలోని దిగ్గజ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయగా కిచ్చా సుదీప్‌ను మేకర్స్ మజెస్టిక్ అవతార్‌లో పరిచయం చేశారు. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుప్రియన్వి పిక్చర్ స్టూడియోపై ప్రియ సుదీప్ సమర్పిస్తున్నారు. ' దేవరాయ' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో సినిమా ప్రపంచాన్ని అద్భుతంగా పరిచయం చేస్తోంది. భారీ స్థాయిలో, చారిత్రక వైభవంతో తెరకెక్కుతున్న సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. విజువల్స్‌తో పాటు గౌర హరి అందించిన పవర్‌ఫుల్, మజెస్టిక్ స్కోర్ అనుభూతిని మరింత ఎలివేట్ చేసింది. రాజసంతో కూడిన అవతార్‌లో సుదీప్ అద్భుతమైన ఇంపాక్ట్ చూపించారు. అద్భుతమైన సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన ఆయన.. ప్రత్యేకంగా డిజైన్ చేసిన కిరీటం, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో, పోస్టర్‌లోని విజువల్ డీటెయిలింగ్ ఆకట్టుకుంటోంది. 'చరిత్రను మలిచిన సామ్రాజ్యం. ఒక యుగాన్ని నిర్వచించిన రాజు. కాలాన్ని దాటి జీవించే ఒక లెజెండ్.'అనే మూడు శక్తివంతమైన ఆలోచనలతో మేకర్స్"దేవరాయ్ను ను పరిచయం చేశారు. తన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రల్లో ఇంటెన్సిటీని చూపించే నటుడిగా గుర్తింపు పొందిన సుదీప్.. ఈ పాత్ర కోసం మజెస్టిక్‌గా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. ఆయన ఫస్ట్ లుక్‌లో రాజసం, పవర్, గౌరవం అద్భుతంగా కనిపిస్తున్నాయి. గ్రాండ్ విజువల్ ట్రీట్‌మెంట్ మరింత వైభవంగా ఉంది. 2027 డిసెంబర్‌లో ఈ చిత్రం థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది, మేకర్స్ ప్రమోషనల్ జర్నీని గ్రాండ్‌గా ప్రారంభించారు.

# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' నాలుగో పాట 'సబ్‌కో' విడుదల



ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్"ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్థ్ నుంచి నాలుగో పాట 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' నాలుగో పాటగా 'సబ్‌కో' విడుదలసబ్‌కో' నేడు విడుదలైంది. ఇప్పటికే సినిమాపై, ఆల్బమ్ లోని పాటలపై మంచి ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో విడుద లైన ఈ పాట మరింత ఉత్సాహభరితమైన మ్యూజికల్ ఫ్లేవర్‌ను అందిస్తోంది. అత్యంత ప్రతిభావంతుడైన సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరిచిన 'సబ్‌కో' పాటను సంజిత్ హెగ్డే, సితార కృష్ణ కుమార్ ఆలపించారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించిన ఆకట్టుకునే స్వరకల్పన పాటకు ప్రత్యేకమైన, ఆహ్లాదకరమైన వైబ్‌ను తీసుకొచ్చింది. ఈ పాటకు శ్రీ హర్ష ఇమాని సాహిత్యం అందించారు. గుంటూరులోని జుజుగి కాలేజీలో విద్యార్థుల ఉత్సాహభరిత సమక్షంలో సబ్‌కో పాటను విడుదల చేశారు. విద్యార్థుల సందడి, ఉత్సాహంతో పాట లాంచ్ కార్యక్రమం ఎంతో జోష్‌గా, ప్రత్యేకంగా జరిగింది. ఇప్పటికే"ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్థ్‌కు సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్ సోషల్ మీడియాలో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తుండగా, తాజాగా విడుదలైన"సబ్‌క్తో పాట ఆ క్రేజ్‌ను మరింత పెంచుతోంది. ప్రస్తుతం చిత్ర బృందం విస్తృత స్థాయిలో ప్రమోషన్స్ నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు కాలేజీలు, నగరాలను సందర్శిస్తూ విద్యార్థులతో ప్రత్యేకంగా మమేకమవుతున్నారు. మరోవైపు వరుసగా ప్రమోషనల్ ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నారు. చిత్ర బృందం చేస్తున్న ఈ విస్తృత ప్రచారం సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానున్న ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్‌పై మరింత ఆసక్తిని పెంచుతోంది.

## లండన్ స్క్వాష్ క్లాసిక్: ప్రీక్వార్టర్స్‌లోకి
# అనాహత్, రామిత్

**లండన్:** భారత ఆటగాళ్లు అనాహత్ సింగ్, రమిత్ టాండన్‌లు తమ లండన్ స్క్వాష్ క్లాసిక్ ప్రచారాన్ని విజయవంతంగా ప్రారంభించారు. పీఎస్ఏ గోల్డ్ టోర్నమెంట్‌లో వరుస గేమ్‌లలో విజయం సాధించి ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, వీర్ చోత్రాని బుధవారం జరిగిన తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. మహిళల ప్రపంచ ర్యాంకింగ్‌లో 20వ స్థానంలో ఉన్న, ప్రస్తుత జూనియర్ ప్రపంచ ఛాంపియన్ అనాహత్ ఆధిపత్య ప్రదర్శన కనబరిచింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 30వ స్థానంలో ఉన్న ఈజిప్ట్ క్రీడాకారిణి మెట్వాలీని 11-3, 11-2 తేడాతో ఓడించడానికి ఆమెకు కేవలం 11 నిమిషాలు మాత్రమే పట్టింది. అనాహత్ ప్రారంభం నుండే ఆటపై పట్టు సాధించి, మెట్వాలీకి ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు.

మొతటి గేమ్‌ను వేగంగా గెలుచుకున్న అనాహత్ రెండో గేమ్‌లో కూడా అంతే ఆధిపత్యం ప్రదర్శించి తదుపరి రౌండ్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఇక పురుషుల విభాగంలో





ప్రపంచ 42వ ర్యామిత్ టాండన్ కూడా ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా ముందంజ వేశాడు. 20 నిముషాల పాటు జరిగిన తొలి రౌండ్ పోరులో ఖతార్ కు చెందిన అబ్దుల్లా అల్-తమీమిని 11-6, 11-7 తేడాతో ఓడించాడు. రెండు గేమ్‌లలోనూ ఆధిపత్యం కొనసాగించిన టాండన్, ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. అయితే, ప్రపంచ 38వ ర్యాంకర్ వీర్ చోత్రానీకి నిరాశ ఎదురైంది. హోరా హోరీగా జరిగిన స్ట్రెయిట్‌గేమ్ పోరులో స్విట్జర్లాండ్‌కు చెందిన యానిక్ విల్హెల్మీ చేతిలో అతను స్వల్పతేడాతో ఓడిపోయాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 34వస్థానంలో ఉన్న విల్హెల్మి, రెండు గేమ్‌లను కూడా 11-9 అనే ఒకే విధమైన తేడాతో గెలుచుకుని, చోత్రాని కెరీర్‌కు అకాల ముగింపు పలికాడు.

# చైనా మాస్టర్స్‌లో శ్రీకాంత్ ముందంజ

**షెన్‌జెన్ (చైనా):** చైనా మాస్టర్స్ 2026లో భారత్ క్రీడాకారులు కిదాంబి శ్రీకాంత్ రౌండ్ 16కి చేరుకోగా, ఓటమితో లక్ష్యసేన్ టోర్నీ నుండి నిష్క్రమించాడు. ప్రపంచ మాజీ నంబర్ 1 కిదాంబి శ్రీకాంత్, బుధవారం చైనాలోని షెన్‌జెన్‌లో జరుగుతున్న టోర్నమెంట్ మొదటి రౌండ్‌లో ప్రపంచ నంబర్ 21 చి యు జెన్‌ను 21-16, 21-15 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించి, బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో తన మొదటి విజయాన్ని నమోదు చేసుకున్నాడు. ఇక భారత షట్లర్ లక్ష్యసేన్‌పై 21-14, 21-17 తేడాతో సునాయాసంగా స్ట్రెయిట్ గేమ్స్‌లో విజయం సాధించి విక్టర్ రెండో రౌండ్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. మరోవైపు, భారత అగ్రశ్రేణి పురుషుల డబుల్స్ జోడీ సత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు మలేషియాకు చెందిన ఆరిఫ్‌కాంగ్‌పై 21-11, 21-16 తేడాతో విజయం సాధించి తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్‌లో, తన్వి శర్మ కూడా డెన్మార్క్‌కు చెందిన అమలీ షుల్జ్‌ను 21-16, 21-17 తేడాతో ఓడించి ఘన విజయంతో ప్రారంభించింది. అయితే, దేవికా సిహాగ్ బల్గేరియాకు చెందిన కలోయానా నల్బంటోవా చేతిలో 18-21, 15-21 తేడాతో ఓటమి పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో, భారత జంట ధ్రువ్ కపిల, తనిషా క్రాస్టోలు యువ థాయ్ జంట టోన్‌రుగ్ సేహెంగ్, టోన్‌కిడ్ సేహెంగ్‌లపై 21-8, 21-9 తేడాతో ఆధిపత్యం చెలాయించి విజయం సాధించారు. మరో మిక్స్‌డ్ డబుల్స్ జంట రుత్విక గద్దె, రోహన్ కపూర్‌లు చైనీస్ తైపీ జంట గువాన్ జున్ వు, లీ చియా సిన్‌ల చేతిలో 16-21, 18-21 తేడాతో ఓడిపోయి మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు.






## టెస్టు ర్యాంకింగ్స్‌లో..
## గిల్, బుమ్రాకు
# షాక్
## అత్యుత్తమ ర్యాంక్‌లో రిషబ్ పంత్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వరుసగా రెండో వారం కూడా ఒక స్థానాన్ని కోల్పోయాడు. గత మూడు టెస్టు మ్యాచ్‌లకు దూరంగా ఉండటంతో బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో బుమ్రా మూడో స్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ బుమ్రాను అధిగమించి రెండో స్థానానికి చేరుకున్నాడు. ఇక శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌లో రాణించలేకపోయిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ర్యాంకింగ్స్‌లో ప్రతికూల ఫలితాన్ని ఎదుర్కొన్నాడు. సిరీస్‌లోని మూడు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 74 పరుగులు మాత్రమే సాధించడంతో గిల్ రెండు స్థానాలు దిగజారి తొమ్మిదో ర్యాంక్‌కు పడిపోయాడు. ప్రస్తుతం టెస్టు బ్యాటింగ్ విభాగంలో ఏడో స్థానంలో ఉన్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ మాత్రమే భారత్ నుంచి అత్యుత్తమ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. అలాగే పాకిస్థాన్‌తో జరిగిన రెండో టెస్టులో ఇంగ్లాండ్ పేసర్ ఆలీ రాబిన్సన్ సంచలన బౌలింగ్‌తో ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించడంతో బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నేరుగా ఐదో స్థానానికి చేరుకున్నాడు. భారత్‌పై టెస్టు విజయంలో కీలక పాత్ర పోషించిన శ్రీలంక ఆటగాడు సోనాల్ దినుషా బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 29 స్థానాలు ఎగబాకి 25వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. బ్యాటింగ్ విభాగంలో హ్యారీ బ్రూక్ నంబర్1 స్థానంలో కొనసాగుతుండగా, జో రూట్ ఒక స్థానం కోల్పోయి మూడో స్థానానికి పడిపోయాడు.

# రోహిత్ శర్మ ఎంట్రీ, హార్దిక్ ఔట్
## ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా తిలక్









**న్యూఢిల్లీ:** వచ్చే ఐపీఎల్ టోర్నీలో ముంబై ఇండియన్స్ జట్టు సత్తా చాటేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కెప్టెన్సీ బాధ్యతల నుంచి హార్దిక్ పాండ్యాను తప్పించి కొత్తవారికి అవకాశం కల్పించేలా చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తిలక్ వర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఐపీఎల్ టోర్నీలో ముంబై ఇండియన్స్ జట్టు వరుస వైఫల్యాలతో ఇప్పటికే తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. హార్దిక్ పాండ్య సారథ్యంలో ఆ జట్టు ఘోరంగా వైఫల్యం చెందింది. అయితే, వచ్చే ఐపీఎల్ టోర్నీ నాటికి ముంబై ఇండియన్స్ జట్టును బలోపేతం చేసే దిశగా ఫ్రాంఛైజీ చర్యలు చేపట్టింది.

కెప్టెన్‌గా కొత్తవారిని ఎంపిక చేసేందుకు ముంబయి కసరత్తు చేస్తోందని సమాచారం. ఈ క్రమంలో కెప్టెన్సీ బాధ్యతల నుంచి హార్దిక్ పాండ్యాను తప్పించి కొత్తవారికి అవకాశం కల్పించేలా చర్చలు జరుగుతున్నాయి. ఇదే సమయంలో జట్టు నాయకుడి రేస్‌లో తిలక్ వర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆ బాధ్యతలను రోహిత్ శర్మ తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్త కెప్టెన్ ఎంపికలో రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఈ క్రమంలో అతను రెండు పేర్లను జట్టు యాజమాన్యంకు సూచించినట్లు సమాచారం. అందులో సీనియర్ ప్లేయర్ జస్ప్రీత్ బుమ్రా, యువ ఆటగాడు తిలక్ వర్మ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, బుమ్రా కంటే తిలక్ వర్మవైపు జట్టు యాజమాన్యం మొగ్గు చూపుతున్నట్లు వెల్లడైంది. జట్టు దీర్ఘకాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తిలక్ వర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తేనే బాగుంటుందని రోహిత్ శర్మతో పాటు, జట్టు యాజమాన్యం సైతం భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. దీంతో రాబోయే ఐపీఎల్ టోర్నీలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ గా తిలక్ వర్మ బాధ్యతలు చేపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మరోవైపు హార్దిక్ పాండ్యా ట్రేడ్ విషయంలో ముంబై ఇండియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్ తో చర్చలు జరిపడం విశేషం. ఆ చర్చల్లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ను డీల్‌లో భాగంగా తీసుకునే ప్రతిపాదన వచ్చినట్లు తెలుస్తోంది. అయితే గ్రీన్ వర్క్‌లోడ్‌పై ఆందోళనల కారణంగా ముంబై ఆ ప్రతిపాదనపై ఆసక్తి చూపలేదని నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో హార్దిక్‌ను ట్రేడ్ చేయకుండా ఆటగాడిగా జట్టులో కొనసాగించి, కెప్టెన్సీ మరొకరికి అప్పగించాలని ముంబయి ఫ్రాంఛైజీ భావిస్తున్నట్లు చర్చ సాగుతోంది.

## యుఎస్ ఓపెన్: రెండో రౌండ్‌కు
# కోకో గౌఫ్, మిర్రా ఆండ్రీవా



**న్యూయార్క్:** యుఎస్ ఓపెన్‌లో కోకో గౌఫ్, మిర్రా ఆండ్రీవా రెండో రౌండ్‌కు చేరుకున్నారు. నాలుగో సీడ్ కోకో గాఫ్, పట్టుదల గల టర్కీ క్రీడాకారిణి జెనెప్ సోన్మెజ్‌పై 6-3, 6-4 తేడాతో సునాయాసంగా విజయం సాధించి, రెండో రౌండ్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుని తన యూఎస్ ఓపెన్ ప్రయాణాన్ని ప్రారంభించింది. తన ఎనిమిదవ యూఎస్ ఓపెన్ మెయిన్ డ్రాలో పోటీ పడుతున్న 22 ఏళ్ల అమెరికన్ క్రీడాకారిణి, అద్భుతమైన ఫామ్‌తో ఈ టోర్నమెంట్‌లోకి అగ్రశ్రేణి పోటీదారులలో ఒకరిగా ప్రవేశించింది. ఈ టోర్నమెంట్‌లో సోన్మెజ్‌పై గౌఫ్ అద్భుతంగా ప్రారంభించింది, తన తొలి సర్వీస్ గేమ్‌లోనే రెండు ఏస్‌లు, ఒక సర్వీస్ విన్నర్‌ను సాధించింది. ఆమె తన సర్వ్‌పై పట్టు నిలుపుకొని, 4-2 ఆధిక్యం కోసం ఒక బ్రేక్‌ను దక్కించుకుని, 32 నిమిషాల్లోనే మొదటి సెట్‌ను ముగించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 53వ స్థానంలో ఉన్న సోన్మెజ్, రెండవ సెట్‌లో తన ఆటతీరును పెంచి, గౌఫ్ లయను దెబ్బతీయడానికి దూసుకెళ్లింది. ఆరంభంలోనే బ్రేక్ ఎదుర్కొన్న ఆమె, ఆ తర్వాత కోలుకుని మూడు బ్రేక్‌పాయింట్ అవకాశాలను సృష్టించుకుంది. అయితే, గౌఫ్ ఆ మూడింటినీ కాపాడుకుని, 16వ పాయింట్ వద్ద తన సర్వ్‌ను నిలబెట్టుకుంది. తిరిగి గౌఫ్ పుంజుకుని 4-3 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది మరియు తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని విజయాన్ని పూర్తి చేసింది. అంతకుముందు, ఐదవ సీడ్ మిర్రా ఆండ్రీవా, ప్రపంచ నంబర్ 36 జానిస్ టెన్‌ను 6-2, 6-2 తేడాతో ఓడించి అద్భుతమైన ఆరంభాన్ని సాధించింది. 19 ఏళ్ల ఈ రష్యన్ క్రీడాకారిణి న్యూయార్క్‌లో వరుసగా నాలుగో ఏడాది కూడా రెండో రౌండ్‌కు చేరుకుంది.



## కృత్రిమ మేధ ఉద్యోగాలకు
# భారీ డిమాండ్


**న్యూఢిల్లీ,సెప్టెంబరు 2:** భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంబంధిత ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఈ రంగంలో పనిచేసే ఉద్యోగుల జీతాలు 2024 నుంచి 2026 మధ్య ఏకంగా 23 శాతం పెరిగాయి. అదే సమయంలో కొన్ని సంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల్లో వేతనాలు తగ్గినట్లు ఉద్యోగాల వేదిక ఫౌండిట్ వెల్లడించింది. 2025లో ఎఐ ఉద్యోగాల జీతాలు యేడాది ప్రాతిపదికన 12 శాతం పెరిగాయి. ట్రాక్ చేసిన విభాగాల్లో ఇదే అత్యధిక వృద్ధి. కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లలో 9 శాతం చొప్పున వేతనాలు పెరిగాయి. మరోవైపు కంప్యూటర్ హార్డ్‌వేర్, ఈకామర్స్ రంగాల్లో జీతాలు తగ్గాయి. ఐటీ సర్వీసెస్‌లో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. ఎఐ రంగంలో 3 యేళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులకు యేడాదికి రూ.8.87 లక్షల నుంచి రూ.15.41 లక్షల వరకు వేతనం లభిస్తోంది. 15 యేళ్లకు పైగా అనుభవం ఉన్నవారికి ఇది రూ.70.99 లక్షల నుంచి రూ.89.24 లక్షల వరకు చేరుతోంది. ప్రత్యేక నైపుణ్యాలు అవసరమైన కంపెనీలు, ఎఐ స్టార్టప్‌లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఎక్కువగా ఉండటంతో దేశంలో అత్యధిక జీతాలు అందించే మార్కెట్‌గా బెంగళూరు నిలిచింది. అక్కడ సీనియర్ ఎఐ నిపుణులకు రూ.61.70 లక్షల నుంచి రూ.91.25 లక్షల వరకు వేతనం లభిస్తోంది. ఢిల్లీ, ముంబైతో పోలిస్తే ఇది దాదాపు 10-15 శాతం ఎక్కువ. హైదరాబాద్ కూడా వేగంగా ఎదుగుతున్న మార్కెట్‌గా నివేదిక పేర్కొంది. సైబర్ సెక్యూరిటీలో సీనియర్ ఉద్యోగులకు రూ.97.81 లక్షల వరకు వేతనం లభిస్తోంది. ట్రాక్ చేసిన విభాగాల్లో ఇదే అత్యధిక వేతన పరిమితి. ఇదే సమయంలో ఐటీ, ఐటీ సర్వీసెస్‌లో 3 యేళ్ల అనుభవం ఉన్నవారి జీతాలు రూ.2.68 లక్షల నుంచి రూ.5.08 లక్షల వరకు ఉన్నాయి. 15 యేళ్లకు పైగా అనుభవం ఉన్నవారికి రూ.57.55 లక్షల నుంచి రూ.72.13 లక్షల వరకు లభిస్తున్నాయి. ఈ రెండు విభాగాల్లో గతేడాది జీతాలు 1శాతం తగ్గాయి.

# 0.5శాతానికి పెరిగిన కరెంటుఖాతా లోటు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** భారత్ కరెంట్ అకౌంట్ లోటు ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 4.2 బిలియన్ డాలర్లకు, అంటే జిడిపిలో 0.5 శాతానికి పెరిగింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఈలోటు 3.4 బిలియన్ డాలర్లు లేదా జిడిపిలో 0.4శాతంగా నమోదైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన ప్రాథమిక బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ గణాంకాల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. కమోడిటీ వాణిజ్యలోటు భారీగా పెరగడమే క్యాడ్ విస్తరణకు ప్రధాన కారణంగా నిలిచింది. సేవల రంగం నుంచి పెరిగిన నికర ఆదాయం, వ్యక్తిగత నగదు బదిలీలు పెరిగినప్పటికీ పెరిగిన వాణిజ్య లోటును పూర్తిగా భర్తీ చేయలేకపోయాయి. తొలి త్రైమాసికంలో భారత్ వస్తు వాణిజ్య లోటు 86.1 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత యేడాది ఇదే కాలంలో ఇది 68.9 బిలియన్ డాలర్లుగాఉంది. ఈ త్రైమాసికంలో వస్తు ఎగుమతులు 112.7 బిలియన్ డాలర్ల నుంచి 132 బిలియన్ డాలర్లకు పెరిగాయి. అదే సమయంలో దిగుమతులు 181.6 బిలియన్ డాలర్ల నుంచి 218 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటులో ప్రధాన భాగమైన పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ లోటుకూడా 32.2 బిలియన్ డాలర్ల నుంచి 37.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. వాణిజ్య లోటు పెరుగుదలకు సేవల రంగం నుంచి వచ్చిన నికర ఆదాయం కొంతవరకు అడ్డుకట్ట వేసింది. నికర సేవల ఆదాయం గత యేడాది తొలి త్రైమాసికంలోని 47.9 బిలియన్ డాలర్ల నుంచి 51.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. సేవల ఎగుమతులు 97.4 బిలియన్ డాలర్ల నుంచి 106.2 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 49.5 బిలియన్ డాలర్ల నుంచి 54.6 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

# స్టాక్ మార్కెట్లపై యుద్ధమేఘాలు



## సెన్సెక్స్, నిఫ్టీల్లో అమ్మకాల జోరు

**ముంబయి, సెప్టెంబరు 2:** పశ్చిమాసియాలో ముదిరిన యుద్ధ మేఘాలు భారత స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. అమెరికా, ఇరాన్ మధ్య రాజుకున్న దాడుల విలయం దెబ్బకు బుధవారం దేశీయ సూచీలు భారీ పతనాన్ని చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల సంకేతాలు, క్రూడ్ ఆయిల్ ధరలు భయపెట్టే స్థాయిలో పెరగడంతో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు ఒడిగట్టారు. బిఎస్ఇ సెన్సెక్స్ 373.90 పాయింట్లు క్షీణించి 76,570.35 పాయింట్లవద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ కూడా141.35 పాయింట్లు క్షీణించి 23,914,45 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. మూడు సెషన్లలో సెన్సెక్స్ 0.90శాతం, నిఫ్టీ 1.08శాతం క్షీణించాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.55శాం, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 0.51శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో 1914 షేర్లు లాభపడితే 2428 షేర్లు క్షీణించగా 242 షేర్లు స్థిరంగా కొనసాగాయి. బ్రెంట్‌ముడిచమురు అక్టోబరు సెటిల్‌మెంట్‌ధర 22 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 94.87 డాలర్లుగా కొనసాగితే విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 95.97వద్ద స్థిరపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ ధరలు 0.89శాతం పెరిగి రూ.1,50,378కి చేరాయి.

అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతిగా ఇరాన్ విరుచుకుపడటంతో అంతర్జాతీయ చమురు మార్కెట్ భగ్గుమంది. బ్రెంట్ క్రూడ్ ధర ఏకంగా 5 శాతం వరకు ఎగబాకి బ్యారెల్‌కు 95.4 నుండి 96 డాలర్ల స్థాయికి చేరింది. చమురు అవసరాల కోసం విదేశాలపైనే ఎక్కువగా ఆధారపడే మన భారతదేశానికి ఇది కోలుకోలేని దెబ్బ. చమురు ధరలు పెరిగితే దేశంలో ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు, దిగుమతి బిల్లులు భారం కావడం ఖాయం. ఆసియా వ్యాప్తంగా ఉన్న ప్రధాన స్టాక్ మార్కెట్లు అన్నీ నష్టాల బాటపట్టాయి. సౌత్ కొరియా కోస్పి ఏకంగా 3 శాతానికి పైగా పడిపోగా, జపాన్ నిక్కీ కూడా అదే బాటలో పతనమైంది. అటు అమెరికాలోని వాల్ స్ట్రీట్ మార్కెట్లు, యూఎస్ 10 ఇయర్స్ బాండ్ రాబడులు 4.79 శాతానికి చేరుకోవడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికాలో వడ్డీ రేట్లు మళ్లీ పెరిగే అవకాశం ఉందన్న సంకేతాలతో విదేశీ ఇన్వెస్టర్లు భారత మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. చమురు ధరల ధాటికి పెట్రోలియం, పెయింట్స్, టైర్, విమానయాన రంగానికి చెందిన కంపెనీల షేర్లు విపరీతంగా నష్టపోయాయి.

హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఓసి వంటి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సీయట్, జేకే టైర్, ఎంఆర్ఎఫ్ వంటి టైర్ తయారీదారులు, పెయింట్ రంగంలో ఏషియన్ పెయింట్స్, విమానయాన దిగ్గజం ఇండిగో షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ పతనంలోనూ ప్రభుత్వ రంగ దిగ్గజం కోల్ ఇండియా మెరుపులు మెరిపించింది. ఆగస్టు నెలలో బొగ్గు సరఫరా 5.5 శాతం పెరిగిందన్న వార్తలతో పాటు, తన అనుబంధ సంస్థ ఐపీఓ ప్రతిపాదనల కారణంగా కోల్ ఇండియా షేరు ఏకంగా 3.6 శాతం లాభంతో ముగిసింది.

## ఐసిఐసిఐ బ్యాంక్‌కు
# విదేశీ డిపాజిట్లలో ర్యాలీ
## బైరేటింగ్ ఇచ్చిన యుబిఎస్, సిటీ సంస్థలు




**ముంబయి,సెప్టెంబరు 2:** ప్రైవేట్ రంగ ప్రముఖ బ్యాంక్ ఐసిఐసిఐ బ్యాంక్ విదేశీ డిపాజిట్ల ద్వారా గతనెలాఖరునాటి మొత్తం 17.88 బిలియన్ డాలర్లు సమీకరించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ప్రకటించిన రాయితీ స్వాప్ సదుపాయం ముగిసిన తేదీ కూడా ఆగస్టు 31నే కావడం గమనార్హం. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో దేశ బాహ్య రంగాన్ని బలోపేతం చేయడం, విదేశీ మారక ద్రవ్య లభ్యతను పెంచడం కోసం ఆర్‌బిఐ జూన్‌లో ఈ సదుపాయాన్ని ప్రకటించింది.ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం ఆగస్టు 21 నాటికి దేశంలోని బ్యాంకులు ఎఫ్‌సిఎన్‌ఆర్(బీ) డిపాజిట్ల రూపంలో 65.40 బిలియన్ డాలర్లు సమీకరించాయి.ఐసిఐసిఐ బ్యాంక్‌పై బ్రోకరేజీల విశ్వాసంఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్ల సమీకరణలో ఐసిఐసిఐ బ్యాంక్ అంచనాలను మించి రాణించడంతో అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థలు యుబిఎస్, సిటీ బ్యాంక్‌పై సానుకూలంగా ఉన్నాయి. ఇరు సంస్థలు ఐసిఐసిఐ బ్యాంక్‌కు బై రేటింగ్ కొనసాగించాయి. యుబిఎస్ షేర్‌కు రూ.1,800, సిటీ రూ.1,770 టార్గెట్ ధరను నిర్ణయించాయి.బ్యాంక్ 17.88 బిలియన్ డాలర్ల ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్లను సమీకరించడం అంచనాలకు మించి ఉందని యుబిఎస్, సిటీ పేర్కొన్నాయి. ఈ భారీ సమీకరణతో ఐసిఐసిఐ బ్యాంక్ బ్యాలెన్స్‌షీట్‌ను గణనీయంగా విస్తరించుకునే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాయి. సిటీ అంచనా ప్రకారం ఈ డిపాజిట్ల ర్యాలీవల్ల 2027 ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ ఆదాయం, ప్రీ ప్రొవిజన్ ఆపరేటింగ్ ప్రాఫిట్‌లు 2.53 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. రానున్న రెండు త్రైమాసికాల్లో బ్యాంక్ మొత్తం నికరవడ్డీమార్జిన్ 10-20 బేసిస్ పాయింట్లు తగ్గే అవకాశం ఉందని సిటీ పేర్కొంది. ఈమార్జిన్ తగ్గుదల బ్యాంక్ వేగవంతమైన వృద్ధికి సంబంధించిన వ్యూహాత్మక పరిణామమేనని యూబీఎస్, సిటీ అభిప్రాయపడ్డాయి. భవిష్యత్తులో సేకరించిన నిధులను ఎంత వేగంగా రుణాలుగా మళ్లిస్తారు, తక్కువ వ్యయంతో లభించిన డిపాజిట్లను ఎంత సమర్థవంతంగా వినియోగిస్తారు అన్నదానిపైనే మార్జిన్ల పునరుద్ధరణ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నాయి.

## భారత్‌లో మూడురెట్లు పెరిగిన
# యుఎస్ పెట్టుబడులు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 2:** భారతీయ సెక్యూరిటీల్లో అమెరికా పెట్టుబడులు గత పదేళ్లలో మూడురెట్లకు పైగా పెరిగింది. 2015లో 130బిలియన్ డాలర్లుగా ఉన్న అమెరికా పెట్టుబడుల విలువ 2025 నాటికి 390 బిలియన్ డాలర్లకు చేరినట్లు అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన డేటా స్పష్టంచేస్తోంది. అమెరికా పెట్టుబడిదారులకు గణనీయమైన పోర్ట్‌ఫోలియో ఎక్స్‌పోజర్ ఉన్న 30 దేశాల జాబితాలో భారత్ 12వ స్థానంలో నిలిచింది. అమెరికా పెట్టుబడులు అత్యధికంగా కేమన్ దీవుల్లో ఉన్నాయి. అక్కడ అమెరికా పెట్టుబడుల విలువ 3.073 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఆ తర్వాత బ్రిటన్‌లో 2.007 ట్రిలియన్ డాలర్లు, కెనడాలో 1.886 ట్రిలియన్ డాలర్లు, జపాన్‌లో 1.483 ట్రిలియన్ డాలర్లు, ఐర్లాండ్‌లో 1.182 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు ఉన్నాయి.2025 చివరి నాటికి విదేశీ సెక్యూరిటీల్లో అమెరికా పోర్ట్‌ఫోలియో పెట్టుబడులపై నిర్వహించిన వార్షిక సర్వే ప్రాథమిక గణాంకాలను విడుదల చేశారు. ఈ సర్వేను అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్, ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్, ఫెడరల్ రిజర్వ్ సిస్టమ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సంయుక్తంగా నిర్వహించాయి. 2025 చివరి నాటికి విదేశీ సెక్యూరిటీల్లో అమెరికా పెట్టుబడుల మొత్తం విలువ సుమారు 19.3 ట్రిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో 15.3 ట్రిలియన్ డాలర్లు విదేశీ ఈక్విటీల్లో, 3.6 ట్రిలియన్ డాలర్లు దీర్ఘకాలిక రుణ సెక్యూరిటీల్లో, 0.4 ట్రిలియన్ డాలర్లు స్వల్పకాలిక రుణ సెక్యూరిటీల్లో ఉన్నాయి. భారతీయ ఈక్విటీల్లో అమెరికా పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల విలువ 2025 చివరి నాటికి 380 బిలియన్ డాలర్లుగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.